www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
VELTHURU TELUGU DAILY
రంగారెడ్డి
# వెలుతురు
తెలుగు దినపత్రిక
శనివారం 7 జూన్ 2025
సంపుటి :07 సంచిక : 11 , పేజీలు : 12 వెల:రూ.5/-



## రాజకీయాలతో సంబంధం లేకుండా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నా ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు జూన్ 06:**
రాజకీయాలతో సంబంధం లేకుండా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే పాయల్ శంకర్

# చినాబ్ వంతెన
## కశ్మీర్ పురోగతికి ప్రతిబింబం





- కశ్మీర్‌లో అభివృద్ధిని ఎవ్వరూ ఆపలేరు
- ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులకు బుద్ధి చెప్పాం
- పర్యాటకాన్ని దెబ్బతీసి..పేదల పొట్టకొట్టాలని పాక్ పన్నాగం
- రైలువంతెన ప్రారంభించిన అనంతరం ప్రధాని మోడీ వెల్లడి
- బ్రిటిషర్లు కూడా చేయలేని పనిని మోడీ చేసి చూపారన్న ఒమర్



- కాశ్మీర్‌లో మరో అద్భుతం ఆవిష్కరణ
- చీనాబ్ రైల్వే వంతెనకు ప్రధాని మోడీ పచ్చజెండా
- రైలు బోగీలో ప్రయాణించిన మోడీ తదితరులు
- ఈఫిల్ టవర్‌కన్నా ఎత్తయిన వంతెనగా ప్రసిద్ధి
- శ్రీనగర్-వైష్ణోదేవి మధ్య నేటి నుంచి రాకపోకలు

**శ్రీనగర్,జూన్6( వెలుతురు):**
ప్రపంచంలోనే ఎత్తైన చినాబ్ రైల్వే వంతెనను ప్రధాని మోడీ అట్టహాసంగా ప్రారంభించారు. ఆపరేషన్ సిందూర్ తరవాత తొలిసారిగా ప్రధాని మోడీ కాశ్మీర్‌కు వెళ్లారు. శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జమ్ము కశ్మీర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ కేంద్రం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి చీనాబ్ రైలు వంతెనను ప్రధాని ప్రారంభించారు. జెండా ఊపి రైల్వే వంతెనపై రాకపోకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే బ్రిడ్జిపై పరుగులు తీసిన కోచ్‌లో ప్రధాని ప్రయాణించారు. ఆయన వెంట కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా కూడా ఉన్నారు. భారత దేశం మరో అద్భుత కట్టడానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. చీనాబ్ నదిపై ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి నిర్మాణం జరిగింది. చీనాబ్ రైల్వే బ్రిడ్జిగా పిలువబడుతున్న ఈ బ్రిడ్జి శుక్రవారం ఉదయం ప్రారంభం అయింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ బ్రిడ్జిని ప్రారంభించారు. అనంతరం ఉదమ్‌పూర్.. శ్రీనగర్.. బారాముల్లా రైల్



లింక్ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు.. ఈ చినాబ్ రైల్వే వంతెన ఈఫిల్ టవర్ కంటే ఎత్తుగా ఉంటుంది. ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే వంతెన చినాబ్ సొంతం. అలాంటి రైల్వే వంతెనను ప్రధాని మోడీ శుక్రవారం జాతికి అంకింతం చేశారు. రూ.46వేల కోట్లతో ఈ ప్రాజెక్టును నిర్మించారు. శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా నుంచి శ్రీనగర్ వరకు వందే భారత్ రైలును కూడా జెండా ఊపి ప్రారంభించారు. వంతెన కారణంగా ఈ మార్గం ప్రధానంగా పర్యాటరంగాన్ని మరింత ఆకర్షించనుంది. శ్రీ మాతా వైష్ణో దేవి ఆలయాన్ని వందలాది మంది యాత్రికులు దర్శిస్తుంటారు. ఈ రైల్వే వంతెన ప్రారంభంతో పర్యాటకరంగంగా మరింత పుంజుకోనుంది. ఈ చినాబ్ బ్రిడ్జి 1,315 మిటర్లు విస్తరించి ఉంది. కఠినమైన వాతావరణాన్ని కూడా ఈ వంతెన తట్టు-



## ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు
### - మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్ వెలుతురు జూన్ 06:**
ఈద్ అల్-అధా త్యాగం, నిస్వార్థ సేవ, సోదరభావాన్ని చాటిచెప్పే బక్రీద్ (ఈద్ అల్-అధా) పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు మంత్రి పొన్నం ప్రభాకర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రజలందరి మధ్య శాంతి, సామరస్యం, ఐక్యతను పెంపొందించాలని ఆకాంక్షించారు. "బక్రీద్ పండుగ మనకు త్యాగం యొక్క గొప్పతనం తో పాటు నిరుపేద ప్రజల పట్ల దయను గుర్తు చేస్తుందని తెలిపారు. ఈ పండుగ సందర్భంగా, మనం ఒకరికొకరు సహాయం చేసుకుంటూ, సమాజంలో ప్రేమను, ఆనందాన్ని పంచుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.ఈ పండుగ వారి జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని ,పండుగ సందర్భంగా, సామరస్యపూర్వక వాతావరణంలో పండుగను జరుపుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

## ఇక పట్టణాల్లోనూ
# ఇందిరమ్మ ఇండ్లు

- జీవనోపాధికి ఇబ్బంది లేకుండా పేదలు ఉన్న చోటే జి౦3 పద్ధతిలో ఇండ్ల నిర్మాణం
- గిరిజనులకు ప్రత్యేకంగా 22 వేల ఇండ్లు
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్ వెలుతురు జూన్ 06 :**
పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ గ్రామీణ ప్రాంతాలలో ఒక కొలిక్కి తీసుకువచ్చిన

# బిఆర్ఎస్ కాదు..
# అది డిఆర్ఎస్



*పదేళ్లలో ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేకపోయిన ఘనత బిఆర్ఎస్‌దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట వద్ద అపచారానికి మూల్యం చెల్లించుకున్నారు. పాపాలు చేసినందునే మీ పరిస్థితి ఆ విధంగా మారింది. తమ పార్టీలో దెయ్యాలు చేరాయని ఆ పార్టీ నాయకురాలే చెప్పారు. జవాబివ్వలేక దెయ్యాల నేత ఫాంహౌస్‌లో నిద్రపోతున్నారు. బీఆర్ఎస్ కాదు.. డీఆర్ఎస్.. దెయ్యాల రాజ్యసమితి. కొరివి దెయ్యాలను తరిమికొట్టే బాధ్యత నేను తీసుకుంటా. అందుకు కార్యకర్తల సహకారం కావాలని రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో రూ.1500 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు.*

- అదో దెయ్యాల రాజ్యసమితి
- కవిత వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం
- ఫామ్ మౌజ్‌లో నిద్రపోతున్న దెయ్యాల నేత
- యాదగిరిగుట్ట పర్యటనలో సిఎం రేవంత్ విమర్శలు

గంధమల్ల రిజర్వాయర్‌ను ఎందుకు పూర్తి చేయలేదు

మూసీ ప్రక్షాళన చేస్తామంటే ఎందుకు అడ్డుకుంటారు

తిరుమలలాగా యాదగిరి గుట్ట అభివృద్ధి

యాదగిరి గుట్టలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం

పలు అభివృద్ధి పనులకు సిఎం రేవంత్ శంకుస్థాపన



**యాదగిరిగుట్ట,జూన్6( వెలుతురు):**
గంధమల్ల రిజర్వాయర్‌ను గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు పూర్తిచేయలేకపోయిందని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. యాదగిరిగుట్ట పేరును గత ప్రభుత్వంలో యాదాద్రిగా మార్చారని, మేం వచ్చాక మళ్లీ ప్రజలంతా పిలుచుకునే యాదగిరిగుట్టగా మార్చామన్నారు. తిరుమల మాదిరిగా యాదగిరి గుట్ట ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని సీఎం రేవంత్ వెల్లడించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం పర్యటిం చారు. ఈ పర్యటనలో

# రాజన్న కోడెలపై రాజకీయం వద్దు

- 10 ఏళ్ల పాలనలో మీరేంచేశారో చెప్పగలరా?
- గత ప్రభుత్వంలో వేములవాడకి నిధులు ప్రకటించి ఒక్క పైసా కూడా ఇవ్వలేదు?
- మీ వల్లే కోడెలకు నేడు ఈ దుస్థితి కోడెల మృతిపై మేము వెంటనే స్పందించాం
- ఆ ఘటనపై చర్యలు తీసుకున్నాం అయినా, బురద రాజకీయం సరికాదు
- రాష్ట్ర దేవ్దాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్ వెలుతురు జూన్ 06:**
రాజన్న కోడెలపై రాజకీయమొద్దని.. గడిచిన 10 ఏండ్లలో వేములవాడ టెంపుల్ కి సంబంధించి.. దేవాదాయ శాఖకు సంబంధించి బీఆర్ఎస్ పాలనలో ఏం చేశారో చెప్పగలరా? అని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సూటిగా ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వేములవాడ టెంపుల్ కి కేసీఆర్ ఇచ్చిన హామీల్లో ఒక్క పైసా కూడా ఇవ్వలేదని ఆమె నిలదీశారు. హామీ ఇచ్చిన నిధులు కేటాయించకపోవడం వల్లనే



## రూ.25వేల కోట్ల అవినీతి ఆరోపణల కేసు

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు సుప్రీం నోటీసులు

**న్యూఢిల్లీ,జూన్ 6( వెలుతురు):**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ చేసిన రూ.25వేల కోట్ల అవినీతి ఆరోపణల

## నీట్- 2025 ఎంట్రన్స్ టెస్ట్ వాయిదా

- ఆగస్ట్ 3న నిర్వహించనున్న ఎన్‌బీఈ
- వాయిదాను అంగీకరించిన సుప్రీం కోర్టు



# నిన్న కేబినెట్ లో ప్రజా సమస్యల పై చర్చించలేదు

- ప్రజల్ని మరో సారి ప్రభుత్వం వంచించింది
- ఇది ఎగవేత ల ప్రభుత్వం
- 5 DA లు పెండింగ్ లో ఉన్నాయి
- రైతు భరోసా గత పంటదే పూర్తిగా ఇవ్వలేదు... ఎగ్గొట్టిన భరోసా ను ఇవ్వాలి
- నిరుద్యోగులకు, మహిళలకి ఈ ప్రభుత్వం 63 వేల కోట్లు బకాయి పడ్డది
- 10 రకాల పంటలకు బోనస్ ఇవ్వాలి
- ఓటమి భయం తోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదు
- ఎన్నికలకి వెళితే నడుము ప్రజలు విరగకొడుతారు
- గంటకు 13 కోట్లు ఈ ప్రభుత్వం బాకి తీసుకొస్తుంది
- ఫీ రీ ఇంబర్స్మెంట్ బకాయిలు చెల్లించాలి



- వివిధ వర్గాల సమస్యలను చర్చించకుండా మరోసారి వంచించిన క్యాబినెటు.. కాంగ్రెస్ సర్కారు ఓ ఎండమావి అని నిరూపితమైంది.
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జూన్ 06:**
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినప్పటికీ వివిధ వర్గాలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనడానికి నిన్నటి క్యాబినెటు మీటింగు నిర్ణయాలే నిదర్శనం. నిన్న ఆరు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన క్యాబినెటు మీటింగులో ఒక్క ఉద్యోగుల సమస్యలు తప్ప మిగిలిన వర్గాల సమస్యల గురించి చర్చించి పరిష్కారాలు చూపకపోవడం శోచనీయం. ప్రజల పక్షాన నిలిచే ప్రతిపక్షంగా మేం క్యాబినెటు మీటింగులో వివిధ వర్గాలకు ఇచ్చిన హామీల అమలుపై చర్చించాలని సూచించాం. కానీ కాంగ్రెస్ క్యాబినెటుకు ప్రజా సమస్యలు పట్టవని, ఇది హామీల ఎగవేతల సర్కారు అని మరోసారి నిరూపితమైంది. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులు, వృద్ధులు ... ఇలా వివిధ వర్గాల వారు తమ సమస్యలపై క్యాబినెటు సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశించారు.

(మొదటి పేజీ తరువాయి..)

## రాజకీయాలతో సంబంధం లేకుండా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నా ఎమ్మెల్యే పాయల్ శంకర్



పేర్కొన్నారు జైనథ్ మండలం దీపాయిగూడ గ్రామంలో శ్రీ రాముల కల్యాణ మండపం నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 50 లక్షల నిధుల వ్యయంతో కళ్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అలాగే మకోడ గ్రామంలో గ్రామపంచాయతీ బిల్డింగ్ 20 లక్షలతో శుక్రవారం రోజున ప్రారంభించారు ఆకుర్ల గ్రామంలో గ్రామ పంచాయతీ బిల్డింగ్ ని ప్రారంభించారు అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు అందే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా మొదటి విడతగా గ్రామంలో 30 ఇళ్లను మంజూరు చేసుకోవడం జరిగిందన్నారు. ఒక మంచి ఆలోచనతో నీతితో విలువలతో కూడిన రాజకీయం చేస్తూ ముందుకు వెళుతున్నానని అన్నారు. నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన అవకాశం వల్లనే అసెంబ్లీలో రైతుల సమస్యలపై మాట్లాడి వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేయడం జరిగిందన్నారు. అధికారమనేది సొంతం కాదని.. ప్రజలకు సేవ చేయడమే ముఖ్యమని తెలిపారు. దీపాయిగూడలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఏ రోజు కూడా గ్రామానికి వచ్చిన దీపాయిగూడ గ్రామస్తులు తనకు మనస్ఫూర్తితో ఆశీర్వాదం అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అధికారులు మండల అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి . రాకేష్ రెడ్డి. అశోక్ రెడ్డి. విశాల్ విజయ్ గంగాధర్ భూమన్న వేద వ్యాస్ భూమన్న సింగడి రమేష్ రెడ్డి. ఆసి రెడ్డి. వెంకట్ రెడ్డి.. దత్త తదితరులు పాల్గొన్నారు.

## ఇక పట్టణాల్లోనూ ఇందిరమ్మ ఇండ్లు

నేపథ్యంలో పట్టణ ప్రాంతాలలో కూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై దృష్టి సారించామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ.. పట్టణాల్లోని మురికి వాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండడానికి ఇష్టపడుతున్నారని ముఖ్యంగా హైదరాబాద్ కు దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో ఇండ్లు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. హైదరాబాద్ కు దూరంగా గతంలో 42 వేల ఇండ్లను నిర్మించగా సుమారు 19 వేల మంది మాత్రమే అక్కడికి వెళ్లారు. ఇటీవల క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలన జరుపగా కేవలం 13 వేల మంది మాత్రమే ఆ నివాసాలలో ఉంటున్నట్లు తేలిందన్నారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని పట్టణ ప్రాంతాలలో ప్రధానంగా హైదరాబాద్ నగరంలోని మురికి వాడల్లో పేదలు ఉన్నచోటే జి౦3 పద్ధతిలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా తొలివిడతలో హైదరాబాద్‌లో 16 మురికివాడలను గుర్తించామని. అలాగే వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ కరీంనగర్ తదితర పట్టణాలలో కూడా ఇదే విధానాన్ని అమలు చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ఏండ్ల తరబడి నిలువ నీడలేక, తలదాచుకోవడానికి గూడు లేని చెంచులకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి సూచన మేరకు భద్రాచలం, ఉట్నూరు, ఏటూరునాగారం, మున్ననూరు నాలుగు ఐటిడిఎ పరిధిలోగల చెంచు, కొలం, తోటి, కొండరెడ్లకు 13,266 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని అలాగే రాష్ట్రంలోని 16 ఎస్టీ నియోజకవర్గాలకు ఇప్పటికే 8,750 ఇండ్లు మంజూరు చేశామని దీనితో కలిపి గిరిజనులకు ఇంతవరకు 22,016 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఇండ్లకు తక్షణమే లబ్దిదారులను గుర్తించి ఇండ్ల నిర్మాణ ప్రక్రియను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, నిర్మాణంలో మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఇండ్ల నిర్మాణం జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా పేదవాళ్ల ఇంటికోసం ఐదు లక్షల రూపాయిలు ఖర్చు చేయడం లేదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని , దీనికి అనుగుణంగా అధికార యంత్రాంగం పనిచేయాలని అన్నారు.

## రూ.25వేల కోట్ల అవినీతి ఆరోపణల కేసు

కేసులో సుప్రీం నోటీసులిచ్చింది. కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంలో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సతీశ్ చంద్రశర్మతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను విచారించింది. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిందంటూ కేటీఆర్ గతంలో ఆరోపణలు చేశారు. దీంతో కేటీఆర్ చేసిన ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ.. ఉట్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నేత ఫిర్యాదుతో కేటీఆర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని గతంలోనే కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న హైకోర్టు.. కేటీఆర్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టి వేస్తూ తీర్పు ఇచ్చింది. అయితే హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుగుణ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం విచారణ జరుగగా.. పిటిషన్‌పై సమాధానం చెప్పాలంటూ కేటీఆర్‌కు సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

## నీట్- 2025 ఎంట్రన్స్ టెస్ట్ వాయిదా

**న్యూఢిల్లీ,జూన్6(ఆర్ఎన్ఎ):**

నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ నీట్- 2025 పరీక్షను వాయిదా వేయాలన్న నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అభ్యర్థనకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఆమోదం తెలిపింది. జూన్ 15వ తేదీన జరగాల్సిన పరీక్షను ఆగస్టు 3వ తేదీన నిర్వహించేందుకు అనుమతి ఇచ్చింది. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా న్యాయమూర్తి పీకే మిశ్రా నేతృత్వంలోని బెంచ్.. పరీక్ష వాయిదాపై కేంద్రాన్ని, ఎన్‌బీఈని ప్రశ్నించింది. 'ఇంకా రెండు నెలలు పరీక్షను వాయిదా వేయటం ఎందుకు..జులై రెండు లేదా మూడో వారంలో పరీక్ష నిర్వహించవచ్చుగా' అని అడిగింది. కేంద్రం తరఫున అదనపు సోలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ స్పందిస్తూ..' లాజిస్టికల్ సవాళ్ల కారణంగా పరీక్ష వాయిదా పడింది. పరీక్ష కేంద్రాల సంఖ్యను రెట్టింపు చేయడం, కఠినమైన భద్రతా ఏర్పాట్లను చేపట్టడం వంటి వాటి కోసం ఈ నిర్ణయం తీసుకోవటం జరిగింది. చిన్న పొరపాట్లు- పరీక్ష ప్రక్రియపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే పరీక్షను వాయిదా వేయడానికి ఎన్బీఈ నిర్ణయించిందని తెలిపారు.అనంతరం న్యాయమూర్తి మిశ్రా మాట్లాడుతూ.. ' పరీక్ష ఎప్పుడు జరిగినా నిష్పక్షపాతంగా, సమగ్ర భద్రతతో జరగాలని స్పష్టం చేశారు. గత వారం ఇచ్చిన తీర్పును కూడా సుప్రీంకోర్టు ప్రస్తావించింది. అప్పటి నుంచి మీరు ఏం చేశారంటూ ఎన్‌బీఈని ప్రశ్నించింది. దీనిపై ఎన్‌బీఈ మాట్లాడుతూ.. ' పరీక్ష విషయంలో మేము ఏమాత్రం రాజీ పడదలచుకోవడం లేదని స్పష్టం చేసింది. కాగా, నీట్ పీజీ పరీక్షను రెండు షిఫ్టుల్లో జరపడానికి పర్మిషన్ కోరుతూ ఎన్‌బీఈ గతంలో సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దానిపై విచారణ జరిపిన కోర్టు ఎన్‌బీఈ ప్రతిపాదనను తోసిపుచ్చింది. రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరిగితే విద్యార్థులపై చెడుగా ప్రభావం చూపే అవకాశం ఉందని అభిప్రాయపడింది. దేశ వ్యాప్తంగా ఒకే షిఫ్టులో పరీక్ష పెట్టాలని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలోనే పరీక్ష ఒకే షిఫ్టులో జరపడానికి మరింత సమయం కావాలని బోర్డు కోరింది. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన కోర్టు ఆగస్టు 3వ తేదీన పరీక్ష జరపడానికి అవకాశం కల్పించింది. ఒకే షిఫ్ట్‌లో పరీక్షను ముగించాలని ఇటీవల అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పరీక్ష నిర్వహణ తేదీని జూన్ 15 నుంచి మార్చుకునేందుకు వీలు కల్పించింది.వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే జాతీయస్థాయి అర్హత పరీక్ష (నీట్)కు సంబంధించి ఇటీవల సుప్రీంలో విచారణ జరిగింది. పరీక్షను రెండు షిఫ్ట్‌లలో నిర్వహించడానికి నిరాకరించింది. దానివల్ల కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొంది. పరీక్ష నిర్వహణలో పూర్తి పారదర్శకతను పాటించాలని, సురక్షితమైన పరీక్షా కేంద్రాలనే ఎంచుకోవాలని సూచించింది. రెండు ప్రశ్నపత్రాలు ఎప్పటికీ ఒకేవిధమైన కాఠిన్య లేదా సులభ స్థాయిని కలిగిఉండవని అభిప్రాయపడింది. పోటీ- తీవ్రత దృష్ట్యా ప్రతి మార్కూ ర్యాంకు నిర్ధరణలో అత్యంత కీలకమేనని తెలిపింది. నార్మలైజేషన్ విధానాన్ని కొన్ని ప్రత్యేక కేసుల్లో మాత్రమే అనుసరించాలని, ప్రతి ఏడాదీ నిర్వహించుకొనే పరీక్షకు అది సరికాదని ధర్మాసనం పేర్కొంది.

# చినాబ్ వంతెన కశ్మీర్ పురోగతికి ప్రతిబింబం

కోగలదు. ఈ ప్రాంతం భూకంపం జోన్ 5లో ఉంది. ఇంజనీర్లు అత్యంత అద్భుతంగా ప్రణాళికలు వేసి ఈ బ్రిడ్జిని నిర్మించారు. గంటకు 260 కిలోమీటర్ల వేగంతో ప్రచండమైన గాలులు వీచినా ఈ వంతెనకు ఏం కాదు. బలమైన గాలులు తట్టుకునే విధంగా నిర్మించారు. ఇక వంతెన నిర్మించడానికి దాదాపు 30,000 టన్నుల ఉక్కును ఉపయోగించారు. ప్రస్తుతం ఇదే ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే ఆర్చ్ వంతెనగా నిలుస్తుంది. చీనాబ్ వంతెన నిర్మాణం 2002లో వాజ్‌పేయ్ హయాంలో ప్రారంభించగా 2022లో మోడీ హయాంలో పూర్తయ్యింది. ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైలు మార్గం ప్రాజెక్టులో భాగంగా ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి విజయవంతంగా ముగించారు. శనివారం నుంచి శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా రైల్వే స్టేషన్ నుంచి శ్రీనగర్ వరకు వందే భారత్ రైళ్లు పరిగెత్తనున్నాయి. ప్రధాని ప్రారంభించిన చీనాబ్ రైల్వే బ్రిడ్జి ప్రత్యేకతల విషయానికి వస్తే.. ఇది ఈఫిల్ టవర్ కంటే చాలా ఎత్తైనది. ఈఫిల్ టవర్ ఎత్తు 330 మీటర్లు మాత్రమే. కానీ, ఈ బ్రిడ్జి ఏకంగా 359 మీటర్ల ఎత్తులో ఉంది. ఈ బ్రిడ్జి పొడవు 1,315 మీటర్లు. కట్టింగ్ ఎడ్జ్ ఇంజనీరింగ్ టెక్నాలజీతో దీన్ని నిర్మించారు. ఈ బ్రిడ్జి గంటకు 266 కిలోమీటర్ల వేగంతో గాలి వీచినా కూడా ఏమాత్రం చెక్కు చెదరదు. ఈ బ్రిడ్జిలో ఆసక్తికరమైన మరో ప్రత్యేకత ఏంటంటే.. ఆ బ్రిడ్జి బ్లాస్ట్ రెసిస్టంట్ స్టీలు, కాంక్రీట్‌తో తయారు అయింది. బాంబు దాడులను సైతం బ్రిడ్జి తట్టుకుని నిలబడగలదు.

చినాబ్ వంతెన ప్రారంభోత్సవం జమ్మూకశ్మీర్ పురోగతికి ప్రతిబింబమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా.. కశ్మీర్‌లో అభివృద్ధిని ఆపలేరన్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత తొలిసారి కశ్మీర్ లోయలో పర్యటించిన ప్రధాని.. ప్రపంచంలోనే ఎత్తైన బ్రిడ్జిగా నిలిచిన చినాబ్ వంతెనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు- చేసిన కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ.. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావించారు. ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పామని పునరుద్ఘాటించారు. మన పొరుగు దేశం పర్యాటకానికి, మానవత్వానికి వ్యతిరేకం. మన పర్యాటకాన్ని దెబ్బతీసి పేదల పొట్టగొట్టాలని చూస్తోంది. ఆదిల్ హుస్సేన్ గుర్రం మీద పర్యాటకులను తీసుకెళ్లే పోనీవాలా. తన కుటుంబాన్ని పోషించేందుకు కష్టపడే అతడు.. ఆ రోజు ఉగ్రవాదులతో వీరోచితంగా పోరాడాడు. అతడినీ ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో వెనక్కి తగ్గేది లేదు. పాక్ కుయుక్తులను భారత్ ఎప్పటికప్పుడు ఎండగడుతూనే ఉంటుందన్నారు.. ఉగ్ర కుట్రలకు దీటుగా బదులిస్తున్నాం. కశ్మీర్‌లో పర్యాటకాన్ని ధ్వంసం చేయాలని, దేశంలో అల్లర్లు సృష్టించాలని పహల్గాంలో ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. అమాయక ప్రజల ప్రాణాలు పొట్టనబెట్టుకున్నారు. దానికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్‌తో మన శక్తి ఏంటో చూపించాం. సరిగ్గా నెల రోజుల క్రితం పొరుగు దేశంలోని ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేశాం. పాక్ నాయకత్వానికి నిద్ర లేకుండా చేశాం. ఎన్ని కుట్రలు పన్నినా కశ్మీర్ అభివృద్ధిని అడ్డుకోలేరని మోదీ పునరుద్ఘాటించారు. ఈఫిల్ టవర్ కన్నా ఎత్తైన వంతెనను నిర్మించుకున్నాం. భారత ఇంజనీరింగ్ నైపుణ్యానికి చినాబ్ బ్రిడ్జ్ ఓ ప్రతీక. ఈ వంతెన నిర్మాణంతో ఈ ప్రాంతం పర్యాటక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ బ్రిడ్జ్ నిర్మాణంలో ఎన్నో సవాళ్లు ఎదురైనా.. మాతా వైష్ణోదేవి ఆశీర్వాదంతో ఇది సాధ్యమైంది. ఈ రోజుతో భారత రైల్వే నెట్‌వర్క్‌తో కశ్మీర్ కూడా అనుసంధానమైంది. ఇక కశ్మీర్ నుంచి కన్యాకుమారి అనేది వాస్తవ రూపంలోకి వచ్చినట్లయ్యింది. ఈ రోజు కోసం అనేక తరాలు ఎదురుచూశాయి. సీఎం ఒమర్ అబ్దుల్లా కూడా 8వ తరగతి నుంచే ఈ ప్రాజెక్ట్ కోసం కలలు కన్నారు. ఇప్పుడు భాజపా ప్రభుత్వం దాన్ని నెరవేర్చిందని ప్రధాని మోదీ తెలిపారు.శతాబ్దాల కలను నెరవేరుస్తూ ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే ఆర్చ్ బ్రిడ్జి చీనాబ్ రైల్ బ్రిడ్జిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం నాడు ప్రారంభించారు. కట్‌డా నుంచి కాశ్మీర్‌కు వెళ్లే వందేభారత్ రైలుకు జెండా ఊపడం ద్వారా వంతెన అందుబాటులోకి వచ్చింది. బ్రిటిషర్ల కాలం నాటి ప్రణాళిక ఇన్నేళ్లకు కార్యరూపం దాల్చిందంటూ ప్రధాని మోదీపై కాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ప్రశంసలు కురిపించారు. బ్రిటిషర్లు చేయలేని పని మోదీ చేశారని ఈ సందర్భంగా ఏర్పాటు- చేసిన కార్యక్రమంలో ఒమర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ -ట్రైన్ సర్వీస్ కోసం ఎందరో కలలు కన్నారని, బ్రిటిషర్లు ఆ పని చేయలేకపోయినప్పటికీ ప్రధాని దానిని పూర్తి చేశారన్నారు. ఇప్పుడు కాశ్మీర్ లోయకు యావద్దేశంతో అనుసంధానం జరిగిందని అన్నారు. ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్ లింగ్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన చినాబ్ వంతెన మోడ్రన్ ఇంజనీరింగ్ అద్భుతంగా నిలిచింది. 1,315 మీటర్ల పొడవు, 359 మీటర్ల ఎత్తుతో నిర్మించిన ఈ వంతెన ప్రపంచంలో ఎత్తైన ఐఫిల్ టవర్ టవర్ కంటే 30 మీటర్లు ఎక్కువ కావడం విశేషం. 2002లో అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన జరిగింది. 23 ఏళ్ల తర్వాత ప్రధానమంత్రి మోదీ దీనిని సాకారం చేశారు. చీనాబ్ బ్రిడ్జి వంతెన ప్రారంభోత్సవానికి రాజకీయ ప్రాధాన్యత ఉందని ఒమర్ అబ్దుల్లా పేర్కొంటూ, ఇందుకు గత నాయకులు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. త్వరలోనే జమ్మూకాశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా లభిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. అటల్ బిహారీ వాజ్‌పేయి పేరును ఈ సందర్భంగా గుర్తుచేసుకోకుంటే తాను తప్పుచేసిన వాడినవుతానని సీఎం అన్నారు. తాను 8వ తరగతిలో ఉన్నప్పుడు ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగిందని ఒమర్ గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు తన వయస్సు 55 ఏళ్లని, ఇప్పటికి ప్రాజెక్టు పూర్తయిందని చెప్పుకొచ్చారు. ఈ ప్రాజెక్టులు జాతీయ ప్రాధాన్యత కలిగినవిగా వాజ్‌పేయి హోదా ఇవ్వడం, అలాగే బడ్జెట్‌ను పెంచడం వల్లే నేడు ఇది సాకారమైందని అన్నారు.జమ్మూకాశ్మీర్‌లోని అనంతనాగ్ స్టేషన్ నుంచి బనిహాల్ టన్నెల్, కాత్రా స్టేషన్, ఇప్పుడు చీనాబ్ బ్రిడ్జ్.. ఇలా ప్రతి కీలక ప్రాజెక్టులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాలుపంచుకునే అవకాశం కలగడం తన అదృష్టమని ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఈ వంతెన లాగానే పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు శరవేగంగా నిర్మాణమవు తున్నాయని చెప్పారు. చీనాబ్ రైల్వే బ్రిడ్జి అంటే కేవలం స్టీలు, కాంక్రీట్‌తో నిర్మితమైనదే కాదని, తరతరాల ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపమని తెలిపారు. జమ్మూకశ్మీర్ ప్రజలకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటు-ందని చెప్పారు. వికసిత్ జమ్మూకాశ్మీర్ లక్ష్య సాధనకు చిత్తశుద్ధితో పనిచేస్తామని, జమ్మూకాశ్మీర్ ప్రజల తరఫున ప్రధానమంత్రికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియ జేసుకుంటున్నానని అన్నారు.

## రాజన్న కోడెలపై రాజకీయం వద్దు

వేములవాడలో రాజన్న కోడెలకు ఈ దుస్థితి వచ్చిందని ఆగ్రహించారు. నేటి ఈ కోడెల దుస్థితికి పాపం కేసీఆర్ పాలనదేనని అన్నారు. అయితే, కోడెల ఘటన జరిగిన వెంటనే తమ ప్రభుత్వం స్పందించిందని అన్నారు. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకొని ముందుకు వెళు తున్నట్టు చెప్పారు. అయినా, ప్రతిపక్ష పార్టీలు ఈ విషయంలో బురద రాజకీయం చేయడం సరికాదన్నారు. శు క్రవారం ఈ మేరకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. తమ హయాంలో సక్సెస్ ఫుల్ గా సరస్వతీ పుష్కరాలు నిర్వహించామన్నారు. పుష్కరాలకు 30 లక్షల మంది భక్తులు వచ్చినా ఎక్కడా చిన్న ఇబ్బంది జరగకుండా నిర్వహించామన్నారు. ఇక భద్రకాళి టెంపుల్ విస్తరణ పనులు కోట్లాది రూపాయలతో చేపట్టామన్నారు. యాదగిరిగుట్ట మీద కేసీఆర్ బొమ్మలను చెక్కించుకున్న వాళ్ళకి అసలు దేవుళ్ళ విషయంలో మాట్లాడే అర్హత ఉందా అని సురేఖ ప్రశ్నించారు. యాదగిరిగుట్టకి తాము రూ. 63 కేజీల బంగారంతో గోపురం తాపడం చేయించామన్నారు. సామూహిక కోటి దిపోత్సవం, పలు నదీ హారతి కార్యక్రమాలు, కాళేశ్వరం, యాదగిరిగుట్టలకు మహా కుంభాభిషేకం చేశామన్నారు. అసలు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ కార్యక్రమాలు ఏనాడైనా చేశారా? దేవాదాయ శాఖలో డెవలప్మెంట్ యాక్టివిటీ జరిగిందా అంటూ నిలదీశారు. కాగా, ఇటీవల కాలంలో మన రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై బీఆర్ఎస్ నాయకుల మాటలు, స్పందనలు చూస్తే చాలా హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. అవి చూస్తే తనకు ఒకటే గుర్తుకు వస్తుందని అన్నారు. "పాము శివుడిపై ఒట్టేసిందట ఇంకెవరిని కాటు వేసి చంపనని.. ఒక రాబంధు మాట ఇచ్చిందట... ఇంకెప్పుడూ చచ్చిన పశువులను పీక్కు తిననని.. ఒక పులి పశ్చాత్తాపం ప్రకటించిదట... తోటి జంతువులను సంహారించనని%ౌ% ఈ కట్టుకథలు.... కల్వకుంట్ల కుట్రలను మన తెలంగాణ రాష్ట్ర ప్రజలు వినాలా? విని నమ్మాలా ? అంటూ మంత్రి సురేఖ ప్రశ్నించారు." గత పదేండ్ల పాటు రాష్ట్ర సంపదను ఇష్టారీతిన దోచుకున్న కల్వకుంట్ల దండుపాళ్యం బ్యాచ్ నేడు కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుంటే... విషపురుగులై... విషసర్పాలై... రాబంధులై... ఉద్వేగం పేరుతో మనల్ని ఉన్మాదులను చేసే కుట్రకు పాల్పడుతుండటం బాధాకరమన్నారు. కేసీఆర్ కుటుంబంలో అంతర్గత గొడవలతో బీఆర్ఎస్ నాయకులకు ఏం మాట్లాడాలో.... ఏ విధంగా స్పందించాలో అర్థం కావడం లేదన్నారు. వేములవాడలో గోశాలకు ఈ దుస్థితికి రావడానికి కారణం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమే కదా అని బీఆర్ఎస్ నేతలు ఆత్మ సమీక్ష చేసుకోవాలన్నారు. వేములవాడ రాజన్న దగ్గర మొక్కులు మొక్కి రూ.100 కోట్లు ఇస్తానని దేవుడిని మోసం చేసిన ఘనత కేసీఆర్, కేటీఆర్ లది కాదా? అని ఆమె ప్రశ్నించారు. అప్పుడు కేసీఆర్ హామీ ఇచ్చినట్లు వేములవాడకు వంద కోట్లు ఖర్చు పెడితే గోశాల కూడా బాగుపడేది కదా సురేఖ చెప్పుకొచ్చారు. కోడెల మొక్కులు, కోడెలు సమర్పించుకోవటం భక్తుల నమ్మకం, విశ్వాసాలకు సంబంధించిందన్నారు. వాటిని కూడా రాజకీయం చేయటం బీఆర్ఎస్ పార్టీ నీచ రాజకీయానికి, ఆ పార్టీ నాయకుల నీచ మనస్తత్వానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. కేసీఆర్ పదేండ్ల అరిష్టపు పాలన ఇప్పటికీ వేములవాడను వెంటాడుతోందన్నారు. ఆ పాపం బీఆర్ఎస్ పార్టీని కూడా వెంటాడుతుందని.. అందుకే ఆ పార్టీలో లుకలుకలు తెరపైకి వస్తున్నాయన్నారు. తమ నాయకు రేవంత్ రెడ్డి అన్న సీఎం అయ్యాక వేములవాడకు మాస్టర్ ప్లాన్ ఆమోదించుకున్నామని, వేములవాడ అభివృద్ధికి నిధులు ఇచ్చామన్నారు. రాజన్న టెంపుల్ విస్తరించేందుకు వేగంగా చర్యలు చేపట్టామని గుర్తు చేశారు. ఒక్కో నెలలో భక్తులు ఎక్కువ సంఖ్యలో కోడెలను సమర్పిస్తారని, ఇది అక్కడ అందరికీ తెలిసిందేనని, కొన్నిసార్లు అనారోగ్యంతో ఉన్న కోడెలను భక్తులు ఆలయం వద్ద వదిలేసి వెళు తారని%ౌ% వాటిని కూడా సంరక్షించిన బాధ్యత ఆలయంపై ఉంటుందని అన్నారు. ఆ క్రమంలో జరిగిన పరిణామాలపై రాద్ధాంతం, రాజకీయం చేయడం శోచనీయమని మంత్రి పేర్కొన్నారు.

గోశాలలో కోడెలకు స్థలం చాలని పరిస్థితి వచ్చిందని మంత్రి గుర్తు చేశారు. కోడెలు జబ్బు పడ్డప్పుడు, వాటి సంరక్షణకు 12 మందితో పశువైద్య అధికారుల బృందాన్ని తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ప్రతి రోజూ సరిపడేంత పచ్చి గడ్డి అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గోవులను కాపాడాలని, గోశాలలను అభివృద్ధి చేయాలని తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని గుర్తు చేశారు. గత పదేండ్లలో ఎప్పుడైనా బీఆర్ఎస్ ప్రభుత్వం గోశాల మీద సమావేశం పెట్టిందో లేదో ఫాంహౌసులో పడుకున్న కేసీఆర్ వచ్చి సమాధానం చెప్పాలని నిలదీశారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ సమీపంలో ఎన్కేపల్లిలో గోశాల ఏర్పాటు చేయాలని ఇటీవలే అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి ఆదేశాలు కూడా జారీ చేశారన్నారు. వేములవాడలో కూడా సువిశాలమైన గోశాల ఏర్పాటు చేద్దామని, అందుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి తమకు సూచించారన్నారు. తమ అధికారులు, తామంతా అదే పని మీద ఉన్నారన్నారు. తమ ప్రజా ప్రభుత్వాన్ని నిందించే ముందు బీఆర్ఎస్ పదేండ్ల దుర్మార్గాన్ని, దయ్యాల పాలనపై ఆత్మ విమర్శ చేసుకోవాలని.. భక్తుల విశ్వాసాలు, దేవుళ్లపై రాజకీయ కుట్రలు మానుకోవాలన్నారు. ఎములాడ రాజన్న విషయంలో గానీ.... కోడెల విషయంలో గానీ... తమ ప్రభుత్వం వెంటనే స్పందించిందన్నారు. ఘటనపై స్థానిక కలెక్టర్ సందీప్ కుమార్ ఝూను వెంటనే ఘటనాస్థలికి వెళ్ళి పరిశీలించేందుకు ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. తీసుకోవాల్సిన చర్యల నిమిత్తం ప్రభుత్వానికి ఆయన నివేదించగా... తాము కోడెల రక్షణకి చర్యలు సైతం తీసుకున్నామన్నారు.

## బిఆర్ఎస్ కాదు.. అది డిఆర్ఎస్

భాగంగా సీఎం రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. తుర్కపల్లి మండలంలో 66 వేల ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా నిర్మించబోతున్న గంధమల్ల రిజర్వాయర్ కు శంకు స్థాపన చేశారు. అలాగే ఇంటిగ్రేటెడ్ స్కూల్, యాదగిరిగుట్ట మెడికల్ కాలేజ్, వేద పాఠశాల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. కొలనుపాక-కాల్వపల్లి హైలెవెల్ వంతెన, మోటకొండూరులో ఎంపీపీ, మండలాఫీసు, పోలీస్ స్టేషన్ భవనాలకు కూడా శంకు స్థాపన చేశారు. అయితే.. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. యాదగిరిగుట్టలో యూనివర్సిటీని ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామన్నారు. మూసీనది ప్రక్షాళన చేస్తామని ఆనాడే చెప్పామని, సబర్మతి, గంగా, యమున ప్రక్షాళన చేస్తున్నప్పుడు మూసీ ఎందుకు ప్రక్షాళన చేయకూడదని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా.. ఎర్రవల్లి, మొయినాబాద్, జన్వాడ ఫాంహౌస్‌లు లాక్కుంటామని మేం అనడం లేదని, గోదావరి జలాలతో మూసీ ప్రక్షాళన చేస్తామనే అంటున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో మూసీ పక్కన ఉన్నవారి ఇళ్లను కూలుస్తున్నామని దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. మూసీ పక్కన ఉన్నవారంతా మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లా నుంచి వచ్చినవారే అని ఆయన అన్నారు. వారికి వెయ్యి ఎకరాలు కేటాయిస్తామని చెప్పామని, 50 వేలు జేబులో లేని మందుల సామేల్‌ను 50వేల మెజార్టీతో నల్గొండ జిల్లా ప్రజలు గెలిపించారని సీఎం రేవంత్ అన్నారు. అలాగే యాదాద్రి జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆలేరు నియోజకవర్గంలో రూ.1500 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం తిరుమలాపూర్ ఏర్పాటు- చేసిన బహిరంగ సభలో పాల్గొన్న రేవంత్ కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు తెలియచెప్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మీద రేవంత్ విమర్శలు, సెటైర్లు సంధించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తదితరులు పాల్గొన్నారు. బంగారు తెలంగాణ ముసుగులో పదేళ్లు దోచుకున్న వాళ్లా నన్ను ప్రశ్నించేది. వాసాలమర్రి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఇళ్లన్నీ కూలగొట్టారు. ఆ తర్వాత కేసీఆర్ ఆ గ్రామాన్ని పట్టించు కోలేదు. పదేళ్లు దోచుకొని రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చారు. రూ.8లక్షల కోట్లు- అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీశారు. విద్యార్థులు, రైతులు, ఉద్యమకారులను పొట్టన పెట్టుకున్నారు. పేదలను తప్పుదోవ పట్టించి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. రూ.20లక్షల కోట్లు ఉంటే రూ.2వేల కోట్లతో ఎస్ఎల్‌బీసీ పూర్తి చేయలేదు అంటూ నిప్పులు చెరిగారు. యాదాద్రిని తిరిగి యాదగిరిగుట్టగా మార్చాం. కొండపై భక్తులు నిద్రించేలా.. ఆటోలు నడిచేలా చేస్తాం. 60 కిలోల బంగారంతో ఆలయ గోపురం నిర్మాణం చేపట్టాలని నిర్ణయించాం. టీటీడీ బోర్డు మాదిరిగా తెలంగాణలోనూ వైటీడీ ఏర్పాటు చేశాం. యాదగిరిగుట్టలోని విద్యాసంస్థలను వర్సిటీ స్థాయికి అభివృద్ధి చేస్తాం. ఎవరు అడ్డంపడినా సరే.. మూసీ ప్రక్షాళన చేసి నల్గొండ రైతులను ఆదుకుంటాం. గోదావరి జలాలతో మూసీ నదిని నింపుతాం. సబర్మతి, గంగా నదులు ప్రక్షాళన చేసుకోవచ్చు.. మూసీ నదిని మాత్రం ప్రక్షాళన చేయకూడదా అని ప్రశ్నించారు. సభలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, దామోదర రాజనర్సింహ, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



## తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ను కలిసిన బిసి యువ నాయకుడు కలివేముల మధు

**శంకర్ పల్లి వెలుతురు జూన్ 06.**

తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ ను శంకర్ పల్లి బీసీ యువ నాయకుడు కలివేముల మధు చెన్నైలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్ణ, కుల, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధి కొరకు సీఎం స్టాలిన్ చేస్తున్న కార్యక్రమాలు దేశానికే ఆదర్శం అని అభినందించారు. ఇలాంటి నాయకులు దేశానికి అవసరమని అన్నారు. సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న ప్రతి ఒక్కరికి స్టాలిన్ నాయకత్వం శక్తినిస్తుందని చెప్పారు. ఆయనతో భేటీ స్ఫూర్తిదాయకంగా మిగిలి అవుతుందని అన్నారు. సీఎం స్టాలిన్ తనకు తండ్రి అయిన స్వర్గీయ తమిళనాడు మాజీ సీఎం కరుణానిధి జీవిత చరిత్ర పుస్తకాన్ని జ్ఞాపికంగా ఆటోగ్రాఫ్ చేసి ఇవ్వడం చాలా గొప్ప విషయమని కొనియాడారు.

జీపీఓలకు నియామక పత్రాలు ఇచ్చి..

# విధుల్లో చేరేలా చూడండి

- రెవెన్యూ మంత్రిని కోరిన రెవెన్యూ సంఘాల నేతలు
- వారంలోపే ప్రక్రియ పూర్తి చేస్తామని మంత్రి హామీ





**హైదరాబాద్ వెలుతురు జూన్ 06:**
గ్రామ పరిపాలన అధికారుల (జీపీఓ)లకు తక్షణమే నియామక పత్రాలను అందచేసి విధుల్లో చేరేలా చూడాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని శుక్రవారం డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, టిజీటీఏ సెక్రటరీ జనరల్ ఫూల్ సింగ్ చౌహాన్, మహిళా అధ్యక్షురాలు ఎం.రాధ, టీజీఆర్ఎస్ఏ మహిళా అధ్యక్షురాలు సుజాత చౌహాన్ కలిశారు. రాష్ట్రంలో 3,3500 మంది జీపీఓలు నియామక పత్రాల కోసం ఎదురు చూస్తున్నారని ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మంత్రి శ్రీనివాస్ రెడ్డికి వివరించారు. వీరికి తక్షణమే నియామక పత్రాలను అందజేసి విధుల్లో చేరేలా చూడాలని కోరారు. జీపీఓల రాకతో రాష్ట్రంలోని గ్రామాల్లో రెవెన్యూ సేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు. జీపీఓల విషయంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించారు. వారం రోజుల లోపే ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంపై గ్రామసభ

- బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత అందరిదీ
- ఎంఈఓ బాలకిషన్



**వెలుతురు న్యూస్, అమ్రాబాద్ :**
ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా, అమ్రాబాద్ మండల కేంద్రము లో మండల విద్యాధికారి కార్యాలయం ఆవరణలో బడిబాటపై గ్రామసభ నిర్వహించడం జరిగిందని ఎంఈఓ బాలకిషన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, మహిళా సంఘాలు, మండల మహిళా సమైక్య, మజీద్ కమిటీ, ఎంవి ఫౌండేషన్, గ్రామ యువకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం గూర్చి ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించడం కోసం బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలలకు తీసుకురావడం అందరి బాధ్యత అని గ్రామ స్థాయిలో సామూహిక బాధ్యతను పెంచాలని దీని ద్వారా విద్యను మరింత విస్తరించడమే లక్ష్యంగా ఈ గ్రామ సభ ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. సమావేశంలో పాల్గొన్న అందరూ తమవంతుగా బాధ్యతలు తీసుకొని విద్యార్థులను బడికి వెళ్లే విధంగా ప్రోత్సహించాలని తెలియజేశారు. ఇది ఒక ఉత్తమమైన బాధ్యతగా కలసికట్టుగా పని చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు . ఈ గ్రామ సభలో జిహెచ్ఎం హనుమంత్ రెడ్డి లక్ష్మణరావు మండల సమైక్య ఏపీవో యం వి ఫౌండేషన్ కోఆర్డినేటర్ వెంకటేష్ జమీల్ వివిధ పాఠశాల ఉపాధ్యాయులు మహిళా సంఘాలు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 06**
మండలం వెల్లంకి గ్రామానికి చెందిన టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎడ్ల నరేందర్ రెడ్డి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య జన్మదిన శుభాకాంక్షలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షులు పోషబోయిన మల్లేశం, మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి, జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం, గ్రామ శాఖ అధ్యక్షుడు పున్న వెంకటేశం, కార్యదర్శి పిట్ట మహేందర్ రెడ్డి, నాయకులు విడమ్ శ్రీనివాస్, గంట కర్ణాకర్ రెడ్డి, ఎడ్ల మల్లారెడ్డి, ఎడ్ల రామచంద్రారెడ్డి, ఎడ్ల శ్రీధర్ రెడ్డి, పాశం సత్తిరెడ్డి, వరికుప్పల కాశీరాం, తదితరులు పాల్గొనడం జరిగింది.

## దశదినకర్మలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 06**
మండలం ఎల్లంకి గ్రామానికి చెందిన ఎడ్ల కృష్ణారెడ్డి తండ్రి యొక్క దశదినకర్మకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై వారి యొక్క చిత్రపటానికి నివాళులర్పించి, పూలమాలలు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి, జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం, గ్రామ శాఖ అధ్యక్షుడు పున్న వెంకటేశం, కార్యదర్శి పిట్ట మహేందర్ రెడ్డి నాయకులు ఎడ్ల నరేందర్ రెడ్డి, హిడెన్ శ్రీనివాస్, గంట్ల దయాకర్ రెడ్డి, ఎడ్ల మల్లారెడ్డి, ఎడ్ల రామచంద్రారెడ్డి, ఎడ్ల శ్రీధర్ రెడ్డి, పాశం సత్తిరెడ్డి, వరికుప్పల కాశీరాం, తదితరులు పాల్గొనడం జరిగింది.



బిఆరెస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ త్వరగా కోలుకోవాలని దేవుణ్ణి ప్రాదిస్తున్న
ఇంచార్జీ మంత్రిగా అనేక సార్లు మాగంటిని కలిశాను
ఇటీవల ఆయన ఆరోగ్యం క్షిణించడం తో ప్రభుత్వ కార్యమాలకు రావడం లేదు
ఇది రాజకీయాలకు అతీతంగా మాట్లాడాల్సిన టైం.
బిఅరెస్ నాయకులు గోపినాథ్ అనారోగ్య సందర్భాన్ని రాజకీయం చేస్తున్నారు
బోరాబండ లో బిఅరెస్ కార్యకర్త మరణంతో గోపినాథ్ అనారోగ్యం పాలయ్యారని మాట్లాడ్తున్నారు
కార్యకర్త మరణంతో ఎమ్మెల్యే గోపినాథ్ అనారోగ్యానికి లింక్ చేయడం సరైన సందర్భం కాదు
అనారోగ్యంతో బాధ పడుతున్న మంగంటి గోపినాథ్ అంశంలో రాజకీయాలు చేయడం సబబు కాదు
రాజకీయా కక్ష తో బిఅరెస్ కార్యకర్త మరణాన్ని అక్కడి స్థానిక నేత బాబా ఫసియుద్దీన్ కి అపాదిస్తున్నారు
బిఅరెస్ నుండి కాంగ్రెస్ లోకి వచ్చారనే అక్కసుతోనే ఆరోపణలు
ఈటెల రాజేందర్ ఇప్పుడైనా వాస్తవాలు చెప్పండి
పార్టీ నుండి మిమ్మల్ని గెంటేసి విధానం గుర్తు చేసుకోండి
పొలిటికల్ మేనేజ్మెంట్ చేసుకోవద్దు
బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలు కలిసి పని చేస్తున్నాయి
హరీష్..ఈటెల రహస్య భేటీ అయ్యారని పిసిసి చెప్పారు
బీజేపీ నాయకత్వం స్పందించాలి
కృష్ణ నీళ్ల వ్యవహారంలో బీజేపీ ఏపీ కి అనుకూలంగా వ్యవహరిస్తుంది
బాధ్యత రాహిత్యం గా ఉండొద్దు బీజేపీ
మంత్రి పొన్నం ప్రభాకర్
**హైదరాబాద్ వెలుతురు జూన్ 06:**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠశాలలు తెరిచే నాటికి

# పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందచేయాలి

- నాణ్యమైన ఉత్తమ విద్య కోసం ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి
- బాలల హక్కుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి



**ఇంజమూరి రఘునందన్,**
**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్)**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 06:**
ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపుగా 27 లక్షల మంది విద్యార్థులు చదువుకున్నారు. వీరందరికీ పాఠశాలలు తెరిచే నాటికే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందచేయాలనీ బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఈ విద్యాసంవత్సరం నుండి ఇస్తామన్న నోట్ బుక్స్ కూడా సకాలములో విద్యార్థులకు అందించాలని వారు కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత విద్యార్హతలు కల్గి వివిధ స్థాయిల్లో రాష్ట్ర స్థాయి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన వారినే ఉపాధ్యాయులుగా నియమిస్తారు. ఉన్నత విద్యార్హతలు కల్గిన ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించి అనవసర ఫీజుల భారం నుండి విముక్తి కావాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్) తల్లిదండ్రులకు విజ్ఞప్తిచేస్తున్నది. ఏడాదికి ఏడాది ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజులు పెరుగుతున్నాయి. ప్రయివేట్ స్కూల్లలో యూనిఫాం, పాఠ్యపుస్తకాలు కొనడం తలకు మించిన భారం అవుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాం, అన్ని పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు(నోట్ బుక్స్), వేడివేడిగా వండిన మధ్యాహ్న భోజనం అన్నీ ఉచితంగా ఇవ్వడం జరుగుతుంది. ఇవేకాకుండా వివిధ స్వచ్ఛంద సంస్థలు, దాతృత్వ సంస్థలు పిల్లలకు షూ తదితర నగదు ప్రోత్సాహకాలు కూడా ఇవ్వడం జరుగుతుంది. ఆటపాటలతో ఆహ్లాదకరమైన విద్యాబోధన ప్రభుత్వ పాఠశాలల్లో బోధించడం జరుగుతుంది. పాఠశాలల పనివేళల్లో ఎప్పుడైనా తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల విషయంలో ఉపాధ్యాయులను,ప్రధానోపాధ్యాయులు సంప్రదించవచ్చు, పిల్లల విద్యాప్రగతిని తెలుసుకోవచ్చు. అదే ప్రయివేట్ స్కూళ్ళలో స్కూల్ యాజమాన్యం అనుమతికోసం పడిగాపులు పడే పరిస్థితి ఉంటుంది. ప్రతి నెలా పేరెంట్ టీచర్ మీటింగ్ (పి టి ఎం) నిర్వహించడం జరుగుతుంది. ఈ మీటింగ్స్ లో తమ పిల్లలల విద్యాప్రగతి ఎలా ఉంది సబ్జెక్టు వారిగా ఉపాధ్యాయులతో చర్చించి పిల్లల విద్యా ఉన్నతికి కృషిచేయవచ్చును. పాఠశాల స్థాయిలో పిల్లలకు విద్యాబోధన ఏమేరకు జరుగుతుంది ఒక వైపు తల్లిదండ్రులు తనిఖీ చేయవచ్చు. ఇంకో వైపు రాష్ట్ర విద్యాశాఖలో వివిధ విభాగాలు కూడా విస్తృతంగా తనిఖీలు చేయడం జరుగుతుంది. కొన్ని స్కూళ్లను కలిపి స్కూల్ కాంప్లెక్స్ గా ఏర్పాటుచేసి ప్రతి స్కూల్ కాంప్లెక్స్ కు ఒక కాంప్లెక్స్ హెడ్ మాస్టర్, మండలంలోని స్కూల్స్ పై మండల విద్యాశాఖ అధికారి, జిల్లాలోని స్కూల్స్ అన్నిటిపై జిల్లా విద్యాశాఖ అధికారి, రీజినల్ జాయింట్ డైరక్టర్, జాయింట్ డైరక్టర్, డైరక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి ఇలా వివిధ స్థాయిల్లో విద్యా సంస్థల పనితీరు, ఉపాధ్యాయుల బోధన విధానం పరిశీలించుటకు, పర్యవేక్షించుటకు వివిధ స్థాయిల్లో విద్యా శాఖ అధికారులు ఉంటారు. ఇంతపెద్ద వ్యవస్థ కలిగిన రాష్ట్ర విద్యా శాఖ నిర్వహించే ప్రభుత్వ బడులలో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించి ఉచితమైన నాణ్యమైన విద్యను పొందగలరని బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్) విజ్ఞప్తి చేస్తుంది.

# కాళేశ్వరం రిపోర్ట్ త్వరగా బయట పెట్టాలి

- తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టుకు మహారాష్ట్ర ఒప్పుకోలే
- కేబినేట్ ఆమోదం తరవాత త్రీమెన్ కమిటీ వేశారు
- కంఠంపై తుపాకి పెట్టినా నిజాలే చెబుతా
- తాత్సారం చేస్తే వదిలే ప్రసక్తి లేదు
- కాళేశ్వరం నిర్ణయం మొత్తం కెసిఆర్‌దే
- జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణలో ఈటెల వెల్లడి



**హైదరాబాద్,జూన్ 6( వెలుతురు):**
కాళేశ్వరం రిపోర్ట్ త్వరగా బయట పెట్టాలని.. రిపోర్ట్ విషయంలో తాత్సారం చేస్తే వదిలే ప్రసక్తి లేదని బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. కాళేశ్వరం విచారణ అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. కంఠంపై తుపాకీ పెట్టినా ఈటెల నిజమే మాట్లాడుతారని స్పష్టం చేశారు. ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు డిజైన్లు, నిర్మాణంతో సంబంధం ఉందా అని కమిషన్ అడిగిందని.. తనకేం సంబంధం లేదని చెప్పానన్నారు. కాళేశ్వరం కార్పొరేషన్‌పై అధికారం ఉండేదా అని అడగ్గా.. తనకు ఎలాంటి అధికారం లేదని చెప్పినట్లు తెలిపారు. కాళేశ్వరం నిర్మాణం క్వాలిటీ– గురించి ఇంజనీర్లు చూసుకోవాలని.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హరీష్ నాయకత్వంలో కేబినెట్ సబ్ కమిటీ వేశారన్నారు. మంత్రివర్గ ఉపసంఘం, సీడబ్ల్యూసీ రిపోర్ట్ ఆర్థిక శాఖ ముందు పెట్టారని తెలిపారు. నిజాయితీగా ఉండాలని కోరే పార్టీ బీజేపీ అని ఎంపీ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు సృష్టికర్త కేసీఆర్ అని ఆయనే చెప్పుకున్నారని.. ప్రాజెక్టు కట్టాలనే ఆలోచన ఆనాటి ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. కాళేశ్వరంపై నిర్ణయం తీసుకుంది కేసీఆర్ అని.. అప్పుడు ఆయనే బాస్ అన్నారు. 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ పార్టీలో ఉన్నా విలువలతో ఉన్నట్లు తెలిపారు. తెలంగాణలో మొట్టమొదటి ఆర్థిక మంత్రిగా పనిచేశానన్నారు. తెలంగాణ సాధించుకుంది నీళ్లు, నిధులు, ఉద్యోగాల కోసమని చెప్పారు. 2006లో తుమ్మిడిహట్టి రూ.16 వేలు ఉంటే 2015లో రూ.38 వేల కోట్లకు పెరిగిందన్నారు. తుమ్మిడిహట్టి దగ్గర కట్టాలని అనుకున్నా మహారాష్ట్ర ఒప్పుకోలేదన్నారు. మూడు బ్యారేజీలు సీడబ్ల్యూసీ రిపోర్ట్, టెక్నికల్ కమిటీ– ఆధ్వర్యంలో కట్టారన్నారు. మూడు బ్యారేజీలు సబ్ కమిటీ, టె–క్నికల్ కమిటీ రిపోర్టు ఆధారంగా కట్టారని వెల్లడించారు. మొదట రూ.63వేల కోట్ల అంచనాతో ప్రారంభం అయితే.. రైతుల డిమాండ్ మేరకు రూ.82 వేల కోట్లకు పోయిందన్నారు. కాళేశ్వరం కార్పొరేషన్ ఏ పర్పస్ కోసం పెట్టారని కమిషన్ ప్రశ్నిస్తే.. కాళేశ్వరం కార్పొరేషన్‌కు ఫైనాన్స్ శాఖకు సంబంధం లేదని చెప్పినట్లు తెలిపారు. 'మా బతుకులో నిబద్ధతతో ఉంది... నా గొంతుపై తుపాకీ పెట్టినా నిజాలే మాట్లాడతా. ఎవరు పిలిచినా ఎక్కడైనా నిజాలే చెప్తా. కొందరు బట్టకాల్చి మీదేస్తే నాకేమీ కాదు' అని అన్నారు. మూడు బ్యారేజీలు రూ.10వేల కోట్ల లోపే అని చెప్పారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌ను త్వరగా బయటపెట్టాలని.. నిజమైన దోషులు ఎవరో ప్రభుత్వం తేల్చాలని రాజేందర్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అవకతవకలపై పీసీ ఘోష్ కమిషన్ విచారణ కొనసాగుతోంది. శుక్రవారం బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓపెన్ కోర్టులో ఈటెలతో అంతా నిజమే చెప్తానని కమిషన్ ప్రమాణం చేయించింది. అనంతరం కమిషన్ ప్రశ్నలు సంధించింది. కమిూషన్ ముందు 113వ సాక్షిగా మాజీ మంత్రి హాజరయ్యారు. దాదాపు 40 నిమిషాల పాటు– విచారణ సాగింది. బ్యారేజీల నిర్మాణం, కాలేశ్వరం కార్పొరేషన్, డీపీఆర్‌పై మొత్తం 19 ప్రశ్నలను కమిషన్ సంధించింది. కేబినెట్ నిర్ణయం తీసుకున్న తర్వాతే మూడు బ్యారేజీల నిర్మాణం మొదలుపెట్టామని చెప్పారు. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ఒప్పుకోలేదని తెలియజేశారు. మహారాష్ట్ర ఒప్పుకోకపోవడంతో 150 నుంచి 148 కుదించామన్నారు.

## ఛత్తీస్‌ఘడ్‌లో కొనసాగుతున్న ఎన్‌కౌంటర్లు

- మావోయిస్ట్ మరో అగ్రనేత భాస్కర్ హతం
- మైలారపు ఆడెల్లు అలియాస్ భాస్కర్‌ది ఆదిలాబాద్



**రాయ్‌పూర్,జూన్ 6( వెలుతురు):**
ఛత్తీస్‌గఢ్‌లో వరుస ఎన్‌కౌంటర్లు ఆవోలను హతమారుస్తూనే ఉన్నాయి. ఇప్పటికే జరిగిన వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. తాజాగా రెండోరోజూ ఎన్‌కౌంటర్ జరిగింది. బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో శుక్రవారం భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మరో కీలక నేత మైలారపు ఆడెల్లు అలియాస్ భాస్కర్ మృతిచెందారు. ఆడెల్లు స్వస్థలం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచ్చెర గ్రామం. భాస్కర్ కేంద్ర కమిటీతోపాటు– రాష్ట్ర కమిటీకి కార్యదర్శిగా పని చేస్తున్నారు. అతి తక్కువ సమయంలోనే రాష్ట్ర కమిటీ స్థాయికి భాస్కర్ ఎదిగారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల రిక్రూట్‌మెంట్‌లో ఆయన కీలక పాత్ర పోషించారు. అతడి తలపై రూ.25లక్షల రివార్డు ఉంది. ఈ ఎన్‌కౌంటర్ జరిగిన ఘటనా స్థలంలో ఏకే 47తోపాటు పలు ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని సమాచారం. కాగా మావోలు, భద్రతా దళాల మధ్య ఇంకా ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. గురువారం నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారంటూ భద్రతా బలగాలకు సమాచారం అందింది. దీంతో ఈ ప్రాంతంలో భద్రతా బలగాలు, పోలీసులు కూంబింగ్ చేపట్టాయి. ఈ విషయాన్ని మావోయిస్టులు పసిగట్టారు. కూంబింగ్ నిర్వహిస్తున్న భద్రతా బలగాలపైకి కాల్పులు జరిపారు. దీంతో వారు ఎదురుకాల్పులకు దిగారు. ఈ కాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత సుధాకర్ మరణించారు. అతడి తలపై రూ. కోటి రివార్డు ఉన్న సంగతి తెలిసిందే. ఇదే ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టు సైతం మృతిచెందిన విషయం విదితమే. ఇదే ప్రాంతంలో భారీగా ఆయుధాలను సైతం భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మరోవైపు వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పలు ఎన్‌కౌంటర్‌లలో ఇప్పటికే వందలాది మంది మావోయిస్టులు మృతి చెందారు. అలాగే ప్రభుత్వం ఎదుట మరికొంతమంది మావోయిస్టులు లొంగిపోయారు. ఇంకొంతమంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

## జీ7 సదస్సుకు భారత్‌కు ఆహ్వానం

- కెనడా ప్రధాని మార్క్ కార్నే మోడీకి ఫోన్
- కలసి పనిచేద్దామని ఇరు దేశాల నేతలనిర్ణయం

**న్యూఢిల్లీ,జూన్ 6( వెలుతురు):**
జీ7 సదస్సుకు భారత్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు ప్రధాని మోదీకి.. కెనడా ప్రధాని మార్క్ కార్నే ఫోన్ చేసి సదస్సులో పాల్గొనాలని ఆహ్వానించారు. ఈ విషయాన్ని మోదీ అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. కార్నేతో ఫోన్‌లో మాట్లాడటం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. కెనడాలోని అల్బెర్టాలో ఈ నెల 15 నుంచి 17 వరకు జీ7 సదస్సు జరుగనుంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన ఆయన్ను అభినందించినట్లు ప్రధాని మోడీ తెలిపారు. భారత్, కెనడా శక్తిమంతమైన ప్రజాస్వామ్య దేశాలన్న మోదీ.. పరస్పర ఆసక్తులను గౌరవించుకుంటూ పని చేస్తామన్నారు. మార్క్ కార్నేతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు చెప్పారు. 51వ జీ–7 సదస్సుకు కెనడా ఆతిథ్యమిస్తున్న సంగతి తెలిసిందే. జీ7 దేశాల్లో భారత్ లేకున్నప్పటికీ.. నిర్వహణ దేశాల ఆహ్వానం మేరకు మన ప్రధాని ఆ శిఖరాగ్ర సదస్సుల్లో పాల్గొంటున్నారు. గతేడాది ఇటలీ వేదికగా జరిగిన సదస్సుకు భారత్‌తోపాటు ఆఫ్రికా, దక్షిణ అమెరికా, పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు పాల్గొన్నాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ కూడా పాల్గొని తన గళాన్ని వినిపించారు. ఇటీవలి వరకు ఆహ్వానం అందలేదు. అయితే హాజరు కావడం లేదని పిఎంవో తెలిపింది. తాజా ఆహ్వానంతో ప్రధాని వెళతారా లేదా అన్నది తెలియాల్సిఉంది.

# సంపాదకీయం..

## పర్యావరణహితంగా అభివృద్ధి సాగాలి !

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని అట్టహాసంగా జరుపుకున్నాం. ప్లాస్టిక్ నిషేధంపై నేతలంతా ఉపన్యాసాలు ఇచ్చారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని అంతా హితవు చెప్పారు. అసలు ప్లాస్టిక్ కవర్ల ఉత్పత్తిపై నిషేధం విధించే ఆలోచన మాత్రం పాలకులు ఎక్కడా ప్రస్తావించడం లేదు. పర్యావరణ విధ్వంసానికి కారణమైన ప్లాస్టిక్‌ను నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలి. అలాగే అందుకు ప్రత్యామ్నాయాలు ఆలోచించాలి. హోటళ్లు, ఇళ్లలో ఆకులతో తయారు చేసే కవరల్ను వాడాలి. అరిటాకులు, మోదుగు, బాదామ్ ఆకులను వినియోగించేలా చేయాలి. ప్రధానంగా పెళ్లిళ్లు, హోటళ్లలో ఈ తరహా ప్రయోగం రావాలి. ఇకపోతే పేరుకుపోతున్న ప్లాస్టిక్‌ను ఏరిపారేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలి. తిరుమలలో లడ్డూలను ప్లాస్టిక్ కవర్లలో ఇవ్వకుండా తాటాకు బుట్టలు, తుంగతో చేసిన లేదా జనుముతో చేసిన కవర్లన వాడాలి. ప్రయత్నం చేస్తే ఏదీ అసాధ్యం కాదు. మరోవైపు అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల నుంచి బయటపడాలి. నదులను శుభ్రం చేసి, అనుసంధానం దిశగా కార్యాచరణ సిద్దంచేయాలి. నదుల్లో ఎప్పుఊ నీరు అందుబాటులో ఉండేలా చూడాలి. యమునా కాలుష్యంపై ఢిల్లీ ఎన్నికల ముందు రోజూ వార్తలే. ఇప్పుడా విషయమే మరచి పోయారు. పాలకులు ఓటుబ్యాంక్ పథకాలు పక్కన పెట్టి ఇలాంటి వాటిని కూడా ఆలోచించాలి. భవిష్యత్ తరాల కోసం మనమంతా ఇప్పటినుంచే అడుగులు వేయాలి. వర్షాభావ పరిస్థితులు పదేళ్లకోసారి తప్పవని నిపుణులు అంటున్నారు. నైరుతి ప్రవేశించినా నేటికీ తగిన వర్షం జాడలేదు. అడపాదడపా అక్కడక్కడా పడుతున్న వర్షం లెక్కల్లోకి రాదు. వర్షాలు ముఖం చాటేస్తే జలాశయాలు వట్టిపోతాయి. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం కలసివచ్చినా పంఇంచిన పంటలకు ధరలు రాక నష్టపోతున్నారు. వర్షాలు పడని సంవత్సరంలో పంటలు ఎండిపోయి నష్టపోతున్నారు. కాలం అయినా గాని, కరువు అయినా గాని రైతుకు మిగిలేది అప్పులే. నిపుణుల సలహాతో వ్యవసాయరంగాన్ని పారిశ్రామిక రంగంగా అభివృద్ధి చేయగలిగితే దేశం ఆర్థికంగా బలోపేతం కాగలదు. గతంలో లాగా వాగులు వంకలు పొంగే పరిస్థితి లేదు. వర్షాల తీరు ఇలాగే ఉంటే నీటి కష్టాలు తప్పేలా లేవు. ఇలాంటి సందర్భాల్లోనే ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలి. పాలకులకు దూరదృష్టి అవసరం. నదీజలాలలను ఏటా వృధాగా సముద్రంలోకి వదలాల్సిన దుస్థితి నుంచి బయట పడాలి. వాటిని సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేయాలి. నదీ జలాలలను దేశం మొత్తానికి అందేలా... ప్రణాళికలు రూపొందించాలి. నదుల అనుసంధానంపై చర్చించాలి. దీనిపై సమగ్ర నివేదికలు రూపొందించాలి. నిపుణలను నియమించి గంగా,యమున,బ్రహ్మపుత్ర నదులను అనుసంధానించే ప్రక్రియ చేపట్టాలి. ఈ దశలో నీటి సంరక్షణతో పాటు, రైతు సంక్షేమానికి చర్యలు తీసుకునే ప్రణాళికలు ముందుకు సాగాలి. మోడీ తొలినాళ్లలో నదుల అనుసంధానం గురించి మాట్లాడారు. కానీ ఇప్పుడా మాట ఎత్తడం లేదు. ఇకపోతే వర్షాల ద్వారా మనం పాఠాలు నేర్చుకోవాలి. వరదలను నివారించి, నీటిని నిల్వ చేసుకునే పద్దతలను అవలంబించాలి. దేశవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగుతున్న సమయంలో వాటిని జలాశయాల్లోకి మళ్లించేలా ప్రణాళికలు చేసుకోవాలి. ఉన్నకొద్దిపాటు ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల చేయడంతో మళ్లీ సముద్రంలోకి నీరు చేరుతోంది. ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో దేశంలో నీటి యాజమాన్యం సరిగా లేదని ఏటా కురుస్తున్న వర్షాలు స్పష్టం చేస్తున్నాయి. దీనికితోడు అనేక జలాశయాల్లో పూడిక పేరుకుని పోతోంది. ఏటేటా వర్షాలతో ఒండ్రు చేరుతోందని నిపుణులు చెబుతున్నారు. గతంలో వరదలకు ఉత్తరాది, దక్షిణాది అన్న తేడా లేకుండా అనేక నదులు ఉప్పొంగాయి. చివరకు మళ్లీ నీరు సముద్రానికి చేరింది. ఈ దుస్థితి పోవాలంటే నీటి యాజమాన్యం అవసరం. ఇప్పటికైనా పాలకులు జాతీయ జలవిధానం రూపొందించాల్సి ఉంది. అలాగే వ్యవసాయంపై కూడా జీతాయ విధానంతో ముందుకు సాగాలి. వ్యవసాయాన్ని లాభసాటి చేసేలా, దిగుబడులు పెంచుకునేలా రైతులను ప్రోత్సహిచేలా చూసుకోవాలి. వివిధ రాష్ట్రాల్లో చెరువులను కబ్జాకోరులు మింగిన పాపానికి ఏటా కురుస్తున్న వర్షాలకు నగరాలు, పట్టణాలు, గ్రామాలు నీట మునిగిపోతున్నాయి. ఇదంతా పాలకుల పాపం కాక మరోటి కాదు. ఈ క్రమంలో గొలుసుకట్టు చెరువులను రక్షించుకోవాలి. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని కనీసం ఇప్పటి నుంచయినా నీటి అవసరాలను గుర్తించి పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. వర్షపునీటిని ఒడిసి పట్టుకుని ముందుకు సాగేలా ప్రణాళికలు చేసుకోవాలి. ఇది రాష్ట్రానికి, దేశానికి కూడా వర్తించేలా ఉండాలి. వ్యవసాయ ఉత్పత్తులను పెంచి విదేశాలకు ఎగుమతి చేసే విధంగా సన్నద్ధం కావాలి. ఆర్థికమాంద్యం ముంచుకొస్తున్న వేళ కేంద్రం ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటే ఓ పదేళ్లకు కాని ఆచారణలోకి రాదు. వ్యవసాయరంగం పురోగమిస్తే, ధాన్యం దిగుబడులు తగ్గితే తప్ప భారత ఆర్థికరంగం పురోగమించదు. ఇప్పటికే వరిధాన్యం ఇబ్బడి ముబ్బడిగా పండించడం వల్ల గోదాముల్లో మగ్గిపోతోంది. వాటిని వాడుకునే విధంగా కార్యక్రమాలు అమలు చేసుకోవాలి. అదేపనిగా వరి పండించకుండా ఇతర పంటలపైనా ప్రోత్సాహం కల్పించాలి. వంటనూనెల కోసం విదేశాలపై ఆధారపడకుండా దేశీయంగా నూనెగింజల ఉత్పత్తులను పెంచుకోవాల్సి ఉంది. ప్రధానంగా అనేకరకాల పప్పు ధాన్యాలు, వంట నూనెల దిగుమతులను పూర్తిగా నిషేధించుకుని, దేశీయంగా పండించుకునేలా వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. కనీసం ఓ పదేళ్ల పాటు వ్యవసాయరంగ ఉత్పత్తులపై దృష్టి సారిస్తే భారతదేశం ఆర్థకంగా మళ్లీ పుంజుకోగలదు. ఆధునిక వ్యవసాయం దిశగా పురోగమించాలి. రోజురోజుకూ నిరుద్యోగం పెరిగడంతో.. ప్రజలు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. వారిని వ్యవసాయం వైపు మళ్లించేలా పథకాలు చేపట్టాలి. తక్షణ ఉపాధికి ఇదొక్కటే ప్రత్యామ్నాయం కాగలదు. దీంతో ఆహార ఉత్పత్తులు కూడా పెరగగలవు.

# నీతి ఆయోగ్ చర్చల ప్రభావం ఎంత?

- ఏటా మొక్కుబడిగా సమావేశాలు
- సిఎంల అభ్యర్థనలపై చర్యలు శూన్యం

**న్యూఢిల్లీ,జూన్6( వెలుతురు):**
ప్రధానమంత్రి మోడీ సమక్షంలో... ఇటీవల జరిగిన నీతి ఆయోగ్ భేటీలో పలు అంశాలపై చర్చ జరగడం అటుంచితే..పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరు కాలేదు. తెలుగు రాష్ట్రాలకు చెందిన సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు హాజరై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చక్కగా ఇచ్చారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల సంక్షేమం అన్నది ఉమ్మడిగా నిర్ణయించి ముందుకు సాగాల్సి ఉంది. పార్లమెంటులో సమస్యలపై చర్చించడం లేదు. నీతి ఆయోగ్‌లోనూ ప్రధాని ప్రసంగానికే పెద్దపీట వేస్తున్నారు. హాజరైన సిఎంలు ప్రస్తావించిన అంశాలపై చర్చించడం లేదా, తదుపరి చర్యలు కానరావడం లేదు. మొత్తంగా దేశంలో కేంద్రంలో ఏ పార్టీ అధికారం లో ఉన్నా సమావేశాలు, చర్చలు అన్నవి తూతూ మంత్రంగా సాగుతున్నాయి. సమావేశాలు, చర్చలు అమలు చేస్తున్న కార్యక్రమాలు ప్రజల ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా సాగుతున్నాయి. అనేక సందర్భాల్లో నీతి ఆయోగ్ సమావేశాల్లో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు వివిధ సమస్యలపై నేరుగానే ప్రశ్నించారు. ఆయా రాష్ట్రాల సమస్యలను దేశం దృష్టికి తీసుకెళ్లారు. అయినా లాభం లేకపోవడంతో ఇక సమావేశాలకు హాజరు కావడం దండగ అన్న భావనలో ఉన్నారు. నీతి ఆయోగ్ ప్రారంభించి సమయంలో కనిపించిన స్ఫూర్తి లోపించింది. నీతి ఆయోగ్ ఏర్పాటు దశలో ప్రధాని మోడీ ఆనాడు చేసిన ప్రకటనకు భిన్నంగా ఈ పదకొండేదేళ్లుగా నీతి తప్పిన ఆయోగ్‌గా అవతరించింది. సహకార సమాఖ్య సూత్రాలకు అనుగుణంగా మొత్తం దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలంటే ఆయా రాష్ట్రాలకు తగిన గౌరవం ఇచ్చి వారిని కూడా ఇందులో భాగస్వాములను చేయాల్సి ఉంది. రాష్ట్రాలను కలుపుకుని ముందుకు సాగాల్సిన కేంద్రం ఆ దిశగా పనిచేయడం లేదు. మళ్లీ పాతపద్దతిలోనే సాగుతోంది. నీతి ఆయోగ్ లక్ష్యాలను విస్మరించారు. ఇక్కడ జరిగే చర్చలకు పెద్దగా ప్రాధాన్యం ఉండడం లేదు. ఇదే విషయాన్ని పలువురు సిఎంలు నిర్మొహమాటంగా చెప్పేస్తున్నారు. అంతెందుకు ఒకే పన్ను విధానం అంటూ తీసుకుని వచ్చిన జిఎస్టీని సమర్థించిన ఆయా రాష్ట్రాల సిఎంలే ఇప్పుడు దాని బారినుంచి రక్షించాలని కోరుకుంటున్నారు. వివిధ రంగాలపై అది చూపిస్తున్న చెడు ప్రభావాన్ని విశ్లేషించు కోవాల్సిన కేంద్రం ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందే తప్ప ప్రజల కోణంలో ఆలోచించడం లేదు. ప్రజలు అనేక సందర్భాల్లో తమ నిరసనలు వ్యక్తం చేస్తున్నా పట్టించుకోవడం లేదు. బ్యాంకుల్లో దాచుకున్న డబ్బును సొంత అవసరాలకు తీసుకోవ డానికి కూడా ఇబ్బంది పడటాన్ని గ్రామాల్లో ఇప్పటికీ చూస్తున్నాం. నగదు ఉపసంహారణపై ఎన్నో ఆంక్షలు పెట్టారు. ఇలాంటి వాటి వల్ల ప్రజలు ఇబ్బంది పడుతూనే ఉన్నారు. ఆహారధాన్యాల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఇవన్నీ నీతి ఆయోగ్‌లో చర్చించడం లేదు.




పార్లమెంటులో చర్చకు అవకాశం ఉండడం లేదు. మొత్తంగా పాలకులకు అధికారమే తప్ప ప్రజలు కనబడడం లేదు. ఎంపిలు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గవర్నర్ వ్యవస్థ ఇలా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం బదులు నానాటికి దిగజారుస్తున్నాయి. ప్రజల డబ్బు నీళ్లప్రాయంగా ఖర్చవుతోంది. రాజకీయాల్లో ఎదుటి పక్షాలను ఢీకొట్టేందుకు తమ తెలివిని ఉపయోగిస్తున్న పాలకులు ప్రజల సమస్యలు పరిష్కరించ డంలో శ్రద్ద చూపడం లేదు.రాజకీయ సంస్కరణలు రావాలి. పాలకుల తీరులో మార్పు రావాలి. ప్రజాధనం వృధా ఖర్చులకు కళ్లెం పడాలి. ముక్కుపిండి వసూలు చేస్తున్న పన్నులను పాలకుల విసలాలకు ఖర్చు చేసుకుంటున్నారు. ఉమ్మడి ఎపి విడివడ్డ తరవాత జరిగిన ఆర్థిక విధ్వంసమే ఇందుకు కారణం. అభివృద్ధి పేరుతో చేసిన అప్పులకు నేతలను బాధ్యులుగా చేస్తే మంచిది. రాజ్యాంగం ఏ మేరకు ఎంతవరకు అమలు సాధించామన్నది పాలకులుగా రాజకీయ పార్టీల నేతలు మననం చేసుకోవాలి. అందరికీ సమ న్యాయం అందుతుందా అన్నది చూడాలి. నేలవిడిచి సాము చేసే విధంగా దేశీయంగా ఉత్పత్తులపై దృష్టి పెట్టి స్వయం సమృద్ది సాధించకుండా దావోస్ లాంటి వేదికలపై పెట్టుబడులకు వెంపర్లాడుతున్న విధానం పోవాలి. దేశీయంగా ఉన్న సాంకేతికతను ఉపయోగించుకుని యువతను స్వయం సమృద్ధికి సన్నద్దం చేయాలి. వ్యవసాయం, అనుబంధ రంగాలను అభివృద్ధి చేస్తే ఈ దేశం ఇతర దేశాలకు ఆహారధాన్యాలను ఎగుమతి చేయగలదు. సింగపూర్, మలేషియా తదితర చిన్నదేశాలను ఆదర్శగా తీససుకుని ఆయా రాష్ట్రాలు స్వయం సమృద్ధి సాధించే ప్రణాళికలతో సాగాల్సిన అవసరాన్ని గుర్తించాలి. నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. ఆరోగ్యం అందని ద్రాక్షగా మారింది. విద్య విలాసవస్తువుగా మారింది. ఇలాంటి అసమనాతలను రూపుమాపేందుకు పాలకులు చిత్తశుద్దితో కృషి చేయడం లేదు. ఈ రంగాలకు కేటాయింపులు పెరగడం లేదు. ఆనాటి పాలకుల దూరదృష్టి లోపం కారణంగా మనకు వారసత్వంగా వచ్చిన సకల అవలక్షణాలు ప్రజలను ఇంకా దరిద్రంలోనే ముంచెత్తుతున్న వేళ పాలకులు గతాన్ని నెమరేసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ఆహారధన్యాలను ఇంకా ఎందుకు దిగుమతి చేసుకుంటున్నామో ఆలోచన చేయాలి. రాజకీయ దృక్కోణంలో కాకుండా అభివృద్ధి కోణంలో పాలన చేయాల్సిన విషయాన్ని పాలకులు వంటబట్టించు కోవాల్సి ఉంది. ఐదేళ్లు అధికారంలోకి రాగానే మరో ఐదేళ్లు గద్దెపై ఉండడ మెలా అన్న ఆలోచన చేయడం వల్లనే భారత్ కూడా ఇంకా దారిద్యం, నిరక్షరాస్యత, వసతుల కొరత, ఆహారధాన్యాల కొరతతో అలమటిస్తోంది. ఇదంతా పాలకుల దృష్టి లోపంగా చూడాలి. నిజానికి దేశంలో నల్లధనం, అవినీతి పోవాలంటే రాజకీయ పార్టీల నుంచే ప్రక్షాళన మొదలవ్వాలి. నల్లధనం రూపంలో రాజకీయ పార్టీలు విరాళాలు తీసుకుని ఓటర్లను కొనుగోలు చేయడానికి వాడుతున్నాయి.వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు రాజకీయ పార్టీలకు ఇస్తున్న విరాళాలలో అత్యధిక భాగం నల్లడబ్బు రూపంలోనే ఉంటోంది. ఈ పరిస్థితిని నివారించకుండా ఎన్ని సంస్కరణలు చేసినా ఫలితం ఉండదు. ప్రజలకు అందని నగదు రాజకీయ పార్టీలకు మాత్రం లభిస్తోంది. ఎన్నికల్లో ఆయా పార్టీలు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న వైనం చూస్తున్నాం. అన్నిరంగాల్లో మనం ముందంజ వేయాల్సిన దశలో ఇంకా దిగుబడులపై ఆధారపడుతూ ఎగుమతుల విషయంలో లక్ష్యం లేకుండా సాగుతున్నాం. మనం చేపట్టిన సంస్కరణలు ఫలితాలు ఇవ్వడం లేదన్న విషయాన్ని గుర్తించడం లేదు. నీతి ఆయోగ్‌ను బలోపేతం చేస్తూ రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకుని ఉమ్మడిగా ముందుకు సాగాల్సి ఉంది.

# ఎన్డీయేకు పాశ్వాన్ పార్టీ గుడ్ బై

**పాట్నా, జూన్ 6, ( వెలుతురు)**
మరో ఏడాదిలో బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపులు చోటు చేసుకుంటున్నాయి. బీహార్ అధికార కూటమిలో సైతం చీలికలు తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్డీయే కూటమిలో మంత్రిగా ఉన్న లోక్ జన శక్తి పార్టీ (రాంవిలాస్) చీఫ్ చిరాగ్ పాశ్వాన్.. ఈ మేరకు సంకేతాలు ఇచ్చారు. జాతీయ రాజకీయాలకు దూరం కావాలని భావిస్తున్నట్టు ప్రకటించారు. 'జాతీయ రాజకీయాల్లో ఎంతోకాలం ఉండలేనని నేను గతంలో కూడా చెప్పాను. బీహార్, బీహారీ ప్రజల కోసమే నేను రాజకీయాల్లోకి వచ్చాను' అని పాశ్వాన్ సోమవారం మీడియాకు చెప్పారు. 'బీహార్, బీహార్ ప్రజలే తొలి ప్రాధాన్యం అనేదే నా దృక్కోణం. బీహార్ అభివృద్ధి చెందాలని, ఇతర అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో పోటీపడాలని ఎల్లప్పుడూ నేను కోరుకుంటాను. నేను మూడోసారి ఎంపీగా గెలిచిన తర్వాత ఢిల్లీలో ఈ పని సాధ్యం కాదని నాకు తెలిసివచ్చింది' అని అన్నారు. చిరాగ్ పాశ్వాన్ ప్రస్తుతం కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న విషయం తెలిసిందే. తన ఉద్దేశాన్ని పార్టీ పెద్దలకు ఇప్పటికే తెలియజేశానని ఆయన పేర్కొన్నారు. వీలైనంత త్వరగా తిరిగి బీహార్‌కు రావాలన్న నా ఆకాంక్షను పార్టీ ముందు ఉంచాను. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో నేను పోటీ చేయడం పార్టీకి ఉపయోగపడుతుందా? అనే విషయంలో మా పార్టీ పరిశీలన చేస్తున్నది. నేను అసెంబ్లీ ఎన్నికల్లో మంచి సామర్థ్యం



ప్రదర్శించగలనని, మా కూటమి కూడా సామర్థ్యం చాటుందని భావించినట్టయితే నేను అసెంబ్లీకి కచ్చితంగా పోటీ చేస్తాను' అని చిరాగ్ పాశ్వాన్ తెలిపారు. చిరాగ్ పాశ్వాన్ రాజకీయ ఆకాంక్షలపై చాలా చర్చలే ఉన్నాయి. అయితే.. ఆయన మాత్రం ముఖ్యమంత్రి పదవి విషయంలో ఊహాగానాలను కొట్టిపారేస్తున్నారు. 'బీహార్‌లో ప్రస్తుతం సీఎం పోస్టు ఖాళీగా లేదు.. ఎన్నికల తర్వాత కూడా నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి అవుతారు' అని ఆయన చెప్పారు. పాశ్వాన్‌ను రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దింపే విషయంలో త్వరలోనే ఎల్జేపీ ఒక లాంఛన ప్రకటన చేస్తుందని భావిస్తున్నారు. రిజర్వ్‌డ్ సీటు నుంచి కాకుండా జనరల్ స్థానం నుంచి పాశ్వాన్ పోటీ చేయాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నదని ఎల్జేపీ బీహార్ ఇన్‌చార్జ్, జుమాయి ఎంపీ అరుణ్‌భారతి అన్నారు. 'చిరాగ్ ఏదో ఒక వర్గానికి మాత్రమే చెందిన నాయకుడు కాదు కనుక అతను జనరల్ స్థానం నుంచి పోటీ చేయాలని పార్టీ భావిస్తున్నది' అని ఆయన తెలిపారు. తద్వారా రాష్ట్ర రాజకీయాల్లో మరింత పెద్ద పాత్ర పోషించేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారన్న సంకేతాలు వెళతాయి' అని ఆయన పేర్కొన్నారు.జూన్ 8వ తేదీన భోజ్‌పూర్ జిల్లా అరాలో నవ్ సంకల్ప్ మహాసభ పేరిట పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో చిరాగ్ పాశ్వాన్ అసెంబ్లీకి పోటీ చేయడంపై లాంఛన ప్రకటన ఉంటుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాష్ట్ర రాజకీయాలపై కేంద్రీకరించాలని చిరాగ్ నిర్ణయించుకున్నారని, జాతీయ నాయకత్వ పాత్ర నుంచి తప్పుకోవాలని భావిస్తున్నారని పార్టీ సీనియర్ నేతలు ధృవీకరిస్తున్నారు. ఈ క్రమంలోనే మోదీ క్యాబినెట్ నుంచి కూడా ఆయన తప్పుకుంటారని తెలుస్తున్నది. బీహార్ అసెంబ్లీకి అక్టోబర్, నవంబర్ నెలల మధ్య మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. బీహార్‌లో 243 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇప్పటికే బీజేపీ, జేడీయూ కూటమితోపాటు ఆర్జేడీ నేతృత్వంలోని కాంగ్రెస్, ఇతర పార్టీల ఇండియా కూటమి బరిలో ఉండగా.. తాజాగా ప్రశాంత్ కిశోర్ స్థాపించిన జన్ సూరజ్ పార్టీ కూడా సై అంటున్నది. ఈ ముక్కోణ పోటీలో గెలుపెవరిదన్నది ఆసక్తికరంగా మారింది.

(ఆధ్యాత్మికం )

# సమయపాలన ముఖ్యం !

**తిరుమల,జూన్6( వెలుతురు):**
భిష్యత్ కోసం చేసే ఆలోచనలు ఫలించాలంటే కార్యాచరణ కూడా ముఖ్యం. గాలిలో దీపం పెట్టి దేవుడా అంటే కుదరదు. ఒక్కోసారి ప్రణాళికులు విఫలం అవుతుంటాయి. అలాగని అధైర్య పడవద్దు. పదేపదే ప్రయత్నాలు చేయడం కూడా మానవద్దు. భవితకోసం చేసే ఆలోచనలు, కనే కలలు, అభిలాషలు, లక్ష్యాలు, కార్యాచరణ పథకాలు... వేటినైనా ఈ క్షణం నుంచే అమలు పరచాలి. జ్వరానికి ఔషధం ఈ క్షణం నుంచే తీసుకోవాలి. కూతురి పెళ్ళి చేయాలనుకొంటే ఆ శుభకార్యానికి అవసరమైన యత్నాలకు ఈ క్షణమే శు



భకరం. ఈ క్షణం ఎలా ఉపయోగించుకొన్నామా అన్నదానిపైనే రాబోయే క్షణాల్లో ఫలితాలు ఉంటాయి. నిన్న అన్నది గతం. రేపు అనేది ఎవరూ ఊహించని రహస్యం. ఈ క్షణాలు ఒక బహుమానం. వాటిని ఆస్వాదించాలి. చింతించడం వల్ల నిన్నటి బాధ తీరదు. ఏమవుతుందోననే దిగులువల్ల రేపు సంభవించే సంఘటనలో మార్పు రాదు. గతానికి, భవితకు వారధి ఈ క్షణం. మన వెనక గతం ఉంది. దానినుంచి నేర్చుకోవాలి. మన ముందు భవిష్యత్తు ఉంది. దానికోసం సిద్ధం కావాలి. కానీ ఈ క్షణం మనది... దానిలో జీవించాలి. క్షణాలు గడిచే కొద్దీ గంట గడచిపోతుంది. గంటలు గడచిపోతే రోజులు గతాలవుతాయి. మనం విశ్రాంతి తీసుకోవలసింది ఎప్పుడంటే... అందుకు బొత్తిగా మనకు సమయం లేనప్పుడే! అందువల్ల సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సమయపానల మన ప్రణాళికలో భాగం కావాలి.

## ఆకలి కూల్చింది... వేదన కాల్చింది... రజకులకు స్వాతంత్ర్యం ఎక్కడ?

# అభివృద్ధిలో శూన్యమేనా..!

రజకులు అనగా సంప్రదాయంగా బట్టల ఉతకే వృత్తిని కొనసాగించే సామాజిక వర్గం. వారు శ్రమతో కూడిన శుద్ధతకు ప్రాధాన్యం ఇచ్చే సేవా రంగంలో నిపుణులు. గ్రామీణ ప్రాంతాలలో ప్రత్యేకించి ప్రతి ఇంటికీ రజకుల సేవల ప్రాధాన్యం ఉండేది. వారు చేతితో, నది లేదా చెరువుల వద్ద బట్టలు ఉతికి, ఎండబెట్టి, ఇస్త్రీ చేసి తిరిగి యజమానులకు అందించేవారు. కాలక్రమేణా యాంత్రికీకరణ వల్ల ఈ వృత్తి దెబ్బతిన్నా, రజకులు ఇప్పటికీ కొన్ని పట్టణాలు, గ్రామాలలో తమ వృత్తిని నిలబెట్టుకుంటున్నారు.రజకులు కేవలం బట్టలు ఉతకేవారే కాకుండా, శుభ్రతకు ముఖ్యమైన దృక్పథాన్ని సమాజానికి నేర్పినవారు. అయితే సామాజికంగా వీరు అనేక పరిమితులకు లోనయ్యారు. వర్ణవ్యవస్థ ప్రభావంతో వారు హీనస్థితిగా వర్గంగా చొప్పించబడి, కొన్ని ముఖ్యమైన హక్కుల నుండి బహిష్కరించబడ్డారు. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో కూడా రజకుల ఆర్థిక, విద్యా, రాజకీయ పరిస్థితులు క్షీణంగా ఉన్నాయని చెప్పాలి.ప్రభుత్వాలు కొన్ని సంక్షేమ పథకాల ప్రవేశపెట్టినా, వృత్తిపరమైన అభివృద్ధికి, రజకుల సంఘాల ఆవశ్యకతలకు సరైన ప్రాధాన్యం లేకపోవడం స్పష్టంగా కనిపిస్తుంది. నేటి యువత ఈ సంప్రదాయ వృత్తిని వదిలి ఇతర ఉద్యోగాలు,స్వయం ఉపాధి మార్గాల వైపదృష్టిపెడుతున్నారు. అయినప్పటికీ, తమ సామాజిక గుర్తింపు కోసం రజకులు ఉద్యమాలు చేస్తున్నారు, రాజ్యాంగం ఇచ్చిన సమాన హక్కుల కోసం పోరాడుతున్నారు. ఈవృత్తికిగౌరవం తీసుకురావడం, ఆధునిక సాంకేతికతతో మిళితం చేయడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా రజకుల అభివృద్ధి సాధ్యమవుతుంది.పాలకులు రజకులను ఎందుకు పట్టించుకోవడం లేదు?రజకులు (ధోబీలు) భారత దేశంలో ప్రాచీన కాలం నుంచే సామాజిక సేవకులుగా గుర్తింపు పొందారు.వారికిశుద్ధత,పరిశుభ్రత అనే అంశాలపై గౌరవం ఉన్నప్పటికీ, సమాజంలో వారిస్థానాన్ని రాజకీయపాలకులు పూర్తిగా పట్టించుకోవడం లేదు. ఇది సామాజిక అన్యాయానికి,అధికారవిరోధానికినిలువెత్తునిదర్శనం.ఇక ఇప్పటివరకూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు, కొత్తగా ఏర్పడ్డ తెలంగాణలో రజకులకు అన్ని రంగాలల్లో తీరని అన్యాయం జరిగింది. ప్రస్తుతం జరుగుతున్నదని స్పష్టంచెప్పవచ్చు. ఉద్యమాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో రజకులకున్యాయం జరుగుతుందని అందరూ ఆశించినమాట తెలిసిందే.తెలంగాణలోటీఆర్ఎస్ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బడుగు,బలహీన వర్గాలను కలుపుకుంటూ ఉద్యోగస్థులకు సముచిత న్యాయం చేస్తున్న గత సీఎం కేసీఆర్‌కు రజకుల స్థితిగతులను ప్రత్యేకంగా చూడాల్సిన బాధ్యత,ఆవశ్యకత ఆనాడు ఉండెను. తెలంగాణ రాష్ట్రంలో రజకులు దాదావు 15 లక్షల పైచిలుకు ఉన్నారు. ఇందులో మెజారిటీ ప్రజానీకం కరడు గట్టినపేదరికం,నిరక్ష్యరాస్యతలతో ఉన్నారు. ఇకసామాజిక,ఆర్థిక,రాజకీయ, విద్యా, ఉద్యోగ, సాంస్కృతిక రంగాలలో రజకులువెనుకబడిపోయారనేదివిస్మరించలేని వాస్తవం. ఇప్పటికీఅగ్రకులాలవారి దాష్టీకానికి భయపడుతూ 'స్వ' కూలాన్ని దాచుకోవడం... మరుగున పెట్టుకోవడం సర్వత్రా జరుగుతుందన్నది జగమెరిగిన సత్యం. అయితే, వేద కాలం నుంచి నేటి వరకు ప్రతి ఒక్కరి నిత్యం జీవితాల్లో రజకులు పాత్ర అద్భుతమైనది. పూరిటి నెత్తురు బట్టలు పిండి, మైలను పోగొట్టి మనిషి రూపొందించే పనిలో అమ్మను మరిపించేలాబడ్డలనుఉతికిఅమ్మతనానికి ఆయువు పోసిన చాకలి వీరులను అమర్యాదగా సంబోధించే సంస్కృతి సమాజంలో ఉంది. వారంతా సంస్కారం హీనులు, సామాజిక ద్రోహులేనని చెప్పకతప్పదు. బ్రతుకంతా ఉతుకుడే అయినా బువ్వకు గతిలేని దుస్థితి ఉంటుంది. చెల్లని పైసాయరో చాకలోని చాకిరంత, మల్లెగా మేము మార్చిన మలినమేరా చాకలి బ్రతుకంతా! అన్న మాటలు ప్రస్తుతం ఉపయోగించాల్సి వస్తున్నది. నీలి మందు స్వచ్ఛమైన నీటితో ఉతకబెట్టి, జాడించి, ఇస్త్రిరి చేసి కమ్మటి సువాసనలతో ఆరోగ్యరక్షణ కోవడం లాంటి దుస్తులను, బట్టలను, వస్త్రాలనుఅందించిన తొలి రసాయనిక శాస్త్రజ్ఞుడు రజకుడు.అయితే,అటువంటి సుగుణాలు, శ్రమ శక్తి సొంతమైన వ్యక్తి ఇటు ప్రభుత్వం నుంచి అటు ప్రజానీకం నుంచి ఎటువంటి మద్ధతు రాకపోవడం శోచనీయంగత 76సంవత్సరాలపాలనలో వీరి బతుకులలో ఏ ఒక్క రాజకీయ పార్టీ, ప్రభుత్వం వెలుగు నింపలేదు. రజకులను జెండాలు మోసేందుకో, పార్టీలో ఉన్న బడా నాయకుల బట్టలు ఉతకడానికో, పార్టీకార్యక్రమాలకుదివిటీలుమోసేందుకో, తిన్న గిన్నెలు కడగడానికోవాడుకున్నారు. రాజ్యాధికారంవైపు పోదామని టిక్కెట్లు అడిగితే నీకు టిక్కెట్టు ఇస్తే ఓట్లు ఎవరు వేస్తారురా అంటూ వ్యంగంగా ఈ సడిస్తారు. నీవుగెలు స్తేమాబట్టలు ఎవరు ఊతకాలోయ్ అంటూ నీచంగా మాట్లాడుతారు. ఇప్పటికీ వీరు... ఓరీ సాకలోడా.. ఓసేయ్ సాకలి దానా అని హీనంగా పిలిపించు కోవాల్సిందేనా? నీ బాంచన్ దొర.. నీ కాల్మొక్తా అంటూ వంగి వంగి భయంగా బ్రతకాల్సిందేనా? పట్టెడు అన్నం కోసం అమ్మా, చాకలి వచ్చినా, భిక్షం వేయమంటూ ఇప్పటికీ అడిగే వాతావరణం ఉందని తెలుసుకోవాలి. గుల్లలో అడుక్కోవల్సిందేనా విసుక్కుంటూ పెట్టే ఆ పాసిపోయిన అన్నం తిని బ్రతకాల్సిందేనా?ఎంతకాలంఈదుర్మార్గం. మరెంత కాలం ఈ వివక్ష, ఎంతకాలం ఈ నరకం?



రజక కులం వృత్తికి బానిసలై దుర్భరమైన జీవితాన్ని గడువుతున్నారు. వీటిపై రజక యువత ప్రత్యేకంగా దృష్టి సారించిచైతన్యవంతులవ్వాలి.రజకులకు అడుగడునా అటంకాలే,అవమానాలే. సాంస్కృతికంగా, సాహిత్యపరంగా ఎప్పుడూ చిన్నచూపే. మేము లేనిదే బట్ట తెల్లగుండదు. సాహిత్యపరంగా, సినిమాల్లో రజకులను ద్వంద్వార్థాలతో సంబోధిస్తూ నిజజీవితంలో, సినిమాకళా ప్రపంచంలోనూ హీనస్థితిలోనే ఉంచాయి. ఈ సమాజంలోనిఅగ్రకులవర్గాలు. 76సంవత్సరాలుగా ఉమ్మడి రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధికి రజకులు నోచుకోలేదు.రాష్ట్రం విడిపోయిన తర్వాతనైనా రజకులకు న్యాయంజరిగేలాచూసేబాధ్యతతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. రజకుల సంక్షేమానికి పాలకులు ఎలాంటిఅభివృద్ధి పథకాలు ప్రత్యేకంగా అందించడం లేదు. ఏదో ఇతోధికంగా చేసే కార్యక్రమాలే తప్ప, ప్రత్యేక కార్యచరణ ఏమి లేదంటే అతిశయోక్తి కాదు. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలల్లో సంపన్నులకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి తప్ప క్రింది స్థాయి ప్రజల చెంతకు చేరడంలేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నప్రజలజీవితాలలో వెలుగునింపేందుకుప్రభుత్వంకృషిచేయాలి. భారత దేశంలో ఇప్పటికే సుమారు18 రాష్ట్రాలో ఎస్సీ జాబితాలో రజకులుఉన్నారు. ఒకే. జాతి, ఒకే వృత్తి చేసుకుంటున్న వారిని భారత రాజ్యాంగ సూత్రాల ప్రకారం ఒకే కేటగిరీలో చేర్చాలని ఉన్నప్పటికీ అప్పటి పాలకవర్గాలు విస్మరించాయి. ఇప్పటి ఏలికలు ఎలాగూ పట్టించుకోవడం లేదు. ఎస్సీ, ఎస్టీ జాబితాల్లో రజకులను చేర్చి వారి అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేయాలి. లేదా వారికి రక్షణ చట్టం ఉన్నాకల్పించాలి. రజకులు కష్టానష్టాలకు గురవుతూ ఈ వృత్తిని వదులుకుంటేతప్ప మంచి భవిష్యత్తు లేదనే నిర్ణయానికి చాలా మంది వచ్చారు. రజకవృత్తిని వదులుకుని పాచిపని చేసుకుంటూ, వాచ్‌మెన్‌గా ఉంటూ, కూలీలుగా మారిపోతున్నారనేది అందరికీ తెలిసిందే. గత పాలక వర్గాలు రజకుల కోసం ఫెడరేషన్ ఉన్న, అక్కడ తగిన బడ్జెట్ లేక, చాలీచాలని ప్రభుత్వ పథకాలు అందీ అందక, రుణాలకు బ్యాంకులు సహకరించక నానా తిప్పలు పడుతూ వీళ్ళు కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. ఇక గ్రేటర్ హైదరాబాద్ విషయానికొస్తే దాదావు చెరువులన్నీ కబ్జాలకు గురైనాయి. రజకులు మూసీనది మురుగుపై ఆధారపడుతున్నారు. వీటిలో బట్టలు ఉతికినందుకు రజకులకు చర్మ వ్యాధులు, అంటు రోగాలు, క్యాన్సర్ లాంటి రోగాలు వ్యాపిస్తున్నాయి. గ్రేటర్లో చేసే మోసాలను చూస్తే, ప్రభుత్వ భూమిలో దోబీ ఘాట్లను నిర్మించుకొని కొన్ని సంఘాలే మాఫియాలాగా-తెలంగాణలో ఉన్న తెలంగాణ రజకులను ఉతకనీయకుండా పెత్తనం చేస్తున్నాయి. వాటిలో రజకులు ఉతకాలంటే సంవత్సరానికి రూ. 50 వేల నుంచి లక్ష రూపాయలు ఇవ్వాల్సిందే. గ్రేటర్లో ఈ దందా ఎప్పటి నుంచో జరుగుతున్నది. గతంలో సీమాంధ్ర సంఘ నాయకులు, చిట్టీల దందా చేస్తూ ఆరచాకాన్ని సృష్టించారు. అదే తీరుగా తెలంగాణ రజక సంఘాలు కూడా అదే తంతుగా మారింది. దీనిపై ప్రభుత్వం చర్య తీసుకోవాలని తెలంగాణ రజకులు కోరుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన రజకులు ప్రభుత్వం ఇచ్చిన భూమికదా, ప్రభుత్వ బడ్జెట్లోనే దోబిగాట్లు నిర్మించారు కదా అని ప్రశ్నిస్తే, ఆ సంఘనాయకులు వారిపై దాడులు, సంఘ బహిష్కరణ చేస్తూ, నీ దిక్కున్నచోట చెప్పుకోపో అని హెచ్చరిస్తున్న దుస్థితి క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నది. ఇలాంటి సంఘటనలు గ్రేటర్లో ఎన్నో జరుగుతున్నా సీమాంధ్రపాలనలో చర్యలు తీసుకోలేదు. ఇలాంటి సంఘాలు ప్రతి రజకుని దగ్గర నెలకు రూ.500 నుంచి రూ.1000 వసూలు చేస్తున్నాయి. ఆడిటింగ్ లేని, రిజిస్ట్రేషన్లేని సంఘాలు గల్లీకి ఒకటి తయారై ఇష్టం వచ్చినట్లుగా రజకులను మోసం చేస్తున్నాయి. ఉపాధి లేక జీవనం గడ్డుపరిస్థితులలో గడువుతున్న రజకులను. కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. గ్రేటర్ హైదరాబాద్లో కొన్ని సంఘాలు తమ ఆధీనంలో దోబిఘాట్లను ఉంచుకొని, తమకు చెందిన వారినే వాటిలో ఉతకనిస్తూ బయటి వారినిరానివ్వకుండా చూస్తున్నాయి. తమ ఆధీనంలో ప్రభుత్వ భూమిని పెట్టుకొని అక్రమ కట్టడాలు, ఇండ్లను నిర్మాణాల కోససం అక్రమించుకుంటున్నారు. అధికారులు, సంఘాల నాయకులు కుమ్మకై భూములు ద్వారాలకు సరూర్‌నగర్, సైదాబాద్... జూబ్లీహిల్స్. మహీంద్రా హిల్స్ ఇలా నగరంలో ఉన్న దోబీఘాట్ లను అనేకంగా ఆదిపత్య ధోరణితో కాజేశారని ఆరోపణలు వస్తున్నాయి. సీమాంధ్ర ప్రభుత్వంలో కొంత మంది దళారులు దోబిఘాట్ భూముల కబ్జాలకు పాల్పడ్డారు. ఈ సీమాంధ్ర సంఘాల కబంధ హస్తలలో ఉన్న దోబిఘాట్ల పై ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం చొరవ చూపి సమగ్రమైన విచారణ జరిపించి, వాటిని ప్రభుత్వమే నిర్మించి (ప్రభుత్వ దోబీఘాట్) లేదా (రజక దోబీ ఘాటు) పేరుతో నామకరణం చేయాలి. రజకులందరికీ వాటిలో ఉతుక్కునే సౌకర్యం కల్పించాలి. అంతే కాకుండా ఇతర గ్రామాల నుండి, ఇతర పట్టణాల నుండి వచ్చే వారికి అందులో అవకాశం కల్పించాలని, వాటిని ఏ ఒక్క సంఘం ఆధీనంలో లేకుండా చూడాలని, తెలంగాణ రజకులకు న్యాయం చేకూర్చాలని, వాటిని కలెక్టర్, ఎమ్మార్వో. ఆర్ డి ఓ పర్యవేక్షణలో ఉంచాలని రజకులు కోరుతున్నారు. వాటిని నియోజకవర్గ ఎం.పి, ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్ల ఆధీనంలో ఉండేలా చూడాలని రజక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. దోబిఘాటపై ప్రతి రజకునికి హక్కు ఉండేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రజక మహిళలపై అత్యాచారాలు జరగకుండా ప్రత్యేక రక్షణ చట్టం కల్పించాలి. అదే విధంగా మహిళల చేయూత కోసం బ్యాంకుల ద్వారా వారికి డ్రైక్లినింగ్ షావులకు, ఫుట్‌పాత్‌లపై జిహెచ్ఎంసి ఇస్త్రీ డబ్బాలకు ఏర్పాటు కొరకై పర్మిషన్లు కేటాయించాలి. చిన్న పరిశ్రమల అభివృద్ధికి బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు సమకూర్చాలి. గ్రేటర్లో వుట్పాత్లపై, కాలనీలలో ఇస్త్రీ డబ్బాలు పెట్టుకోవడానికి ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలని రజకులు కోరుతున్నారు. రజక ఫెడరేషన్లలకు రూ. కనీసం 2000 కోట్ల రూపాయల బడ్జెటు కేటాయించాలని కోరుతున్నారు. గ్రేటర్ మున్సిపాల్టీలలో ఆధునికమైన పద్ధతులలో ఉతకడానికి యంత్రాలను ప్రభుత్వం ఇవ్వాలి. రజకులు తమకు కేటాయించిన భూములలోనే ఆ యంత్రాలను ఏర్పాటు చేసుకుంటారు. దీనితో మూసినదిలో ఉతకడంవల్ల అనారోగ్యం పాలు కాకుండా రజకులకు పాలకులు మేలు చేస్తారనే ఆశాభావం వ్యక్తపరుస్తున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ ఉద్యోగాలలో రజకులకు కోటాల వారీగా నోటిఫికేషన్ విడుదల చేయాలి. తద్వారా రజకులు కూడా ప్రభుత్వ ఉద్యోగాలు పొందుతారు. సమాజంలో రజకుల జనాభా అధికంగా ఉన్నప్పటికీ నిరక్షరాస్యత దాదావు అంతే. మొత్తంలో ఉన్నది. అందుకు కారణం ప్రభుత్వాల అసమర్థ పాలననే. గ్రేటర్ హైదరాబాద్ లో కూడా రజక విద్యార్థులకు ప్రభుత్వ ఆధీనంలో వసతి గృహాలు.. ఏర్పాటు చేసి, రజక విద్యార్థులు సమాజంలో పోటీపడే విధంగా ప్రోత్సాహాన్ని ప్రభుత్వం అందించాలని రజకులు కోరుకుంటున్నారు. రజకులను ఎస్సీ, ఎస్టీ జాబితాలో చేర్చాలని సుమారు 76 సంవత్సరాలుగా డిమాండ్.. చేస్తున్నప్పటికీ సీమాంధ్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదు. అందుకే తెలంగాణ ఉద్యమంలో అలుపెరగకుండా తెలంగాణ రాష్ట్రం సిద్ధించేంతవరకు తమ ప్రాణాలు సైతం ముందు పెట్టి రజకులు ముందుకు నడిచారు. ఈ బంగారు తెలంగాణ తల్లి ఒడిలోనైనా రజకులకు ఆత్మాభిమానం, సమానత్వం, ఆత్మగౌరవం, సమాన హక్కు దొరుకుతాయని రజక ప్రజలు ఆశిస్తున్నారు. రజకులకు కావాల్సిన మూడు ఎకరాలు పొలం, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 10 లక్షల ఎక్స్ గ్రేషియా, గ్రేటర్ హైదరాబాద్లో రజక సంక్షేమ విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వ భవనం, హస్టల్, వగైనాసమకూర్చాలి .ప్రధానంగా, రజకులు తరచుగా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉంటారు. వీరి వృత్తిని ఆధారంగా తీసుకుని ప్రభుత్వాలు వాగ్దానాలు చేస్తూ రాజకీయ ప్రయోజనం కోసం ఉపయోగించుకుంటాయి. కానీ ఎన్నికల తరువాత వారి సమస్యలపై పట్టింపు చూపడం లేదు. ఇది వారిని ఓటర్లుగా మాత్రమే చూడడం, మనుషులుగా కాదు అనే దానికే సంకేతం.రజకుల సమస్యలు అనేకం – ప్రాథమిక వనరుల కొరత, సరైన ఉద్యోగ అవకాశాలు లేకపోవడం, ప్రభుత్వ పథకాలు వారికి అందకపోవడం, ప్రొఫెషనల్ స్కిల్స్ అభివృద్ధికి సరైన శిక్షణ లేకపోవడం వంటివి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రజకులకు భూములు లేవు, వాషింగ్ ప్లాంట్ల వసతులు లేవు. నూతన టెక్నాలజీకి అనుగుణంగా మారడానికి ఆర్థిక సాయమూ లేదు. అయినప్పటికీ, పాలకవర్గం వారి పట్ల ఏ దృష్టికోణాన్ని కూడా ప్రదర్శించకపోవడం గమనార్హం. ఇంకా ముఖ్యంగా, రజకులు ఓ బలమైన సామాజిక వర్గం. అయితే ఈ వర్గం రాజకీయంగా చిత్తుగా విభజించబడి ఉండడం వల్ల, వారు ఒక నిర్దిష్ట శక్తిగా బయటపడలేకపోతున్నారు. వారి సమస్యలు ఒక నిర్దిష్ట ఏజెండాగా ఏ పార్టీ పరిగణించకపోవడమూ, వారు ఓట్లు వేస్తున్న పార్టీలు వారిని మోసం చేయడమూ జరుగుతోంది.రజకులు ఎస్సీ/బీసీ జాబితాల్లో బహుశా వేరే వర్గాలలో చేరి ఉన్నప్పటికీ, వారి వృత్తి ఆధారంగా ప్రత్యేక విధానాలు అవసరం. కేంద్రం, రాష్ట్రాలు వారికోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి, వృత్తి ఆధారంగా శిక్షణ, రుణాలు, సామాజిక భద్రత లాంటి అంశాల్లో మద్దతు ఇవ్వాలి. కానీ ఈ విషయాల్లో పాలకులు ఏ చర్యలు తీసుకోవడం లేదు. ఈ నిర్లక్ష్యం వారి జీవనోపాధిని ముప్పులోకి నెడుతుంది. అవమానాలు, విరోధాలు ఎదుర్కొంటున్న రజకుల పరిస్థితిని మార్చడానికి సమాజం ఒకటిగా నిలవాలి. వారికి గౌరవంతో జీవించే హక్కు ఉందన్న దాన్ని గుర్తు చేయాలి.పాలకులు తమ కళ్లలో సామాజిక సమానతను చూపించాలంటే, రజకుల పట్ల వ్యవహారంలో మార్పు తెచ్చుకోవాలి. శ్రామిక వర్గాల పట్ల గౌరవం చూపకపోతే, ప్రజాస్వామ్యానికి కూడా అర్థం లేదు. రజకుల బాధలు పట్టించుకునే రోజు ఎప్పుడొస్తుందో అన్నది ఇప్పుడు ప్రశ్నగా మిగిలిపోతోంది.

ఇక తెలంగాణ రాష్ట్రంలో "గల్లీకో సంఘం," సంఘాలు ఏర్పడడం వల్ల వైనం చులకనగా మారిన విషయం సామాజిక, రాజకీయ, ఆర్థిక పరంగా తీవ్రమైన సమస్యగా మారింది. పూర్వకాలంలో ఒకటే లక్ష్యంతో ఏర్పడిన సంఘాలు సమాజాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పంచుగల వేదికలుగా పనిచేశాయి. కానీ ఈ రోజుల్లో అనేక సంఘాలు ఏర్పడడంతో, వాటి ఉద్దేశ్యం, విధానం చాలా చులకనగానే మారిపోయింది.మొదటగా, సంఘాల సంఖ్య ఎక్కువై, వాటి ఉద్దేశాలు మరియు పనితీరు అస్పష్టంగా మారిపోయాయి. చాలాసార్లు ఈ సంఘాలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నట్లు కనిపిస్తాయి. రాజకీయ రంగంలో ప్రాముఖ్యత పొందేందుకు, తమ ప్రభావాన్ని పెంచుకునేందుకు, వ్యక్తిగత హితాలు నెరవేరుస్తూ వైనం ఎక్కువవుతుంది. ఫలితంగా, సమాజంలో అవగాహన కంటే అపవాదాలు, అభ్యంతరాలు, సంఘాలు మధ్య విభేదాలు పెరుగుతాయి.ఇంకా, ఈ వైనం కారణంగా, నకిలీ, అప్రామాణిక సంఘాలు కూడా పుట్టుకొస్తాయి. అవి తమ ఉద్దేశాలను దారితప్పించి, అప్రతిష్ట పాలు పంచుతాయి. నిజమైన అభివృద్ధి, సహకార భావన కంటే ఆత్మకేంద్రీకృత ప్రయోజనాలు ముందుకెళ్తాయి. ముఖ్యంగా, సంఘాల నాయకత్వంలో అవినీతి, అణచివేత చర్యలు కనిపిస్తాయి. అవి సంఘాల పేరును మ్రొక్కేసి, సామాజిక విశ్వసనీయతను తగ్గిస్తాయి.అనేక సంఘాలు ఏర్పడడం వల్ల వైనం తీవ్రత పెరిగి, సామాజిక సమరసతకు కూడా ముప్పు ఏర్పడింది. కొందరు సంఘాల మధ్య పోటీ, టు-టు, నేను-నేను పోరాటాలు, పరస్పర విమర్శలు సామాజిక ఏకత్వాన్ని బలహీనపరుస్తున్నాయి. ప్రజల విశ్వాసం తగ్గిపోవడం వల్ల నిజమైన సేవలపై కూడా నమ్మకం తగ్గింది. ఇది ప్రభుత్వ, అర్ధ ప్రభుత్వ సంస్థలకు కూడా ప్రతికూల ప్రభావం కలిగిస్తుంది.ఇలా వైనం, గోల పెరుగుతూ ఉండటం వల్ల సమాజంలో కలవరమే కాకుండా, అభివృద్ధి పనులు కూడా ఆగిపోతున్నాయి. సంఘాల సార్థకత తగ్గిపోవడం వల్ల, ప్రజల జీవితాల్లో వాస్తవ మార్పులు సాధించడం కష్టమవుతుంది. అందుకే సంఘాల స్థాపనలో కచ్చితమైన నియంత్రణలు, సమర్థమైన నియమాలు అవసరం. అవి పాటించకపోతే, సంఘాల బలహీనత పెరుగుతుంది, వైనం ఇంకా ఎక్కువవుతుంది.మొత్తానికి, అనేక సంఘాలు ఏర్పడటం వలన వైనం చులకనగా మారడం వల్ల సమాజానికి, అభివృద్ధికి, న్యాయప్రవాహానికి తీవ్ర హానికరంగా మారుతుంది. అందువల్ల సంఘాలు తమ అసలు లక్ష్యాన్ని మర్చిపోకుండానే, సహకారంతో, సమన్వయంతో పనిచేయాలి. సమాజం చురుకుగా, కృషితో ముందుకు వెళ్లేందుకు మాత్రమే సంఘాల ప్రాముఖ్యత ఉంటుంది.

తెలంగాణలో రజకుల జనసంఖ్య, వృత్తి మార్పులురజకుల సంఖ్య లక్షల్లో ఉంది. ప్రధానంగా మండల, గ్రామ స్థాయిలో, నగరాల్లోనూ వీరి సముదాయం ఉంది. పాత తరాలు బట్టలు ఉతికే వృత్తిని కొనసాగించినా, కొత్త తరాలు ఆర్థికంగా స్థిరపడేందుకు ఇతర వృత్తులవైపు అడుగులు వేస్తున్నాయి. కొందరు కూలీలుగా, కార్మికులుగా మారగా, కొందరు చిన్నవ్యాపారాలు చేసుకుంటున్నారు. అయినా ఇప్పటికీ చాలామంది washermen వృత్తిలోనే కొనసాగుతున్నారు. ప్రభుత్వ మద్దతులు లేకపోవడం, ఆధునిక యంత్రాల అందుబాటులో లేకపోవడం వల్ల వీరు ఉపాధిలో నష్టపోతున్నారు.

### సామాజిక, ఆర్థిక స్థితిగతులు

రజకులు ప్రధానంగా పేద వర్గానికి చెందినవారు. వారి నివాసాలు నగర పక్కన శివారులో, గ్రామాలలో వెలివాడల్లో ఉంటాయి. విద్యా అవకాశాలు తక్కువ, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం తక్కువగా ఉంది. పెద్దగా భూములు లేకపోవడం, ఎలాంటి స్థిరాస్తి లేకపోవడం వల్ల ఆర్థికంగా వెనుకబడి ఉన్నారు. స్వయం ఉపాధికి అవసరమైన పెట్టుబడులు లేకపోవడం, బ్యాంకుల నుండి రుణాల దొరకకపోవడం కూడా ప్రధాన సమస్యలు.

### రాజకీయ ప్రాతినిధ్యం లోపం

రజకులకు రాజకీయ పార్టీల్లో స్థానం చాలా తక్కువగా ఉంది. ఏమ్మెల్యే, ఏమ్మెల్సీ స్థాయిలో గాని, పార్టీ పొలిట్‌బ్యూరోలలో గాని రజకులకు నామమాత్రమైన ప్రాతినిధ్యమే ఉంది. ఇది ఈ వర్గానికి రాజకీయ అశ్రయం లేకపోయిన సూచన. వారి సమస్యలను శాసనసభల్లో ప్రస్తావించే వారే తక్కువ. రజకులు తమకు రాజకీయ న్యాయం కావాలంటూ నిరంతరం పోరాడుతున్నారు. కానీ సమకాలీన అభివృద్ధి, విద్య, ఆరోగ్య, ఆర్థిక రంగాల్లో అనేక అవరోధాలతో వారుపశ్చాత్తాపంగావెనుకబడిపోయారు. ఈ నేపథ్యంలో రజకుల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టడం చాలా అవసరం.రజకులు అనేక ప్రాంతాల్లో తక్కువ విద్య, ఆర్థిక పరిమితులు, సామాజిక దుస్థితి కారణంగా పూర్వీకుల సంప్రదాయ వృత్తిలో ఉండిపోతున్నారు. ఇది వారి సమగ్ర అభివృద్ధికి ఆటంకం అవుతోంది. రజకుల వృత్తి కొంతమందికి అస్థిరమైన ఉపాధి, కనీస జీతాలు అందటం వల్ల వారి జీవన ప్రమాణం తక్కువగా ఉంటుంది. అలా ఉంటే వారికి ప్రోత్సాహక చర్యలు, ఆర్థిక సహాయం, రజకులు విద్యలో తక్కువ పాల్గొనడం, అధిక చదువుకునే అవకాశాలు లేకపోవడం వల్ల తదుపరి తరం వారి అభివృద్ధి తగ్గుతుంది. అందుకే ప్రభుత్వాలు విద్యారంగంలో రజకులకు ప్రత్యేక స్కాలర్‌షిప్లు, మెరుగైన పాఠశాలలు ఏర్పాటు చేయాలి. ఆరోగ్య సేవలు,ఆర్థిక సరిహద్దుల వలన రజకులు మంచి వైద్యసేవలు పొందడం కష్టమే. ప్రభుత్వ ఆరోగ్య పథకాలు, ఫ్రీ వైద్య చికిత్సలు, ఆరోగ్య శిబిరాలు వారి ఆరోగ్య స్థాయిని పెంచడానికి అవసరం. సాంస్కృతిక పరిరక్షణ,రజకుల సంప్రదాయాలను గుర్తించి, వారి కళలు, సంస్కృతిని ప్రోత్సహించడం వల్ల వారికి గుర్తింపు కలుగుతుంది. ఇది వారి ఆత్మగౌరవాన్ని పెంచుతుంది.ప్రత్యేక రిజర్వేషన్లు,రజకులు మరింతగా పురోగమించడానికి వారి ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యాసంస్థలలో రిజర్వేషన్లు ఇవ్వడం ద్వారా వారికి సమాన అవకాశాలు కల్పించవచ్చు.స్కిల్స్ అభివృద్ధి కార్యక్రమాలు,ఆధునిక వృత్తులలో ప్రవేశం కోసం నైపుణ్యాలు నేర్పించే శిక్షణా ప్రోగ్రాములు చాలా ఉపయోగకరంగా ఉంటాయి.రజకులు సాంఘిక, ఆర్థిక, విద్యా పరంగా వెనుకబడి ఉన్న వర్గం కావున, వారి సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ఈ చర్యలు వారు సమాజంలో సమాన, గౌరవప్రద స్థానాన్ని పొందడానికి దోహదపడతాయి. అందువల్ల, రజకులను ఆమడ దూరంలో ఉంచకుండా, ప్రభుత్వ పథకాలు, నిధులు, మద్దతు అందించడం ఎంతో అవసరం.

### రజకులకు కేటాయించిన భూములు కబ్జాకు గురవడం - తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గతంలో అనేక కుల సంఘాలకు భవనాల నిర్మాణం కోసం రెండు మూడు ఎకరాల చొప్పున భూములు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రజకుల సంఘానికి కూడా మేడిపల్లిలో రెండు ఎకరాల భూమిని అప్పటి సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం కేటాయించింది. అయితే, ఆ భూములు ప్రస్తుతం కబ్జాకు గురవడమే కాకుండా, రజకుల అభివృద్ధికి వెన్నుపోటుగా మారాయి.రజకులు అనేవారు , బట్టలు దుస్తులు కడిగే వృత్తిని పునాది చేసుకుని శ్రమజీవులుగా జీవించే వర్గం. ఈ వర్గాన్ని సామాజిక, ఆర్థికంగా మౌలికంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో భవనాల కోసం స్థలాన్ని కేటాయించారు. రజక భవన్, ట్రైనింగ్ సెంటర్, సామూహిక కార్యక్రమాలకు వీలుగా ఈ భూమిని ఉపయోగించాలన్నది ఆలోచన. కానీ ఆ స్థలం అసలు రజకులకు ఉపయోగపడక ముందే ప్రైవేట్ చేత కబ్జాకు గురవ్వడం బాధాకరం.ఇది ఒక్క భూమి సమస్య మాత్రమే కాదు, ఇది ప్రభుత్వం ఇచ్చిన హామీలపైనే నమ్మకాన్ని దెబ్బతీయడమే. భూమిని కబ్జా చేసిన వారి వెనక రాజకీయ ఆశ్రయం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార యంత్రాంగం మాత్రం ఇప్పటివరకు చోద్యం ముట్టించని స్థితిలో ఉంది. ఇది రజకుల వర్గం పట్ల న్యాయం కాదు.రాజకీయపరంగా శబ్దాలు చేస్తూ పౌరుల మద్దతు పొందే నాయకులు, ఎన్నికల సమయంలో ఓట్లు అడిగే పార్టీలు - ఇటువంటి సమస్యలపై మాత్రం మౌనం పాటించడం అత్యంత బాధాకరం. రజకులు గతంలో అగ్రహార వ్యవస్థకు బలై, ఆర్థికంగా వెనుకబడ్డ వర్గంగానిలిచారు. ఈతరహావ్యవహారాలు వారి అభివృద్ధికి అడుగడుగున అడ్డంకులు కలిగిస్తున్నాయి.ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణంగా స్పందించాల్సిన అవసరం ఉంది. మేడిపల్లిలో కేటాయించిన భూమిపై కబ్జా ఆగడాలు ఎవరి ద్వారా జరిగాయి? ఎలాంటి స్థల పత్రాలు ఉన్నాయో విచారణ జరిపి, అసలైన దానిని రజకులకు అప్పగించాలి. అలాగే, రజకుల అభివృద్ధికి మరింత స్థలాన్ని కేటాయిస్తూ, నిధులు విడుదల చేయాలి.సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధే సమగ్ర అభివృద్ధికి మార్గం. కాబట్టి, వంచించబడిన రజకుల వర్గానికి న్యాయం జరిగేలా ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి. లేనిపక్షంలో ఇది కులవర్గాల నమ్మకాన్ని కోల్పోయే పరిస్థితికి దారితీస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతీసుకొని రజకులకు మేలు జరిగేలా చూడాలని యావత్,రజకసమాజంఅభ్యర్థిస్తున్నది.గత ప్రభుత్వంలో కుటిల రాజకీయాలే తప్ప రజకులకు ఒరగలేదని నగ్నసత్యం.



మన్నారం నాగరాజు

# 11 ఏళ్లలో భారతదేశ దిశ దశ మార్చిన మోడీ సర్కార్..

- ఎన్నో చారిత్రక విజయాలతో మోదీ ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుంది..
- 11 సంవత్సరాల మోదీ ప్రభుత్వం సంకల్ప సాకారం పేరిట చేపట్టాల్సిన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయాలి..
- బిజెపి కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు...

**కరీంనగర్ వెలుతురు జూన్ 06:**

2014,2019, 2024లో వరుసగా మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం భారత దేశ దిశా దశ మార్చిందని , గత 11 ఏళ్లలో దేశం కోసం ఎన్నో అద్భుతాలు చేపట్టి చారిత్రక విజయాలతో ముందు కొనసాగుతుందని బిజెపి కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు అన్నారు..
బిజెపి చొప్పదండి రూరల్ మండల అధ్యక్షులు మొగిలి మహేష్ ఆధ్వర్యంలో మండల (వర్క్ షాప్) కార్యశాలలో ముఖ్యఅతిథిగా హాజరైన బోయిన్పల్లి ప్రవీణ్ రావు మాట్లాడుతూ
బిజెపి జాతీయ అధ్యక్షులు జేపి నడ్డా ఆదేశాల మేరకు 11 సంవత్సరాల మోడీ ప్రభుత్వం - సంకల్పంతో సాకారం పేరిట చేపట్టే వివిధ కార్యక్రమాల కోసం శుక్రవారం రోజున చొప్పదండి బిజెపి శ్రేణులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమర్థవంతమైన , నిర్ణయాత్మక నాయకత్వంలో , వికసిత్ భారత్ లక్ష్య సహకారం దిశగా ఆత్మవిశ్వాసం తో, ఎన్నో చారిత్రక విజయాలతో మోడీ ప్రభుత్వం 11 సంవత్సరాలు విజయవంత పాలన పూర్తి చేసుకుంటున్న శుభ సందర్భంలో



ఉన్నామని తెలిపారు. మోడీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, అదేవిధంగా ఆపరేషన్ సింధు లాంటి చారిత్రక విజయంతో దేశ ఖ్యాతి విశ్వంలో మార్మోగిపోతుంద న్నారు. జాతీయ పార్టీ పిలుపుమేరకు 11 సంవత్సరాల మోడీ ప్రభుత్వం... సంకల్పంతో సాకారం పేరిట చేపట్టాల్సిన ప్రోగ్రాంలను బిజెపి శ్రేణులు అందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అందులో ముఖ్యంగాజూన్5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 15 వరకు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని, తల్లి పేరుతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. అలాగే 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం, 23న డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్, 25న ఎమర్జెన్సీ డే లాంటి ముఖ్య కార్యక్రమాలను ఉన్నాయని, పార్టీ సూచన పత్రంలో ఉన్న అన్ని కార్యక్రమాలను పూర్తిస్థాయిలో చేపట్టాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. 11 ఏళ్ల మోదీ ప్రభుత్వ విజయవంత పాలన పట్ల హర్షం వ్యక్తం చేస్తూ , ప్రధాని మోదీకి అభినందనలు తెలియజేస్తూ , ఆపరేషన్ సింధూర్ ను విజయవంతంగా చేపట్టిన భారత త్రివిదదళాలకు, ప్రధాని మోదీ కి అభినందనలు, కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశంలో తీర్మానం చేశారు.

ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ ఎంపిటిసిల మండల అధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి తోట కోటేష్ సర్పంచ్ గుంట రవి బిజెపి సీనియర్ నాయకులు సింగిరెడ్డి భూమిరెడ్డి విలాసాగరం అంజయ్య బద్దన పెల్లి రాజేందర్ ఎడ్ల సురేష్ ముద్దం చందు దయ్యాల శేఖర్ దామెర మధుసూదన్ రెడ్డి జక్కుల అంజయ్య మడ్డి పరశురాములు తాటికొండ కుమార్ దూస చిరంజీవి గసికంటి రవి మండల సతీష్ ఏం ముని అయిదా మారుతి తిరుపతి కుక్కల అంజయ్య తమ్మడి రాజు తదితరులు పాల్గొన్నారు



# 11 ఏళ్ల మోదీ పాలనలో దేశానికి ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు...

- వరల్డ్ నెంబర్ 1 లీడర్ ప్రధాని మోదీ....
- వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా , చారిత్రక , సాహసోపేత నిర్ణయాలతో 11 ఏళ్ల మోడీ ప్రభుత్వ పాలన....
- 11 సంవత్సరాల మోదీ ప్రభుత్వం... సంకల్ప సాకారం పేరిట చేపట్టాల్సిన కార్యక్రమాలను విజయవంతం చేయాలి...

**తిమ్మాపూర్ వెలుతురు జూన్ 06:**

11 ఏళ్ల ప్రధాని మోడీ పాలనలో దేశానికి ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చిందని, గ్లోబల్, వరల్డ్ మోస్ట్ పాపులర్ నంబర్ వన్ లీడర్ స్థానంలో ప్రధాని మోదీ ఉన్నారని, వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా , చారిత్రక సాహసోపేత నిర్ణయాలతో 2014 నుండి మోడీ ప్రభుత్వ పాలన విజయవంతంగా కొనసాగుతుందని బిజెపి నాయకులు, తిమ్మాపూర్ మండలం ఇన్చార్జి గుజ్జ శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర తెలిపారు. బిజెపి జాతీయ అధ్యక్షులు జేపి నడ్డా ఆదేశానుసారం , రాష్ట్ర పార్టీ సూచన మేరకు, 11 సంవత్సరాల మోదీ ప్రభుత్వం - సంకల్ప సాకారం పేరిట తిమ్మాపూర్ మండలంలో చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాల కోసం శుక్రవారం రోజున మహాత్మా నగర్ లోని శ్రీ తపాలా లక్ష్మీనరసింహస్వామి దేవాలయ కళ్యాణ మండప ప్రాంగణంలో స్థానిక నాయకులు కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన గుజ్జ సతీష్, అధ్యక్షత వహించిన బొంతల కళ్యాణ్ చంద్ర లు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమర్థవంతమైన , నాయకత్వంలో భారతదేశ దిశా దశ మారిందన్నారు. ఆత్మనిర్భార్ భారత్ , మేకిన్ ఇండియాతో



దేశం తిరుగులేని శక్తిగా అవతరించిందని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం తీసుకున్న సంచలన, చారిత్రక నిర్ణయాలు దేశాన్ని ప్రగతి పతంలోకి తీసుకువెళ్లాయన్నారు.

మోడీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్నారు. ఉగ్రవాదుల స్థావరాలను మట్టు పెట్టి ఆపరేషన్ సింధూర్ తో పాకిస్తాన్ కు వెన్నులో వణుకు పుట్టించి దాయాదిదేశంపై సాధించిన చారిత్రక విజయంతో దేశ కీర్తి , ఖ్యాతి విశ్వంలో మార్మోగిపోతుందన్నారు. అందుకే 11 ఏళ్ల మోడీ విజయవంత పాలన ప్రస్థానంపై జాతీయ పార్టీ పిలుపుమేరకు 11 సంవత్సరాల మోడీ ప్రభుత్వ... సంకల్ప సాకారం పేరిట పలు కార్యక్రమాలను , ప్రోగ్రాంలను చేపట్టాలని జాతీయ రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆ ప్రోగ్రాంలన్నీ బిజెపి శ్రేణులు అందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అందులో ప్రధానంగా జూన్5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 15 రోజులపాటు తమ తమ ప్రాంతాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ముఖ్యంగా అమ్మ పేరిట ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు . అలాగే 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం, 23న డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్, 25న ఎమర్జెన్సీ డే లాంటి ముఖ్య కార్యక్రమాలను చేపట్టాలని , పార్టీ సూచన పత్రంలో అన్ని కార్యక్రమాలను విజయవంతం చేపట్టాలని సందర్భంగా పిలుపునిచ్చారు. 11 ఏళ్ల మోదీ ప్రభుత్వ విజయవంత పాలన పట్ల హర్షం వ్యక్తం చేస్తూ , ప్రధాని మోదీకి అభినందనలు తెలియజేస్తూ , ఆపరేషన్ సింధూర్ ను విజయవంతంగా చేపట్టిన భారత త్రివిదదళాలకు, ప్రధాని మోదీ కి అభినందనలు, కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించారు. సమావేశానంతరం అనంతరం శ్రీ తపాలా లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ కళ్యాణమండప ప్రాంగణం వద్ద బిజెపి శ్రేణులు పలు మొక్కలు నాటారు.



# నేడు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించనున్న...

- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ .

**వెలుతురు న్యూస్, అమ్రాబాద్:**



అమ్రాబాద్ మండల కేంద్రంలోని అన్ని గ్రామాలలో మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలు అందిస్తారని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లమల ముద్దుబిడ్డ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ చేతులమీదుగా ఇందిరమ్మ ఇల్లు పత్రాలను పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయా గ్రామాల లబ్ధిదారులు నేడు ఉదయం 10 గంటలకు అమ్రాబాద్ ఎం.కె గార్డెన్ ఫంక్షన్ హాల్ దగ్గరికి చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు , వివిధ అనుబంధ సంఘాలు నాయకులు,కార్యకర్తలు, అందరూ విధిగా హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# చండూర్ లో మార్నింగ్ వాకింగ్ చేస్తూ రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన...

- మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**నల్గొండ జిల్లా బ్యూరో/ చండూర్ జూన్ 6 (వెలుతురు):**

శుక్రవారం ఉదయం చండూరు మున్సిపాలిటీ పరిధిలో 400 మీటర్ల రోడ్డు పనులను పరిశీలించిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి త్వరితగతిన పూర్తి చేయాలని అక్కడికి వచ్చిన షాపు యజమానులతో కూడా మాట్లాడడం జరిగింది. రోడ్డు విస్తరణ పనుల కు సహకరించాలని చండూరు మున్సిపాలిటీ మంచి గా అభివృద్ధి చేసి ఇచిన మాట ప్రకారం అభివృద్ధి చేసి చూపిస్తా అని తెలియచేశారు. అనంతరం అంగడిపేట గ్రామంలో బ్రిడ్జి నిర్మాణం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం రోజున టిటిడి బ్రహ్మోత్సవాల సందర్భంగా హైదరాబాద్ మేయర్ గౌరవనీయులు గద్వాల విజయలక్ష్మి హిమాయత్ నగర్ లోని బాలాజీ భవన్ విచ్చేసి స్వామివారికి దర్శించుకోవడం జరిగింది. ఆమెకు హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలుసుకొని పూజ అర్చన చేయించి ఆశీర్వచనాలు ఇప్పియడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**హైదరాబాద్ వెలుతురు జూన్ 06:**

# ముఖ్యమంత్రి పర్యటన చేస్తే సర్పంచులు పెండింగ్ బిల్లులు అడుగుతారని అరెస్టులు చేస్తారా

- ప్రజా పాలన కాదు ఇది పాపిష్టు పాలన
- తెలంగాణ సర్పంచ్ ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్




**నారాయణపురం వెలుతురు జూన్ 06:**

శుక్రవారం రోజున యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్పంచులను అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నాను. తెలంగాణ సర్పంచ్ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ గ్రామాలలో అభివృద్ధి పనులు చేసిన సర్పంచుల పెండింగ్ బిల్లులు




చెల్లించకుండా కక్ష సాధింపు చర్యకు పాల్పడుతూ రాజకీయాలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఏ జిల్లాకు పర్యటన చేస్తే జిల్లాకు సంబంధించిన ప్రశ్నించే గొంతికలను అర్ధరాత్రి ఇళ్ల ముందట పోలీసులను పెట్టి అరెస్టు చేపియ్యడం సిగ్గుమాలిన చర్య ఈ ప్రజా పాలనలో అరెస్టులు నిర్బంధాలు నా పరిపాలనంటే గ్రామాలలో అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని యాదాద్రి భువనగిరి జిల్లా సంబంధించిన సర్పంచులు అడుగుతే అర్ధరాత్రి పోలీసులను పెట్టి అరెస్టు చేపీయడమేనా మీ పరిపాలన ఏందో ఈ ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని చెప్పి శంకుస్థాపనలు చేయడం ఏందో అర్థం కావడం లేదు, మా పెండింగ్ బిల్లులు చెల్లించమని 17 నెలలుగా ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇస్తూ గాంధీ మార్గంలో మార్గంలో నిరసనలు తెలుపుతూ మొత్తుకున్నా కనికరం లేని రాక్షస పాలన వద్దురా నాయన రేవంత్ రెడ్డి పరిపాలనని ప్రజలు వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి గుడ్ బై చెప్తారు ప్రభుత్వానికి కావున ఈ ప్రభుత్వం ప్రజల్ని దృష్టి మళ్లించాలంటే కాళేశ్వరం కమిషన్ అని ప్రతిపక్ష నేతలకు నోటీసులు ఇవ్వడం తప్పుడు ఆరోపణలతో నేతలను ఇబ్బందుల గురిచేయాలనే కక్షపూరిత రాజకీయాలతో ప్రభుత్వం నడిపిస్తూరని ప్రజలు గ్రహిస్తున్నారు కావున మీరు ప్రజా పాలన మీద దృష్టి పెట్టి మీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలు 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాను

# నూతన వధూవరులకు కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి. రమణ, గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మి గౌడ్ చిలువేరు ల ఆశీర్వాదం



**కేసముద్రం వెలుతురు జూన్ 06:**

కేసముద్రం మండలం తాళ్ల పూసపల్లి గ్రామానికి చెందిన నరేటి సురాంబ-కొమురయ్య గౌడ్ ల కుమారుడు సాయి కుమార్ గౌడ్ వివాహం పెళ్లి కుమార్తె సాత్విక తో పి ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్ కేసముద్రం రోడ్డు మహబూబాబాద్ లో జరగగా ఈ వివాహ మహోత్సవ వేడుకకు కేజీ కేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి.రమణ గోపా డివిజన్ అధ్యక్షులు కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ లు హాజరై నూతన వధూవరులను వారి దాంపత్య జీవితం నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆ దేవుడి ఆశీస్సులు వారిపై మెండుగా ఉండాలని వధూవరులను అక్షంతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కేజీకేఎస్ జిల్లా అధ్యక్షులు యమగాని వెంకన్న,మాజీ సర్పంచ్ ముధిగిరి సాంబయ్య, గొర్రె వెంకన్న గౌడ్,బీసీ నాయకులు వెంకన్న గౌడ్,రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇల్లందు నియోజకవర్గానికి 5 సార్లు ప్రాతినిధ్యం వహించిన మాజీ శాసనసభ్యులు గుమ్మడి నర్సయ్య గారితో మీ సమ్మి గౌడ్

**కేసముద్రం వెలుతురు జూన్ 06:**

# నెరవేరిన బీటీ రోడ్డు కల...

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన నాయకులు, ప్రజలు...

**వెలుతురు, చారకొండ 06జూన్:**



చారకొండ మండలం లోని జేపల్లి గ్రామ పంచాయతీ పరి ధిలోని నేమలిగుట్టతండాకు బీటీ రోడ్డు..దశాబ్దాల కల నెరవేరింది. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారా యణరెడ్డి సహకారంతో జూపల్లి నుంచి నేమలిగుట్టతండా వరకు రూ. 2కోట్ల70 లక్షలు నిధులతో 3కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డు వేసినందుకు ఎమ్మెల్యేకు తండా వాసులు, గ్రామస్తులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపి, ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మా జీ ఏంపి టిసి నృపాల్ నాయక్, మాజీ వార్డు సభ్యు లు భాషా, జైపా ల్ నాయక్, పవన్ నాయ క్, మనిరా మ్,అశోక్, లక్ష్మణ్, మున్నా, రవీంద ర్, చంద్రు, ముత్యాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఇకనుంచి ఏటా డిఎస్సీ నిర్వహణ : లోకేశ్

**అమరావతి,జూన్ 6( వెలుతురు):**

ఏడేళ్ల తర్వాత విజయవంతంగా మెగా డీఎస్సీ చేపట్టామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఇకనుంచిఏటా డిఎస్సీ నిర్వహించి పోస్టులు భర్తీ చేస్తామన్నారు. శుక్రవారం నుంచి మొదలైన డిఎస్సీ సందర్భంగా ఆయన మాట్లాడారు. పకడ్బందీగా పరీక్షలు ప్రారంభించిన యంత్రాంగానికి అభినందనలు చెప్పారు. ఇకపై ఏటా డీఎస్సీ నిర్వహించి టీ-చర్ పోస్టులు భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. పారదర్శకంగా బదిలీలు, ప్రమోషన్ల పక్రియ కూడా ప్రారంభించామన్నారు. మొట్టమొదటి సారిగా నాలుగు వేల మందికి స్కూల్ అసిస్టెంట్లు-గా పదోన్నతి కల్పించామని గుర్తు చేశారు. నూరుశాతం అక్షరాస్యత కోసం ప్రాజెక్ట్ ప్రారంభించినట్లు-వెల్లడించారు. విద్యాశాఖ అధికారులతో మంత్రి నారా లోకేశ్ సమీక్ష నిర్వహించారు.

# మోడీ ప్రభుత్వం పేద ప్రజలకు చేసిన సంక్షేమ పథకాలను గ్రామ గ్రామన ప్రజలకు వివరించాలి

- ఆరు గ్యరంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది
- బిఆర్ఎస్ ప్రభుత్వ గత 10 ఏళ్లు మోసం చేసిన విషయం ప్రజల్లోకి తీసుకపోవాలి
- రాష్ట్ర బిజెపి నాయకులు బోసుపల్లి ప్రతాప్





**ఇబ్రహీంపట్నం వెలుతురు జూన్ 06:**
11 సంవత్సరాల మోడీ ప్రభుత్వం సంకల్పంతో సాకారం సహా వివిధ పార్టీ కార్యక్రమాలలో భాగంగా 06:06:2025 ఉదయం 10:00 గంటలకు శు క్రవారం రోజున వైష్ణవి గార్డెన్లో మండల అధ్యక్షుడు గోదాల శేఖర్ రెడ్డి గారి అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడారి జంగయ్య యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు సమావేశంలో కార్యకర్తలను ఉదేశించి స్థానిక సమస్యలపై చర్చించడం జరిగింది అలాగే అమలు కాని ఆరు గ్యరంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేశారని బిఆర్ఎస్ ప్రభుత్వ గత 10 ఏళ్లు మోసం చేసిన విషయం ప్రజల్లోకి తీసుకపోవాలని అలాగే 11 సంవత్సరాల లో మోడీ ప్రభుత్వం పేద ప్రజలకు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు అందిన పథకాలను గ్రామ గ్రామన ప్రజలకు వివరించాలని సూచించారు అలాగే రాష్ట్ర నాయకులు బోసు పల్లి ప్రతాప్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎలక్షన్లను ఎదుర్కోవడానికి కార్యకర్తలు అందరూ తయారుగా ఉండాలని కోరారు అదేవిధంగా పోరెడ్డి అర్జున్ రెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత్ ప్రపంచ దేశాలలో శక్తివంతమైన దేశంగా గుర్తించబడింది అని అన్నారు ఈ కార్యక్రమంలో దొండ రమణారెడ్డి, దండే శ్రీశైలం బాలశివుడు, శ్రీనివాస్ రెడ్డి,విట్టల్ రెడ్డి మరియు బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బనకచర్లతో తెలంగాణకు అన్యాయం

- ఆమోదయోగ్యం కాదంటూకేంద్రానికి లేఖలు
- తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



**హైదరాబాద్,జూన్ 6( వెలుతురు):**
బనకచర్లతో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అంతర్రాష్ట్ర జలవిధానాలకు, జీఆర్ఎంబీ, సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధంగా బనకచర్ల ప్రాజెక్టు ఉందని ఆక్షేపించారు. ఈ ప్రాజెక్టను తెలంగాణ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని మరోమారు స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టుపై అభ్యంతరం తెలుపుతూ కేంద్రమంత్రులు సీఆర్‌పాటిల్, నిర్మలా సీతారామన్‌కు లేఖలు రాశామని చెప్పారు.ఏపీ నుంచి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని.. వస్తే అన్ని నిబంధనలు పరిశీలిస్తామని పాటిల్ చెప్పారు. చట్టం ప్రకారం ముందుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఏపీ ఉల్లంఘనలను పూర్తిగా లేఖల్లో వివరించాం. చట్టవిరుద్ధంగా ఏపీకి కేంద్రం సహకరిస్తుందని అనుకోవట్లేదు. తెలంగాణకు అన్యాయం జరిగితే.. ఎంత వర–కై–నా పోరాడుతాం. తెలంగాణ నీటి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తాం.. వెనక్కి తగ్గేదేలే. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్రాన్ని ఒప్పించాలి. కృష్ణాలో అన్యాయం జరుగుతుంటే పదేళ్లు భారాస సహకరించింది. ఉమ్మడి ఏపీలో కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 724 టీ–ఎంసీలు ఏపీకి వెళితే భారాస హయాంలో 1,254 టీ–ఎంసీలు తరలించారు. కాళేశ్వరానికి వృథా ఖర్చు చేయకుంటే కృష్ణా ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యేవి. తుమ్మిడిహట్టి దగ్గర కాకుండా.. మేడిగడ్డ వద్ద కట్టడం వల్ల రూ.68వేల కోట్లు– కాళేశ్వరం ప్రాజెక్టుకు అదనపు ఖర్చు అయింది. ఏపీకి 512 టీ–ఎంసీలు, తెలంగాణకు 299 టీ–ఎంసీలు చాలని సంతకం చేసింది భారాస ప్రభుత్వం కాదా? కృష్ణా నీళ్లలో అప్పుడు మోసం చేసి ఇప్పుడు భారాస నేతలు నాటకాలు ఆడుతున్నారని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు.

# నాలాల ఆక్రమణపై స్పెషల్ డ్రైవ్: హైడ్రా

**హైదరాబాద్,జూన్6( వెలుతురు):**
హైదరాబాద్ నగరంలోని నాలాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఆక్రమణలను కూల్చివేత లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. నాలాలను ఆక్రమించిన వారిని వదలబోమన్నారు. వచ్చే 4 నెలల పాటు ఈ అంశంపైనే దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. వరదనీరు నిలిచే ప్రాంతాలపై ప్రత్యేక అధ్యయనం చేయనున్నట్లు– తెలిపారు. నాలా, నీటి వనరుల ఆక్రమణలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. నాలాలపై అక్రమంగా నిర్మించిన వాణిజ్య భవనాలను తొలగిస్తామని.. పేదల నిర్మాణాల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. రసూల్‌పురా నాలాపై అక్రమ నిర్మాణాలను కూల్చివేశామని రంగనాథ్ తెలిపారు.

# నిన్న కేబినెట్ లో ప్రజా సమస్యల పై చర్చించలేదు

కానీ వారి ఆశలన్నింటినీ కాంగ్రెస్ సర్కార్ ఎప్పటి మాదిరే వమ్ము చేసింది. తమకు కాంగ్రెస్ మేనిఫెస్టో అభయ హస్తంలో ఇచ్చిన హామీల అమలుకు కార్యాచరణను క్యాబినెటు రూపొందిస్తుందేమో అని ఆశపడిన వివిధ వర్గాలకు కాంగ్రెస్ సర్కారు హామీల అమలుపై కనీసం చర్చించకుండా వెన్నుపోటు పొడిచింది. దూరం నుంచి చూస్తే రోడ్డుపై నీళ్లు ఉన్నట్టుగా భ్రమింపచేస్తుంది ఎండమావి. కానీ తీరా దగ్గరికి వెళ్లి చూస్తే అక్కడ నీళ్లు ఉండవు. కాంగ్రెస్ సర్కారు కూడా ఎన్నికలపుడు 420 హామీలు ఇచ్చింది. ఎండమావి మాదిరిగా ఆశ పెట్టి ఇపుడు మోసం చేస్తోంది.

**ఇచ్చిన హామీల అమలుపై, ప్రజాసమస్యలపై చర్చించే సోయిలేని సోంబేరి క్యాబినెటు ఇది. కమిషన్లకు ఆరాటపడే క్యాబినెట్ ఇది.**

మంత్రులంతా రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించి సొంత లాభాలు చూసుకుంటున్నారని, కమిషన్లు వచ్చే అంశాలపైనే క్యాబినెటులో చర్చిస్తున్నారు తప్ప ప్రజాసమస్యల గురించి కాదనేది పబ్లికులో ఉన్న పాపులర్ టాక్. నిన్నటి ఆరు గంటల మారథాన్ క్యాబినెట్ భేటీలో ఉద్యోగుల బకాయిలు, డ్వాక్రా మహిళలకు బీమా అంశాలు తప్ప ఎన్నికల హామీలు, వివిధ వర్గాల సమస్యల గురించి చర్చించకపోవడంతో ఇది కమిషన్ల క్యాబినెటు అన్న టాక్ కరెక్టే అనిపిస్తోంది. ఆరు గంటల పాటు మంత్రులు తమ కమిషన్ల గురించి మాట్లాడుకున్నట్టుగానే ఉంది. నిరుద్యోగులకు మాటిచ్చిన రెండు లక్షల ఉద్యోగ ఖాళీల భర్తీ, నిరుద్యోగ భృతి, మహిళలకు హామీ ఇచ్చిన నెలకు రూ.రెండున్నర వేల మహాలక్ష్మీ స్కీము, ఆడబిడ్డల వివాహానికి తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, అన్నదాతలకు రుణమాఫీ, రైతు భరోసా, రైతుకూలీలకు ఆత్మీయ భరోసా, పంటలు క్వింటాలుకు రూ.500 బోనస్, అంబేద్కర్ అభయ హస్తం, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత స్కీము కింద పెన్షన్ల పెంపు, విద్యార్థులకు రూ.ఐదు లక్షల విద్యాభరోసా కార్డు, ఫీజు రీఎంబర్స్ మెంటు బకాయిలు, ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేలు, ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం వంటి హామీలపై క్యాబినెటు చర్చించక పోవడమంటే ఆ యా వర్గాలను నిలువునా మోసం చేయడమే.

**ఆరు గంటలు చర్చించి ఏ ఒక్క వర్గం సమస్యలను పరిష్కరించని దద్దమ్మ క్యాబినెట్ ఉద్యోగులకిచ్చిన హామీలను కూడా నెరవేర్చని ఏగవేతల సర్కార్**

క్యాబినెట్ మీటింగులో తీసుకున్న నిర్ణయాలను మంత్రులు మీడియాకు వివరిస్తూ ఉద్యోగులకు రెండు డిఏలు ... ఇపుడొకటి, ఆరు నెలల తర్వాత మరోకటి ఇస్తామని చెప్పారు. బకాయిలను నెలకు రూ.700 కోట్ల చొప్పున ఇస్తామంటూ ఉద్యోగులు డిమాండ్ చేసిన అంశాల్లో సగం కూడా ఇవ్వకుండా వారి ఆశలపై నీళ్లు చల్లి అన్యాయం చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అభయ హస్తం మేనిఫెస్టోలోని 26వ పేజీలో తాము అధికారంలోకి రాగానే పెండింగులో ఉన్న డిఏలను తక్షణమే చెల్లిస్తామని, పీఆర్సీని ప్రకటించి ఆరు నెలల్లోపు సిఫారసులను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ వాటిని అమలు చేయడంలో మాత్రం దారుణంగా విఫలమయ్యారు. క్యాబినెట్ సబ్ కమిటీ మంత్రులతో మీటింగులో కూడా పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలలో వెంటనే మూడు డీఏలు విడుదల చేయాలని, మిగతా రెండింటిని పీఆర్సీలో కలిపి ఇవ్వాలని ఉద్యోగ జేఏసీ నేతలు చేసిన డిమాండ్లను కూడా క్యాబినెట్ పట్టించుకోకుండా మోసం చేసింది.

**రైతుభరోసా స్కీము – ఖరీఫ్ సీజను ఎగ్గొట్టి ఒక్క రబీకి మాత్రమే ఇచ్చే కుట్రలకు పాల్పడుతున్న సర్కార్**

రైతు భరోసా డబ్బులను రైతుల ఖాతాల్లో విడతల వారీగా కాకుండా ఒకేసారి విడుదల చేయాలనే అంశంపై క్యాబినెట్ మీటింగులో చర్చ జరిగిందని సమాచారం. రైతు భరోసా పూర్తిగా ఇవ్వకుంటే లోకల్ బాడీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడం కష్టమన్న అభిప్రాయాలను కూడా కొందరు మంత్రులు వ్యక్తం చేసినట్టు సమాచారం. ఈ రైతు భరోసా స్కీము కింద ఎకరానికి రూ.15 వేలు ఇవ్వలేమని, రూ.12వేలే ఇస్తామని ప్రభుత్వం గత జనవరిలో రిపబ్లిక్ డే రోజున ప్రకటించింది. రైతు భరోసా స్కీము కింద యాసంగిలో మొత్తం 152 లక్షల ఎకరాలకు ఎకరాకు రూ.6 వేల చొప్పున రూ.9,120 కోట్లు రైతులకు పంపిణీ చేయాల్సి ఉన్నది. కానీ ఇప్పటి వరకు నాలుగు ఎకరాల లోపు మాత్రమే సుమారు 85 లక్షల ఎకరాలకు రూ.5,100 కోట్లు మాత్రమే జమ చేసినట్టు తెలిసింది. ఇంకా రైతులకు రూ.4,020కోట్లు పంపిణీ చేయాల్సి ఉన్నది. వీటిని ఆలస్యం చేయకుండా ఈ వారంలోగా చెల్లించాలి. కాంగ్రెస్ సర్కార్ తీరు చూస్తుంటే గత ఏడాది ఖరీఫ్ సీజను రైతు భరోసా ఎగ్గొట్టినట్టుగానే ఈ ఖరీఫ్ సీజనుకు కూడా డబ్బులు ఇస్తారా, ఎగ్గొడుతారా అనేది రైతుల అనుమానం. అందుకే ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వాలి. ఇపుడు ఖరీఫ్ సీజను వచ్చింది కాబట్టి ఈ దఫా ఇవ్వాల్సిన నిధులు రూ.9,120 కోట్ల నిధులను ఈ నెలాఖరులోగా విడుదల చేయాలి. గత ఏడాది 2024 ఖరీఫ్ సీజను రైతు భరోసా నిధులను ప్రభుత్వం ఎగ్గొట్టింది. అందుకు సంబంధించిన పెండింగు డబ్బులు రూ.9,120 కోట్లను కూడా ఉద్యోగుల బకాయిలను నెలకు రూ.700 కోట్లు ఇస్తామని ప్రకటించిన విధంగానే ఈ ఖరీఫ్ సీజను పూర్తయ్యేలోగా ఆరు నెలల్లో నెలకు రూ.1,520 కోట్ల చొప్పున చెల్లించాలి. పంటసాగు పెట్టుబడి సాయం కోసం రైతులు ప్రవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల పాలు కాకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. అలాగే రుణమాఫీ పెండింగు డబ్బులను కూడా ప్రభుత్వం నెలకు కొంతమొత్తం విడుదల చేస్తూ రెండు వాయిదాల్లో చెల్లించాలి. ప్రభుత్వం నాలుగు విడతల్లో 25.35 లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్లు మాత్రమే రుణమాఫీ చేసింది. ఈ లెక్కన ఇంకా16.65లక్షల మంది రైతులకు మాఫీ చేయాల్సిన రూ.10,384 కోట్లు మొత్తాన్ని కూడా రెండు విడతల్లో రెండు నెలల్లోగా చెల్లించాలి.

**రైతు కూలీల ఆత్మీయభరోసా స్కీము 15లక్షల మందికి ఇస్తామని లక్షమందికి కూడా ఇవ్వరా**

రైతు కూలీలకు ఆర్థిక సాయం కోసం రూ.900 కోట్లు కేటాయిస్తున్నాం. మొత్తం 15 లక్షల మందికి సాయం అందిస్తామని గత ఏడాది డిసెంబరులోనే మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి ప్రకటించారు. ఏటా రూ.12వేలు రెండు దఫాలుగా ఆరు నెలలకోసారి రూ.ఆరు వేల చొప్పున రైతు కూలీల ఖాతాల్లో జమచేస్తామని రిపబ్లిక్ డే సందర్భంగా చెప్పారు. మరి నాలుగు నెలలైనా ఆత్మీయ భరోసా స్కీము అమలు కావడం లేదు. బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం రూ.600 కోట్లు. కాగా ఇప్పటి వరకు 83,887 మందికి రూ.50.33 కోట్లు మాత్రమే చెల్లించారు. మంత్రులు మాటిచ్చిన విధంగా 15 లక్షల మంది రైతు కూలీలకు ఆరు నెలలకు రూ.వేల చొప్పున రూ.900 కోట్లు ఇవ్వాలి. ఈ జూన్ నెలాఖరుకు మొదటి ఆరు నెలలు పూర్తవుతాయి కాబట్టి వచ్చే జూలైలో రెండో దఫా కూడా చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన మొత్తం రూ.1800 కోట్లు ఆత్మీయ భరోసా పథకానికి నెల రోజుల్లో అంటే జూలై మొదటి వారంలో విడుదల చేయాలి.

**పేద మహిళలకు మహాలక్ష్మీ స్కీము, నిరుద్యోగ భృతి, చేయూత పెన్షన్ల పెంపుపై క్యాబినెట్ నిర్ణయాలేవీ**

కాంగ్రెస్ అభయ హస్తం ఆరు గ్యారంటీల్లో పేద మహిళలకు మహాలక్ష్మీ స్కీము కింద నెలకు రూ.2500 ఇవ్వడమనేది మొదటి హామీ. అలాగే వృద్ధులకు ఇచ్చే పెన్షను మొత్తాన్ని రూ.రెండు వేల నుంచి రూ.నాలుగు వేలకు పెంచడమనేది చివరి హామీ. అలాగే కాంగ్రెస్ యూత్ డిక్లరేషనులో ఇచ్చిన హామీ నిరుద్యోగులకు నెలకు.రూ.నాలుగు వేలు నిరుద్యోగ భృతి ఇవ్వడం. మరి కాంగ్రెసును గెలిపించిన ఈ మూడు హామీలను అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరయినా ఇంకా అమలు చేయకపోవడం మోసం, దగా కాదా. వీటిపై క్యాబినెటులో చర్చించి నిర్ణయం తీసుకోలేదంటే ఈ హామీలను ఎగ్గొట్టాలనుకుంటున్నారా అనేది మంత్రులు చెప్పాలి. ఈ హామీలను ఎగ్గొట్టాలని చూస్తే సహించేది లేదు. ఆ వర్గాలతో కలిసి బిజెపి పోరాడుతుంది. కాంగ్రెస్ సర్కారు మెడలు వంచి ఈ హామీలను అమలు చేయిస్తుంది. ఒకవేళ అమలు సాధ్యం కాదంటే కాంగ్రెసుకు అధికారంలో కొనసాగే అర్హత లేదు. రాజీనామా చేసి ప్రజాతీర్పును కోరాలి. అధికారంలో కొనసాగాలనుకుంటే కాంగ్రెస్ సర్కారు బకాయిలతో సహా ఈ హామీలను అమలు చేయాలి.

1.నిరుద్యోగ భృతి స్కీము ... తెలంగాణలో సుమారు 35 లక్షల మంది నిరుద్యోగులు ఉంటారని అంచనా. వారికి నెలకు నాలుగు వేల చొప్పున నెలకు రూ.14 వందల కోట్లు అవసరం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరైంది. అంటే రూ.1400 కోట్లు X 18 నెలలు = రూ.25,200 కోట్లు కాంగ్రెస్ సర్కార్ నిరుద్యోగులకు బాకీ పడింది. ఈ స్కీమును జూలై నుంచి అమలు చేస్తూ ఈ రూ.25,200 కోట్లు బకాయిలను నెలకు రూ.1400కోట్ల చొప్పున 18 నెలల్లో చెల్లించాలి.

2. వృద్ధాప్య పెన్షన్లు ... చేయూత పథకం కింద ప్రస్తుతం ప్రభుత్వం నెలకు రూ.రెండు వేల చొప్పున 44 లక్షల మందికి పైగా పెన్షనుదారులకు నెలకు రూ.900 కోట్లు ఇస్తోంది. అయితే ఇచ్చిన హామీ ప్రకారం వీటిని రెట్టింపు చేయాలి. అంటే మరో రూ.900 కోట్లు అదనంగా వచ్చే జూలై నుంచి చెల్లించాలి. పెంచిన పెన్షను మొత్తాన్ని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చెల్లించాలి. కాబట్టి ఈ 18 నెలల బకాయిలు రూ.900%శ% 18 నెలలు = రూ 16,200కోట్లను నెలకు రూ.900 చొప్పున వచ్చే 18 నెలల్లో చెల్లించాలి.

3. మహాలక్ష్మీ స్కీము ... తెలంగాణలో పేద మహిళలు 48 లక్షల మంది ఉంటారని అంచనా. వీరికి నెలకు రూ.రెండున్నర వేలు ఆర్థిక సహాయం చేయడానికి మహాలక్ష్మీ పథకం కింద నెలకు రూ.1200 కోట్లు అవసరం. ఈ స్కీమును జూలై నుంచి అమలు చేయాలి. గత 18 నెలల బకాయిలు రూ.1200 %శ% 18 నెలలు = రూ.21,600 కోట్లు. వీటిని ప్రతి నెలా రూ.1200 చొప్పున వచ్చే 18 నెలల్లో చెల్లించాలి.

నిరుద్యోగ భృతి (రూ.25,200 కోట్లు), మహాలక్ష్మీ (రూ.21,600 కోట్లు), చేయూత (రూ.16,200కోట్లు) పథకాల కింద కాంగ్రెస్ సర్కారు నిరుద్యోగులకు, మహిళలకు, వృద్ధులకు మొత్తం రూ.63 వేల కోట్లు బకాయి పడింది.

సన్న రకం వడ్లకు కూడా రూ.500 బోనస్ ఎత్తేస్తే కాంగ్రెస్ సర్కారుపై రైతులు తిరగబడడం ఖాయం

సన్నరకం వడ్లు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చే స్కీముపై కూడా క్యాబినెటులో చర్చ జరిగింది. యాసింగిలో సన్నరకం వడ్లకు బోనస్ ఇవ్వడం వల్ల నష్టం వస్తుందని మంత్రులెవరో మాట్లాడారట. అంటే ఈ స్కీమును ఎత్తివేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టుగా ఉంది. దీనిపై క్యాబినెట్ మీటింగ్ అనంతరం మంత్రులు స్పష్టత ఇవ్వకపోవడంతో రైతుల్లో అనుమానాలు తలెత్తుతున్నాయి. తక్షణమే ప్రభుత్వం సన్నాలకు బోనస్ కొనసాగింపుపై స్పష్టత ఇవ్వాలి. యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగుస్తున్నప్పటికీ ఇంకా రైతుల ఖాతాల్లో సన్న రకం వడ్లకు బోనస్ జమకాకపోవడంతో కూడా ఈ బోనస్ స్కీము కొనసాగుతుందా లేదా అనే అనుమానాలు రైతుల్లో మొదలయ్యాయి. సన్నరకాలకే కాదు దొడ్డు రకం వడ్లతో పాటు పది రకాల పంటలకు బోనస్ ఇస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ... తీరా రైతుల ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చాక ఆ హామీలను ఎగవేయడం మహా మోసం.

**ఓటమి భయంతోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ సర్కార్**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడంతో గ్రామ పాలనా వ్యవస్థ గాడితప్పింది.

సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు పరిష్కారం కాక పేరుకుపోతున్నాయి. గ్రామపంచాయతీల్లో 16 నెలలుగా, మండలాలు, జిల్లా పరిషత్తుల్లో 11 నెలలుగా, మున్సిపాలిటీల్లో నాలుగు నెలలుగా పాలక వర్గాలు లేకపోవడంతో స్థానిక సమస్యలు పరిష్కారంకాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందినందున, తక్షణమే పెంచిన రిజర్వేషన్లను అమలు చేస్తూ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేలా క్యాబినెటులో చర్చించి నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేసాం. క్యాబినెటులో ఈ అంశం చర్చకు వచ్చినప్పటికీ రైతు భరోసా, పెన్షన్ల పెంపు వంటి హామీలను అమలు చేయకుండా స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపితే కాంగ్రెసుకు ఘోర పరాభవం తప్పదని కొందరు మంత్రులే హెచ్చరించారట. అందుకే ఎన్నికలపై నిర్ణయం తీసుకోకుండా దాటవేశారు. ఓటమి భయంతో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకుండా ఇంకా ఎన్ని నెలల కాలయాపన చేస్తారు. ఎప్పుడు ఎన్నికలు పెట్టినా కాంగ్రెసుకు ఓటమి తప్పదు. ఆ ఓటమి నేపథ్యంలో ముఖ్యమంత్రి మార్పు తప్పదు.

**అప్పులు బారెడు అభివృద్ధి గుండుసున్నా ఏడాదిన్నరలో సాధించింది బకాయిలే.**

ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్ రూ.లక్షా 75 వేల కోట్ల మేర అప్పులు చేసింది. రోజుకు రూ.320 కోట్ల మేర ... గంటకు రూ.13కోట్లకు పైగా అప్పులు చేసిన కాంగ్రెస్ సర్కార్ చేసిన అభివృద్ధి మాత్రం శూన్యం. రైతు భరోసా, ఆత్మీయ భరోసా వంటి సంక్షేమ పథకాల్లో కోత పెడుతోంది. దశాబ్దాలుగా అమలవుతున్న ఫీజు రీఎంబర్స్ మెంట్ వంటి స్కీములకు నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో బకాయిలు పెరిగిపోతున్నాయి. చివరకు ఈ ఫీజు రీఎంబర్స్ మెంట్ స్కీమును ప్రభుత్వం ఎత్తివేస్తోందనేదే అంతటా వినిపిస్తోంది.ఈ బకాయిలు ఇపుడు రూ.ఏడున్నర వేల కోట్లను దాటాయి. ప్రభుత్వ ఉద్యోగులకు రూ.13 వేల కోట్ల బకాయిలు. మాజీ సర్పంచులు, చిన్న కాంట్రాక్టర్లకు రూ.వెయ్యి కోట్ల చొప్పున బకాయిలు పడింది కాంగ్రెస్ సర్కారు. ఓ వైపు పథకాలు ఎత్తివేస్తూనే మరోవైపు భారీగా అప్పులు చేస్తోంది. ఇంకోవైపు వివిధ వర్గాలకు ఇవ్వాల్సిన బకాయిలు భారీగా పేరుకుపోతున్నాయి. ఈ పరిస్థితిని బట్టి స్పష్టంగా అర్థమవుతోంది ఏమిటంటే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడితప్పిందని. ఏడాదిన్నరలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూడా పేనం నుంచి జారీ పొయ్యిలో పడినట్టయింది.

**ఇచ్చిన హామీలను అమలు చేసేలా కాంగ్రెస్ సర్కారుపై ఉద్యమ స్థాయి పోరాటం తప్పదేమో**

కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో అన్ని వర్గాలు మోసానికి, దగాకు గురయ్యాయి. 420 హామీలకు గాను ఏడెనిమిది హామీలు మినహా మిగిలిన వాటిని ఎగ్గొట్టిన కాంగ్రెస్ సర్కారు ... అమలు చేస్తున్న హామీలను కూడా పూర్తి స్థాయిలో కాకుండా అరకొరగా అమలు చేస్తుండడంతో కాంగ్రెస్ అభయ హస్తం కాస్తా ఇపుడు భస్మాసుర హస్తమైంది. బూటకపు హస్తమైంది. ఈ పరిస్థితిని చూసి ఇక లాభం లేదనుకుని తమకు హక్కుగా రావాల్సిన బకాయిలు కోసం ప్రభుత్వంతో సమరం తప్పదని ఉద్యోగులు కార్యాచరణ ప్రకటించడంతో కాంగ్రెస్ సర్కార్ కొద్దిగా దిగొచ్చి అరకొర అంశాల అమలుకు సిద్ధపడింది. ఉద్యోగుల మాదిరే ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, రైతులు, రైతు కూలీలు, మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులు, పేరంట్స్, ఆటో డ్రైవర్లు, ఆర్టీసీ సిబ్బంది ... ఇలా వివిధ వర్గాలు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు కోసం రోడ్డెక్కి పోరాటం చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

**ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో తెలంగాణ పరిస్థితి పేనం నుంచి జారి పొయ్యిలో పడినట్టయింది**

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో అభయ హస్తము పేరుతో ఆరు గ్యారంటీల కార్డును ప్రధాన హామీగా ఇచ్చింది. కాంగ్రెస్ ముఖ్య నేతలు అంతా ఈ ఆరు గ్యారంటీలను బాండ్ పేపర్ల రూపంలో ప్రజలకు ఇచ్చి ఎన్నికల్లో విస్తృత ప్రచారం కల్పించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2023 డిసెంబర్ 07న రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశాక తొలి సంతకం అభయ హస్తం ఫైలు పైనే చేశారు. క్యాబినెట్ తొలి భేటీలో కూడా అభయహస్తం ఆరు గ్యారంటీల కార్డుకు చట్టబద్ధత కల్పించాలని నిర్ణయించారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో కూడా 2023 డిసెంబరు 17న అభయహస్తం గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని మాటిచ్చారు. ఏడాదిన్నరయినా అసెంబ్లీకి ఇచ్చిన మాట, క్యాబినెట్ నిర్ణయం అమలు కాలేదంటే ఈ కాంగ్రెస్ సర్కార్ ఎంత మోసపూరిత మైనదో రుజువైంది. కాంగ్రెస్ నేతలు తెస్తామన్న మార్పు ఈ ఏడాదిన్నరలో ఏ రంగంలోనూ కానరాలేదు. బీఆర్ఎస్ హాయాంలో అవినీతి అంతా కేసిఆర్ కుటుంబీకులకు పరిమితమయ్యేది. కేసిఆర్ చుట్టూ అవినీతి కేంద్రీకృతం అయితే కాంగ్రెస్ హాయాంలో అవినీతి గల్లీ నుంచి ఢిల్లీ దాకా అవినీతి వికేంద్రీకరణ జరిగి విస్తరించింది. ప్రజల పరిస్థితి పేనం నుంచి జారి పోయిలో పడినట్టయింది.

**కేసిఆర్ అరెస్టు కాకుండా కాపాడుతున్నది సిఎం రేవంత్ రెడ్డినే. కేసిఆర్ తో ఆయన చేస్తున్నదంతా డూప్ ఫైటింగే.**

గత బీఆర్ఎస్ సర్కారు పాలనలో జరిగిన వివిధ కుంభకోణాలు, అవినీతి ఆరోపణలపై పూర్తి స్థాయిలో హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తిచే విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ అభయ హస్తం మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. కేసిఆర్ ప్రభుత్వ హాయంలో జరిగిన అక్రమాలకు ఆయన కుటుంబాన్ని వేయి సంవత్సరాలు జైల్లో పెట్టాల్సి ఉంటుందని సీఎంగా రేవంత్ రెడ్డి మాట్లాడారు. మరి ఏమైంది కేసిఆర్, కేటిఆర్, హరీష్ రావులపై ఒక్క కేసు కూడా నమోదు చేయలేదు. వారిలో ఒక్కరిని కూడా ఒక్క రోజు కూడా జైల్లో పెట్టలేదు ఎందుకని, ఎవరు అడ్డుపడుతున్నారు. ఏంటీ మ్యాచ్ ఫిక్సింగ్. రాహుల్ గాంధీ ఏమైనా అడ్డుపడుతున్నారా ... విద్యుత్ ఒప్పందాలపై జస్టిస్ మదన్ లోకూర్ కమిషన్ రిపోర్టును క్యాబినెటు ఆమోదించింది. మరి ఆ రిపోర్టును ఎందుకు బయటపెట్టడం లేదు. కాళేశ్వరంపై విజిలెన్స్ కమిషన్ రిపోర్టులో ఆరోపణలు ఎదుర్కొంటున్న 17 మందిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, మరో 33 మందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, ఏడుగురికి జరిమానాలు విధించాలని సూచించింది. మరి దీనిపై క్యాబినెటులో ఏమి చర్చించారో ఎందుకని వెల్లడించలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై ప్రతిపక్షంలో ఉండగా సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్ ... ఇపుడు అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరయినా ఇంకా ఎందుకుని సిబిఐ విచారణ కోరడం లేదు. బీఆర్ఎస్ హయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సిబిఐ విచారణ కోరకుండా కాంగ్రెస్ సర్కారు గులాబీ పార్టీతో మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు చేస్తోంది. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిని, అక్రమాలను వెలికితీసే చిత్తశుద్ధి కాంగ్రెస్ సర్కారుకు ఉంటే తక్షణమే కాళేశ్వరం, మిషన్ భగీరథ, ధరణి పోర్టల్, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, ఈ–కార్ రేసింగ్, ఫోన్ ట్యాపింగ్ వంటి అంశాలపై సిబిఐ విచారణ కోరాలి. కేసిఆర్ అరెస్టు కాకుండా కాపాడుతున్నది సిఎం రేవంత్ రెడ్డినే. కేసిఆర్ తో ఆయన చేస్తున్నదంతా డూప్ ఫైటింగే. లేదంటే కేసిఆర్ ఎప్పుడో అరెస్టయ్యేవారు.

**కేసిఆర్ సర్కారు చేసిన అక్రమాలు, అవినీతితో రేవంత్ ప్రభుత్వం పోటీ పడుతోంది.**

కేసిఆర్ సర్కార్ పదేళ్ల పాలనకు ఏమాత్రం తీసిపోని విధంగా రేవంత్ ప్రభుత్వం కూడా మూడు అక్రమాలు ఆరు అవినీతి అన్నట్టుగా పాలన సాగిస్తోంది. కేసిఆర్ సర్కారు పదేళ్లలో చేసిన అవినీతిలో 30 శాతం రేవంత్ ప్రభుత్వం ఈ ఏడాదిన్నర పాలనలో చేసింది. R టాక్స్, RRటాక్స్, RRRటాక్స్, Bటాక్స్ Pటాక్స్, Uటాక్స్ పేర్లతో కాంగ్రెస్ సర్కార్ బాగా పాపులర్ అయింది. బడా కాంట్రాక్టర్లకు, క్యాబినెటులో ఉన్న వారికి మాత్రమే బిల్లులు చెల్లిస్తున్నారు. 30 శాతం టాక్సులతో బిల్లుల చెల్లింపు జరుగుతోందట. ఇక రెవెన్యూ శాఖలో అయితే 50 శాతం భూములు సమర్పించుకోవాల్సిందే. పదేళ్లలో కేసిఆర్ సర్కార్ చేసిన అవినీతిని మించి రేవంత్ సర్కార్ ఈ ఐదేళ్లలో చేయబోతోందని అర్థమవుతోంది. గత కేసిఆర్ సర్కార్ చేసిన అవినీతిపై చర్యలు లేవు. గత ఏడాదిన్నర కాలంలో కాంగ్రెసు పాలనలో జరిగిన అక్రమాలపై విచారణలు కూడా లేవు. గత ఏడాదిన్నరలో జరిగిన అక్రమాలు కొన్నింటిని మేం బయటపెడితే, వాటిని కాంగ్రెస్ సర్కార్ విచారణ కాదు కదా, సిఎం రేవంత్ రెడ్డి కనీసం స్పందించలేదు. అంటే ఆ సర్కారుపై అవినీతి ఆరోపణలు వస్తే దున్నపోతుపై వాన పడినట్టుగా ఉంది. అసలు చలనం లేని సర్కారు ఇది. ఈ ప్రభుత్వ పాలనలో నిజాయితీ మచ్చుకైనా లేదు. అయినా సరే ప్రతిపక్ష పార్టీగా మా బాధ్యత మేం నిర్వహిస్తాం. కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను బయటపెడుతూనే ఉంటాం. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ సర్కార్ అవినీతి బండరాన్ని ఎండగడుతూనే ఉంటాం..

# బనకచర్లపై బిఆర్ఎస్ తరపున సుప్రీంలో కేసు వేస్తాం

- అబద్దాలతో కాలం గడుపుతున్న సిఎం, మంత్రులు
- ఎపి గోదావరి, కృష్ణాలు దోచుకుంటున్నా కళ్లు తెరవరా
- కేంద్రంతో పోరాటం చేయకుండా బిజెపి సైలెంట్ అయ్యింది
- ఉద్యోగులకు డిఎపై కేబినేట్‌లో ఇంతగా చర్చలా
- ప్రభుత్వం తీరుపై మండిపడ్డ హరీష్ రావు

**సిద్దిపేట,జూన్ 6( వెలుతురు):**

అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్ రెడ్డి అనుకున్నం, కానీ ఆయన్ని మించి తాత అయ్యిండు ఉత్తమ్ కుమార్ రెడ్డి అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఉత్తమ్ అబద్దాలు చూస్తే గోబెల్స్ అనేవాడు ఉంటే ఉరి పెట్టుకునేవాడు అని హరీశ్‌రావు అన్నారు. దుబ్బాకలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు– బీజేపీ ఎంపీలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వ కేబినెట్ సమావేశం నిరాశపరిచిందని మాజీ మంత్రి హరీష్ రావువ్యాఖ్యలు చేశారు. ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. గాలి మోటార్‌పై తిరుగుతూ గాలి మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒక్క డీఏ ఇచ్చేందుకు ముచ్చటగా మూడు కమిటీలు వేశారని... దీనికి కేబినెట్‌లో అయిదు గంటల చర్చ చేశారని వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం నిట్ట నిలువునా ముంచుతోందన్నారు. తక్షణమే మూడు డీఏలు చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. ఉద్యోగస్తులపై సర్కార్ కేసులు పెడుతోందన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చి గ్రామాల్లో పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అబద్ధాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మించిపోయారని వ్యాఖ్యలు చేశారు. ఉత్తమ్ కుమార్ ఏది మాట్లాడినా అబద్దమే అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో క్రాప్ హాలిడే ప్రకటించిందన్నారు. 65 టీఎంసీల నీటిని ఉపయోగించకుండా చేసింది ఉత్తమ్ అంటూ ఆరోపించారు. నీతి ఆయోగ్ మీటింగ్‌లో ప్రధానిని రేవంత్ రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. గోదావరి బనకచర్ల కోసం బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టు వెళ్తుందన్నారు. గోదావరి బనకచర్ల మీద బీజేపీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. శ్రీశైలం రైడింగ్ ప్రాజెక్టు పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టును ఉత్తమ్ కుమార్ రెడ్డి అడ్డుకోవాలన్నారు. కాళేశ్వరం కుప్ప కూలిందని చెప్పే రేవంత్ రెడ్డి గంధమళ్ళకు నీళ్లు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించారు. కాళేశ్వరం కూలిందని కాంగ్రెస్ ప్రభుత్వం గ్లోబల్ ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను స్టే తెచ్చి ఆపిందే బిఆర్ఎస్, కేసీఆర్ అని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి విజయవాడకు పోయి చంద్రబాబును కలిసి బజ్జీలు తిని వచ్చిండు. అప్పటి నుంచి ఏం మాట్లాడటం లేదు. కృష్ణా నది జలాల్లో రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు వాడనంత తక్కువ నీళ్లు వాడింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఆంధ్రాకు దాసోహం చేసి, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్ నగర్‌లో పంటలను ఎండబెట్టింది కాంగ్రెస్. తాత్కాలిక కేటాయింపుల ప్రకారం, 65 టీ–ఎంసీలు తక్కువ వాడిన చేతగాని దద్దమ్మ ప్రభుత్వం. ఆరున్నర లక్ష ఎకరాలకు నీళ్లు ఇవ్వకపోవడమే, పంట ఎండబెట్టడమే. దీనికి సమాధానం చెప్పు, చెంపేలేసుకొని ముక్కు భూమికి రాయి ఉత్తమ్ కుమార్ రెడ్డి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కృష్ణా నదిలో న్యాయమైన వాటా కిందకి వదిలింది మీరు, గోదావరి బనకచర్ల కడుతుంటే చేతులు కట్టు–కొని చూస్తున్నది మీరు, శ్రీశైలం రైట్ కెనాల్ లైనింగ్ జరుగుతుంటే ఆపకుండా చూస్తున్నది మీరు, బిఆర్ఎస్ లైనింగ్ పనులు ఆపిస్తే ఇప్పుడు మీరు వచ్చాక మొదలు పెట్టారు. తక్షణం ఆ పనులను నిలిపి వేయించాలని డిమాండ్ చేసారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే బిజేపీ పెదవి విప్పడం లేదు. గోదావరి బనకచర్ల మీద బిజేపీ నాయకులు, కేంద్ర మంత్రులు ఎందుకు



మాట్లాడటం లేదు. రాష్ట్ర ప్రయోజనాలు బిజెపికి పట్టవా? బనకచర్ల ద్వారా తెలంగాణ గోదావరిలో వాటా కోల్పోయే పరిస్థితి? శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ లైనింగ్ పూర్తి అయితే రోజుకు 90వేల క్యూసెక్కుల చొప్పున తరలిస్తారు. బిజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కండ్లు తెరవండి. ఏపీ నీటి దోపిడిని అడ్డుకోవాల్సిన కేఆర్ఎంబీ చంద్రబాబు అడుగులకు మడుగులు ఒత్తుతున్నది. శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ లైనింగ్ అక్రమ పనులు ఆపడం లేదు? గోదావరి బనకచర్ల అక్రమ ప్రాజెక్టును ఆపడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. గంధమల్ల ప్రాజెక్టు అంటే కాళేశ్వరంలో అంతర్భాగం. కాళేశ్వరం కూలితే గంధమల్లకు నీళ్లు ఎలా వస్తాయి రేవంత్ రెడ్డి. గంధమల్లకు ఎట్ల కొబ్బరి కాయ కొడుతున్నవు. గంధమల్ల, మల్లన్నసాగర్, రంగనాయర్ సాగర్, మిడ్ మానేర్, ఎల్లంపల్లి.. ఇదంతా కాళేశ్వరం కాదా రేవంత్ రెడ్డి. కుప్పకూలింది అని ప్రచారం చేసావు. కాళేశ్వరం కూలితే గంధమల్లకు గోదావరి జిలాలు ఎట్ల వస్తాయి. నువ్వు ఇన్ని రోజులు చేసిన ప్రచారం శుద్ద తప్పు అని తేటతెల్లమైంది. నువ్వు చేసింది అదంతా గోబెల్స్ ప్రచారం అరని తేలిందన్నారు. మూసీలో గోదావరి నీళ్లు పోస్తా అంటవు, ఎట్ల సాద్యమైతది రేవంత్ రెడ్డి? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

కేబినెట్‌లో బనకచర్ల గురించి మాట్లాడేందుకు సమయం లేదా? ఇంతకంటే ముఖ్యమైన అంశం ఇంకోటి ఉంటదా? ఐదు గంటలు కమిషన్లు, పర్సెంటీజీలు, హైకమాండ్‌కు పంపే మూటల గురించి మాట్లాడారా? 400 టీఎంసీల గోదావరి జలాలను అక్రమంగా ఏపీ తరలిస్తుంటే గుడ్లు అప్పగించుకొని చూస్తారా? సుప్రీం కోర్టుకు వెళ్లరా, కేంద్ర మంత్రిని కలవరా, నీతి అయోగ్‌లో సీఎం ఎందుకు మాట్లాడలేదు. ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. అపెక్స్ కమిటి అనుమతి లేకుండా, అంతర్ రాష్ట్ర అనుమతి లేకుండా, గోదావరి ట్రిబ్యునల్ అనుమతి లేకుండా ప్రాజెక్టు కడుతుంటే ఎందుకు మౌనం. చంద్రబాబును ఎదురించే దమ్ము సత్తా లేదా, ఎందుకు లాగులు తడుస్తున్నాయి. ఎందుకు సుప్రీం కోర్టుకు వెళ్లరు, ఎందుకు ప్రధానిని ప్రశ్నించరు. బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. పూర్తిగా ఏపీకి దాసోహం అయిపోయారు. రాష్ట్రం స్పందించకుంటే సుప్రీం కోర్టుకు బిఆర్ఎస్ వెళ్తుందని చెప్పినం. ఇప్పటికీ ఆ మాటకు కట్టు–బడి ఉన్నామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. లేఖలు రాసి చేతులు దులుపుకుంటన్నారు. అఖిల పక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకువెళ్లాలి, జంతర్ మంతర్ వద్ద ధర్నా చేద్దాం పదండి.

# మేకిన్ ఇండియాలో మరో అడుగు




**హైదరాబాద్, జూన్ 6, ( వెలుతురు)**

హైదరాబాద్‌కు ప్రతిష్టాత్మకమైన పెట్టుబడి వస్తోంది. 'మేక్ ఇన్ ఇండియా' కింద భారతదేశ రక్షణ తయారీ రంగంలో ఓ కీలక ప్రాజెక్టు హైదరాబాద్ లో ఏర్పాటు కావడానికి రంగం సిద్ధమయింది. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (TASL), ఫ్రెంచ్ ఏరోస్పేస్ దిగ్గజం డస్సాల్ట్ ఏవియేషన్‌తో నాలుగు కీలకమైన ఉత్పత్తి బదిలీ ఒప్పందాలపై సంతకం చేసింది. ఈ ఒప్పందాలు రాఫెల్ యుద్ధ విమానాల ఫ్యూజ్‌లేజ్ భాగాలను స్థానికంగా తయారు చేయడానికి అవకాశం కల్పిస్తాయి. ఈ విడి భాగాలు ఇప్పటివరకు ఫ్రాన్స్‌లో మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు. భారతదేశంలో ఒక ఖచ్చితమైన తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి గణనీయమైన పెట్టుబడిని పెడతామని దసాల్ట్ ఏవియేషన్ ప్రకటించింది. ఇది ప్రపంచ ఏరోస్పేస్ సప్లై చైన్‌లో కీలకంగా మారుతుంది. ఈ ఒప్పందంలో భాగంగా టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ హైదరాబాద్‌లో అత్యాధునిక ఫ్యాక్టరీని నిర్మిస్తుంది. ఈ ప్లాంట్ రాఫెల్ యుద్ధ విమానానికి అవసరం అయిన ఫ్యూజ్‌లేజ్ షెల్‌లతో సహా రాఫెల్ జెట్ ప్రధాన ఫ్యూజ్‌లేజ్ విభాగాలను ఉత్పత్తి చేస్తుంది. ఈ భాగాలు యుద్ధ విమానంలో ప్రధానభాగంగా ఉంటాయి. తేలికైన మన్నికను నిర్ధారిస్తూ, వివిధ వ్యవస్థలను అనుసంధానించే ఫ్రేమ్‌వర్క్‌గా ఈ విడిభాగాలుపనిచేస్తాయి. 2028 ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి ప్రారంభం కానుంది. ఈ ప్లాంట్ నెలకు రెండు పూర్తి ఫ్యూజ్‌లేజ్ యూనిట్ల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది.భారతదేశంలో మా సప్లై చైన్‌ను బలోపేతం చేయడంలో ఇది నిర్ణయాత్మక దశ. భారత రక్షణ పరిశ్రమ రంగంలో కీలకమైన TASLతో సహా మా స్థానిక భాగస్వాముల విస్తరణకు ధన్యవాదాలు" అని దస్సాల్ట్ ప్రకటించింది. హైదరాబాద్ ప్లాంట్ రాఫెల్ విడిభాగాల ఉత్పత్తి రక్షణ రంగ పరిశ్రమల ముఖ చిత్రాన్ని మార్చనుంది. TASL CEO , MD సుకరణ్ సింగ్ భారతదేశ రక్షణ రంగానికి ఒక మైలురాయిగా ఈ ఒప్పందాన్ని అభివర్ణించారు. "భారతదేశ ఏరోస్పేస్ రక్షణ ఉత్పత్తుల ప్రయాణంలో ఈ భాగస్వామ్యం ఒక ముఖ్యమైన అడుగు. భారతదేశంలో పూర్తి రాఫెల్ ఫ్యూజ్‌లేజ్ ఉత్పత్తి టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సామర్థ్యాలపై పెరుగుతున్న నమ్మకాన్ని, డస్సాల్ట్ ఏవియేషన్‌తో మా సహకారం బలాన్ని నమ్ముతోంది. ప్రపంచ వేదికలకు మద్దతు ఇవ్వగల ఆధునిక, బలమైన ఏరో స్పేస్ తయారీ ఎకో సిస్టమ్‌ను స్థాపించడంలో భారతదేశం సాధించిన అద్భుతమైన పురోగతిని కూడా ఇది ప్రతిబింబిస్తుంది" అని సుకరణ్ సింగ్ ప్రకటించారు.

# రద్దీగా రేషన్ షాపులు

**మహబూబ్ నగర్, జూన్ 6, ( వెలుతురు)**



సన్న బియ్యం కోసం రేషన్ షాపుల వద్ద పేద ప్రజలు బారులు తీరారు. ఈసారి కేంద్ర ప్రభుత్వం మూడు నెలలకు సరిపడా బియ్యాన్ని ఒకేసారి విడుదల చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం అందుకు తగ్గట్టుగా సన్నబియ్యం పంపిణీకి ఏర్పాట్లు చేసింది.కేంద్ర ప్రభుత్వం ఒక్కో యూనిట్ కు ఐదు కిలోల చొప్పున, మూడు నెలలకు 15 కిలోలు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా నెలకు ఒక్కో యూనిట్ కు ఒక కిలో చొప్పున కలిపి ఈనెల ఒకటి నుండి లబ్ధిదారులకు పంపిణీ చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సన్న బియ్యం ఇస్తుండడంతో మూడు నెలల రేషన్ కోటా బియ్యం కోసం మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా రేషన్ షాపుల వద్ద పేదలు బారులు తీరుతున్నారు.దొడ్డు బియ్యానికి బదులు ఏప్రిల్ నెల నుంచి రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం ఇస్తుండడంతో రేషన్ కార్డు దారుల్లో 90 శాతానికి పైగా తమకు కేటాయించిన బియ్యాన్ని తీసుకెళ్తున్నారు. ఫలితంగా రేషన్ షాపుల్లో రేషన్ బియ్యం స్టాక్ ఉండడం లేదు. పూర్తిగా ఉచితంగా అందులో సన్నబియ్యం ఇస్తుండడంతో పేదలంతా బియ్యం తీసుకెళ్లడానికి మొగ్గు చూపుతున్నారు.ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యానికి తోడు, కేంద్ర ప్రభుత్వం మూడు నెలలకు సరిపడా బియ్యం ఇవ్వడానికి నిర్ణయించడంతో పేదలు రేషన్ బియ్యం షాపులకు పరుగులు పెడుతున్నారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా రేషన్ షాపుల ముందు లబ్ధిదారులు బియ్యం కోసం బారులు తీరుతున్నారు.మహబూబాబాద్ జిల్లాలో రేషన్ కార్డు దారులకు ఒకేసారి మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టారు. దీనితో జిల్లాలోని మహబూబాబాద్, కేసముద్రం, తొర్రూరు, గార్ల, మరిపెడ, కొత్తగూడా మండల స్థాయి బియ్యం స్టాక్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు నిరంతరాయంగా లారీలు, ట్రాక్టర్ల ద్వారా బియ్యం రవాణా చేస్తున్నారు.జిల్లాలో 2 లక్షల 43 వేలకు పైగా రేషన్ కార్డులు ఉండగా, ప్రతినెల 4,805 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ జరుగుతుండగా, ఈసారి జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి ఒకేసారి మూడు నెలల బియ్యం 14,415 మెట్రిక్ టన్నులు అవసరం కావడంతో, రైస్ మిల్లుల నుంచి సీఎంఆర్ కింద సేకరించి స్టేజ్ 1 గోదాము నుంచి స్టేజ్ 2 మండల స్థాయి స్టాక్ పాయింట్లకు పంపి అక్కడి నుంచి రేషన్ డీలర్లకు నేరుగా లారీల ద్వారా సరఫరా చేస్తున్నారు. కొద్దిసేపు కూడా గోదాం వద్ద బియ్యం లారీలను నిలపకుండా, ఇలా రాగానే అలా లారీలు, ట్రాక్టర్లలో దిగుమతి చేసి గ్రామాలకు తరలిస్తున్నారు.చేతగాక పోయినా తప్పకుండా బియ్యం కోసం నెల నెల రేషన్ షాపుకు పోవాల్సి వచ్చేది. రేవంత్ రెడ్డి సర్కారు వచ్చినంక సన్నబియ్యం ఇస్తుండడంతో వాటితోనే జీవనం గడుస్తోంది. ఇప్పుడు ప్రధానమంత్రి మోడీ మూడు నెలల బియ్యాన్ని ఒక్కసారే ఇవ్వడం, రేవంత్ రెడ్డి సారు ఆ బియ్యం పూర్తిగా సన్నవి ఇవ్వడం మాకు మంచి బువ్వ తినే అవకాశం దక్కింది. అట్లనే నెల నెల రేషన్ షాపుకు పోయే గోస తప్పించారు.

# రాజాసింగ్ దారెటు

**హైదరాబాద్, జూన్ 6, ( వెలుతురు)**



రాజాసింగ్. కట్టర్ హిందూ. 2018లో తెలంగాణలో బీజేపీ గెలిచిన ఒకే ఒక్క సీటు ఆయనదే. తెలంగాణలోనే కాదు..నార్త్ స్టేట్స్‌లో రాజాసింగ్‌కు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. అలాంటి రాజాసింగ్ ఇప్పుడు తెలంగాణ బీజేపీలో కాక రేపుతున్నారు. ధిక్కార స్వరం వినిపిస్తూ..ఏకంగా స్టేట్ లీడర్లను టార్గెట్ చేస్తున్నారు. ఎప్పటికప్పుడు తన అసంతృప్తిని తెలియజేస్తూ..రాష్ట్ర నాయకత్వం నిర్ణయాలను వ్యతిరేకిస్తూ వస్తున్నారు. పాత సామాన్లను బయటకు పంపితే పార్టీ బాగుపడుతుందని డా.లక్ష్మణ్, కిషన్‌రెడ్డి లాంటి నాయకులపై ఇన్‌డైరెక్ట్ కామెంట్స్ చేసి చర్చకు దారి తీశారు రాజాసింగ్.హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపిక విషయంలోనూ, ఎంపీ అభ్యర్థిగా మాధవీలత సెలక్షన్, గోల్కొండ జిల్లా అధ్యక్ష పోస్ట్ విషయంలో..ఇలా అడపా దడపా రాష్ట్ర నాయకులపై రాజాసింగ్ తన గళం వినిపిస్తూ వస్తున్నారు. కానీ ఎమ్మెల్సీ కవిత కామెంట్స్ కరెక్టే అన్నట్లుగా..రాజాసింగ్ స్పందించిన తీరే పెద్ద చర్చకు దారితీసిందిబీజేపీలో విలీనం చేసేందుకు బీఆర్ఎస్ సిద్దమైందని కామెంట్స్ చేసి ఎమ్మెల్యే కవిత కారు పార్టీలో కలకలం సృష్టించారు. తమ పార్టీ నేతలు మంచి ప్యాకేజీ ఇస్తే దేనికైనా సిద్ధపడుతారంటూ రాజాసింగ్ బీజేపీలో రచ్చకు తెరలేపారు. అయితే రాజాసింగ్ వ్యాఖ్యలపై కొందరు బీజేపీ కార్యకర్తలు మండిపడుతున్నారట. రాజాసింగ్ లైన్ దాటుతున్నారని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారట. రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ కూడా చేస్తున్నారట. ఈ వ్యవహారంపై ఆగ్రహంతో ఉన్న రాజాసింగ్..సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెట్టిన క్యాడర్‌పై కాకుండా వారి వెనకున్న నాయకుల టార్గెట్‌గా అటాక్ షురూ చేశారట.ఈ విషయాలన్నీ నిశితంగా గమనిస్తున్న జాతీయ నాయకత్వం రాజాసింగ్‌కు నోటీసులు ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం. మూడు, నాలుగు సార్లు, గెలిచినంత మాత్రన వారు ఏది మాట్లాడినా సాగుతుందని అనుకోవద్దని అవసరం అనుకుంటే చర్యలకు సిద్ధం కావాల్సి ఉంటుందని..ఇటీవల జరిగిన వర్క్ షాప్‌లో బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ అభయ్ పాటిల్ హెచ్చరించారు.ఈ క్రమంలోనే రాజాసింగ్‌కు నోటీసులు ఇస్తారన్న దానిపై పార్టీ ఆఫీస్‌లో చర్చ జరుగుతుంది. నోటీసులు ఇస్తారన్న మ్యాటర్ లీక్ కావడంతో గోషామాల్ ఎమ్మెల్యే స్వరం పెంచారు. తనకు నోటీసులు ఇవ్వడం కాదు దమ్ముంటే సస్పెండ్ చేయాలని సవాల్ చేస్తున్నారు. తాను బయటికి వెళ్లే ముందు అందరి బండారాన్ని బయటపెడతానని హెచ్చరిస్తున్నారు.అయితే రాజాసింగ్ కామెంట్స్..అందుకు బీజేపీ నేతల నో రియాక్షన్ చూస్తుంటే.. అసలు ఏం జరుగుతుందో పార్టీ క్యాడర్, లీడర్లకు అర్థం కావడం లేదట. బీజేపీని రాజాసింగ్ టార్గెట్ చేస్తున్నారా? లేక రాజాసింగ్‌నే రాష్ట్ర పార్టీ నేతలు టార్గెట్ చేస్తున్నారా అనేది అర్థం కావడం లేదట. బండి సంజయ్‌తో పాటు పలువురు నేతలు తనతో బానే ఉంటూ..కిషన్‌రెడ్డితో కలిసి తనపై కుట్ర చేస్తున్నారని భావిస్తున్నారట రాజాసింగ్. అందుకే అందరినీ టార్గెట్ చేస్తూ..రాజాసింగ్ అటాకింగ్ స్టార్ట్ చేశారని అంటున్నారు.2014లో పార్టీలో చేరినప్పటి నుంచి వేధింపులు భరిస్తున్నానని..అవసరమైతే రాజకీయాల నుంచి తప్పుకుని గోసేవ చేసుకుంటున్నానని చెప్తున్నారట రాజాసింగ్. తెలంగాణలో బీజేపీ ఎప్పుడో అధికారంలోకి రావాలని, కానీ రిటైరైన వ్యక్తులు పార్టీలో ఉంటే ఎప్పటికీ బీజేపీ అధికారంలోకి రాదంటున్నారాయన. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ సీఎంతో కొందరు బీజేపీ నేతలు రహస్యంగా భేటీ అవుతున్నారని ఆరోపించారు.ఇప్పటికే 2023లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజాసింగ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. తర్వాత జాతీయ నాయకత్వం ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేసింది. ఇప్పుడు మరోసారి ఆయనపై చర్యలు తీసుకుంటారా అన్నది సస్పెన్స్‌గా మారింది. కమలం పార్టీకి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న రాజాసింగ్ వెనుక ఎవరున్నారనేది హాట్ టాపిక్‌గా అవుతోంది. రాష్ట్రానికి చెందిన కొందరు నేతల సపోర్ట్‌తోనే రాజాసింగ్ ధిక్కార స్వరం వినిపిస్తున్నారా? అన్నది చర్చనీయాంశంగా మారింది.

# పీక్ అవర్స్ లో మిక్సీలు, మోటర్లు వద్దు...

**హైదరాబాద్, జూన్ 6, ( వెలుతురు)**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా.. టీజీఎస్‌పీడీసీఎల్ ఛైర్మన్ ముషారఫ్ ఫరూఖీ విద్యుత్ ఆదా ప్రాముఖ్యతను వివరించారు. ఇది పర్యావరణానికి మేలు చేస్తుందని.. బొగ్గు వాడకం, కార్బన్ ఉద్గారాలు తగ్గిస్తుందని పేర్కొన్నారు. ఎల్‌ఈడీ లైట్లు, అన్ ప్లగ్ చేయడం ద్వారా ఫాంటమ్ పవర్ తగ్గించవచ్చన్నారు. ఏసీలను 24-26ళీ%జ%లో, బీఈఈ రేటింగ్ ఉపకరణాలను వాడాలని సూచించారు. పీక్ అవర్స్‌లో భారీ విద్యుత్ వాడకం తగ్గించి.. సౌర శక్తిని ప్రోత్సహించాలన్నారు. విద్యుత్ ఆదా వల్ల బిల్లులు తగ్గి, కాలుష్యం తగ్గి, సుస్థిర భవిష్యత్తుకు బాట పడుతుందన్నారు.ప్రస్తుత ఆధునిక యుగంలో విద్యుత్ వినియోగం అనివార్యం. అయితే.. దానిని విచక్షణారహితంగా వాడటం వల్ల పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ప్రపంచ పర్యావరణ

TGNPDCL

దినోత్సవం సందర్భంగా.. టీజీఎస్‌పీడీసీఎల్ ఛైర్మన్, ఎండీ ముషారఫ్ ఫరూఖీ కీలక సందేశాన్నిచ్చారు. విద్యుత్ ఆదా చేయడం కేవలం బిల్లులు తగ్గించుకోవడం మాత్రమే కాదని, అది పర్యావరణానికి మేలు చేసినట్లేనని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ ఈ విషయంలో దృష్టి సారించి, తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు.విద్యుత్ ఉత్పత్తికి ప్రధానంగా బొగ్గు వినియోగిస్తుంటాం. విద్యుత్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా బొగ్గు వాడకం తగ్గి, తద్వారా వాతావరణంలోకి వెలువడే కార్బన్ ఉద్గారాల విడుదల గణనీయంగా తగ్గుతుంది. ఇది వాతావరణ మార్పులను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.సాంప్రదాయ బల్బుల స్థానంలో ఎల్‌ఈడీ లైట్లను వాడాలని ముషారఫ్ ఫరూఖీ సూచించారు. ఎల్‌ఈడీలు 75 నుంచి 80 శాతం వరకు తక్కువ విద్యుత్తును వినియోగించుకుంటాయని తెలిపారు. మొబైల్ ఛార్జర్‌లు, టీవీలు, మైక్రోవేవ్‌లు, ఇస్త్రీ పెట్టెలు, వాషింగ్ మెషీన్లు, కంప్యూటర్లు వంటి విద్యుత్ ఉపకరణాలు ఉపయోగంలో లేనప్పుడు వాటిని అన్ ప్లగ్ చేయాలని సూచించారు. ఎందుకంటే.. ప్లగ్‌లు పెట్టి ఆన్‌లో ఉంచితే విద్యుత్ ప్రవాహం కొనసాగుతుందని.. దీన్నే 'ఫాంటమ్ పవర్' లేదా 'వ్యాంపైర్ ఎనర్జీ' అని అంటారని వివరించారు.ఏసీలను 24 నుంచి 26 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలోనే వాడాలని.. ఇది విద్యుత్ పొదుపుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. అలాగే.. రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, వాషింగ్ మెషీన్లు వంటి గృహోపకరణాలను కొనుగోలు చేసేటప్పుడు ఫైవ్–స్టార్ లేదా హై–స్టార్ రేటింగ్ ఉన్న బీఈఈ (బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియెన్సీ) ఉపకరణాలను ఎంచుకోవాలని సలహా ఇచ్చారు.సంప్రదాయ విద్యుత్ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి సోలార్ వాటర్ హీటర్లు లేదా రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవడం దీర్ఘకాలికంగా ప్రయోజనకరమని అన్నారు. పగటిపూట సహజ కాంతి, గాలి ప్రసరణ (వెంటిలేషన్)ను సరిగ్గా ఉపయోగించుకోవడం ద్వారా లైట్లు, ఫ్యాన్‌ల అవసరం తగ్గుతుందని సూచించారు.
మోటార్లు, మిక్సీలు, గ్రైండర్లు వంటి అధిక విద్యుత్ వినియోగించే ఉపకరణాలను పీక్ అవర్స్‌లో (ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు) వినియోగించొద్దని ఆయన తెలిపారు. ఈ సమయాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా పూర్తి సామర్థ్యంతో జరగక.. అదనంగా విద్యుత్ అవసరమవుతుందని వివరించారు. మైక్రో ఓవెన్‌ను తరచుగా తెరవొద్దని.. ఒకసారి తెరిస్తే ఓవెన్ నుంచి 250 డిగ్రీల వేడి వృథా అవుతుందని పేర్కొన్నారు. వార్మ్ స్విచ్ ఉన్న రైస్ కుక్కర్‌ను వాడితే 30 శాతం విద్యుత్ ఆదా అవుతుందని సూచించారు.విద్యుత్ ఆదా చేయడం వల్ల వ్యక్తిగతంగా విద్యుత్ బిల్లులు తగ్గుతాయి. తద్వారా కుటుంబ ఆర్థిక భారం తగ్గుతుంది. సామూహికంగా చూస్తే.. ఇది జాతీయ ఇంధన భద్రతకు దోహదపడుతుంది. విద్యుత్ ఉత్పత్తికి వాడే బొగ్గు తగ్గుతుంది కాబట్టి.. పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది. వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ తగ్గడం వల్ల గ్లోబల్ వార్మింగ్ ప్రభావాన్ని తగ్గించవచ్చు. ఇది సుస్థిర అభివృద్ధికి.. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడానికి మార్గం సుగమం చేస్తుంది. ప్రతి చిన్న పొదుపు కూడా ఒక పెద్ద మార్పునకు నాంది పలుకుతుందని గుర్తుంచుకోవాలి

# బాల కార్మికులను గుర్తించాలి

- అలాంటి వారు ఉంటే విముక్తి చేయాలి
- పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్



విజయవాడ,జూన్ 6, ( వెలుతురు)

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. స్థానిక కలెక్టరేట్ చాంబర్లో శుక్రవారం కార్మిక, మహిళా శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై రూపొందించిన గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జిల్లా టాస్క్ పోర్స్ కమిటీ- సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, బాల కార్మిక వ్యతిరేక మాసం సందర్భంగా ఈనెల 30వ తేదీ వరకు కార్మిక, పోలీస్, స్వచ్ఛంద సంస్థలు ,రెవెన్యూ, శాఖల అధికారులు స్పెషల్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి బాల కార్మికులను గుర్తించాలన్నారు. బాల, కౌమార కార్మిక నిషేధం, నియంత్రణ చట్టం మేరకు 14 సంవత్సరాల లోపు బాలలను, 14 నుంచి 18 ఏళ్ల లోపు వయస్సు వారిని ప్రమాదకర పనుల్లో పెట్టడం నేరమన్నారు. బాలల చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. బాలలను, కౌమార బాలలను, బాల కార్మికులుగా పనిచేస్తున్నట్లు- గుర్తిస్తే ఫోన్:100,1098, 1800 102 7222 టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం అందించాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో ఉప కార్మిక కమిషనర్ సి.హెచ్.ఆశారాణి, ఐసిడియస్ పిడి డి. శ్రీలక్ష్మి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ యం.రాజేశ్వరరావు, వాసవ్య మహిళామండలి డా. వి.కీర్తి, సి ఆర్ ఏ ఎఫ్ ప్రతినిధి ప్రభాకర్, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ సభ్యులు ఎ.రమేష్, సహాయ కార్మిక అధికారులు పాల్గొన్నారు.

# ఏపీలో మెగా డీఎస్సీ పరీక్షలు ప్రారంభం

- శుభాకాంక్షలు తెలిపిన బాబు, లోకేశ్
- విజయవాడలో కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్




అమరావతి,జూన్ 6, ( వెలుతురు)

ఏపీలో మెగా డీఎస్సీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాల్లోకి ఉదయం విడతలో 9 గంటల వరకు అభ్యర్థులను అనుమతించారు. 9.30 నుంచి 12 గంటల వరకు ఎగ్జామ్ ఉండనుంది. ఈ నెల 30 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఏపీలో 137, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో 17 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.మెగా డీఎస్సీలో 16,347 ఉపాధ్యాయ పోస్టులకు 3,36,305 మంది అభ్యర్థులు 5,77,675 దరఖాస్తులు సమర్పించారు. మధ్యాహ్నం విడతలో 2 గంటలకు అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమచారు. 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. మరోవైపు డీఎస్సీ అభ్యర్థులందరికీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. మెగా డీఎస్సీలో భాగంగా తొలిరోజు శుక్రవారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన సెషన్-1లో విద్యార్థులు హాజరయ్యారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ నగరంలోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలోని పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి ఇబ్బందిలేకుండా ప్రశాంత వాతావరణంలో అభ్యర్థులు పరీక్ష రాసేందుకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ నెలరోజుల పాటు జరిగే మెగా డీఎస్సీ పరీక్షలు రాసేందుకు నగరంలో దాదాపు 30 వేల మందికి ఏర్పాట్లు చేశామని, జిల్లా పరిధిలోని పది పరీక్షా కేంద్రాలకు ప్రత్యేకంగా అధికారులను నియమించామని వెల్లడించారు. తాగునీటి సౌకర్యం, వైద్య శిబిరం, నీడ సౌకర్యం వంటివాటిని ఏర్పాటు- చేసినట్లు తెలిపారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) కావడంతో సాంకేతికంగా ఎలాంటి ఇబ్బందులు తెలెత్తకుండా ప్రత్యేక బృందాలతో డెస్క్‌టాప్, పవర్ బ్యాకప్ వంటివాటిని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా పోలీసు శాఖ భాగస్వామ్యంతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు- చేశామని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుకు చర్యలు తీసుకున్నామన్నారు. ట్రాఫిక్ సమస్యలు ఎదురుకాకుండా ప్రణాళిక ప్రకారం చర్యలుతీసుకోవడం జరిగిందని.. తిరువూరు, మైలవరం వంటి ప్రాంతాలకు ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

# అయ్యా మోడీ జీ..ప్రమోషన్ ఇవ్వండి

- కాశ్మీర్ సభలో ఒమర్ ఆసక్తికర వ్యాఖ్యలు

శ్రీనగర్, జూన్ 6, ( వెలుతురు)



జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా అంశాన్ని సీఎం ఒమర్ అబ్దుల్లా నేరుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీసమక్షంలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చీనాబ్ బ్రిడ్జి, కత్రా-శ్రీనగర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సహా వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రధానమంత్రి శుక్రవారం నాడు ప్రారంభించారు. ఆయనతోపాటు- లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఒమర్ అబ్దుల్లా వేదికను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. జమ్మూకాశ్మీర్‌లో అన్ని రైల్వే ప్రాజెక్టుల ప్రారంభోత్సవాల్లో ప్రధానమంత్రితో తాను వేదిక పంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. మొదట అనంతనాగ్ రైల్వేస్టేషన్, ఆ తర్వాత బనిహాల్ రైల్వే టన్నెల్ ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నట్లు- చెప్పారు. జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా అంశాన్ని ప్రస్తావిస్తూ ఎల్జీ మనోజ్ సిన్హా జూనియర్ స్థాయి నుంచి ప్రస్తుతం ఉన్నతస్థాయికి ప్రమోట్ అయ్యారని, తాను సీఎం స్థాయి నుంచి కేంద్రపాలిత ప్రాంతానికి సీఎంగా డిమోట్ అయ్యానని చమత్కరించారు. 2014లో కాత్రా రైల్వేస్టేషన్ ప్రారంభ మైనప్పుడు ఇదే నలుగురు వ్యక్తులు హాజరయ్యారని.. రైల్వే సహాయ మంత్రి మనోజ్ సిన్హా జమ్మూకాశ్మీర్ ఎల్జీగా ప్రమోట్ అయితే, తాను ఒక రాష్ట్రం సీఎం నుంచి యూటీకి సీఎంగా డిమోట్ అయ్యానని ఒమర్ అబ్దుల్లా అన్నారు. పరిస్థితులు ఇప్పుడు సాధారణ స్థితికి చేరిన విషయం అందరికీ తెలిసిందేనని, జమ్మూకాశ్మీర్‌కు త్వరలోనే ప్రధానమంత్రి తిరిగి రాష్ట్ర హోదా ఇస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ట్రంప్.. మస్క్ మధ్య పెరుగుతున్న దూరం

న్యూయార్క్, జూన్ 6, ( వెలుతురు)



రిపబ్లికన్ టాక్స్ బిల్లుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. వారి స్నేహంలో చీలికలు వస్తున్నట్లు కనిపిస్తున్నాయి. టాక్స్ బిల్లుపై డొనాల్డ్ ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేయగా, ఎలాన్ మస్క్ స్పందిస్తూ, తాను లేకపోతే డొనాల్డ్ ట్రంప్ ఎన్నికల్లో గెలిచేవారు కాదని అన్నారు.ఎలాన్ మస్క్ ఎక్స్ లో ఇలా రాసుకొచ్చారు, "నేను లేకుండా ట్రంప్ ఎన్నికల్లో ఓడిపోయేవారు, డెమోక్రటిక్ పార్టీ హౌస్‌ను నియంత్రించేవాళ్లు. రిపబ్లికన్లు సెనేట్‌లో 51-49గా ఉండేవారు." దీనికి ముందు, డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, రిపబ్లికన్ టాక్స్ బిల్లును ఎలాన్ మస్క్ వ్యతిరేకించినందుకు తాను చాలా నిరాశకు గురయ్యానని అన్నారు. ట్రంప్ మాట్లాడుతూ ఎలాన్ మస్క్‌కు వైట్ హౌస్ గుర్తుకు వస్తుందని, అతను ట్రంప్ డిరేంజ్‌మెంట్ సింద్రోమ్‌తో బాధపడుతున్నాడని అన్నారు. న్యూస్ ఏజెన్సీ అసోసియేటెడ్ ప్రెస్ ప్రకారం, డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, "నేను ఎలాన్ వైఖరి పట్ల చాలా నిరాశకు గురయ్యాను. నేను ఎలాన్‌కు చాలా సహాయం చేశాను." అని అన్నారు. అధ్యక్షుడు అత్యంత సన్నిహితమైన ఎలాన్ మస్క్‌ను విమర్శించారు, కొన్ని రోజుల క్రితం టెస్లా సీఈఓ అమెరికా అధ్యక్షుడి వ్యయ బిల్లును వ్యతిరేకించి, దానిని అసహ్యకరమైనదిగా అభివర్ణించారు.సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ఎక్స్‌లో ఇలా రాశారు, "క్షమించండి, కానీ నేను దీన్ని భరించలేను. ఈ అగౌరవకరమైన కాంగ్రెస్ వ్యయ బిల్లు చాలా అవమానకరమైంది. దీనికి ఓటు వేసిన వారికి సిగ్గుండాలి: మీరు తప్పు చేశారని మీకు తెలుసు. మీకు తెలుసు."బిల్లును విమర్శిస్తూ, ప్రజలను తమ ప్రతినిధులను సంప్రదించి ఈ చట్టాన్ని రద్దు చేసేలా డిమాండ్ చేయాలని ఎలాన్ మస్క్ కోరారు. దీనిపై సోషల్ మీడియా వేదికగా పోస్టు పెడుతూ, "ఈ వ్యయ బిల్లు అమెరికా చరిత్రలో రుణ పరిమితి పెంచేదిగా ఉంటుందని! ఇది రుణ బానిసత్వ బిల్లు."మస్క్ ఈ విమర్శలు చేసిన సమయంలో సెనేట్‌లో బిల్లుపై ట్రంప్ తన అభిప్రాయాన్ని చెబుతున్నారు. బిల్లుకు సంబంధించి మస్క్ చేసిన బహిరంగ విమర్శలపై వైట్ హౌస్ స్పందిస్తూ, అధ్యక్షుడు తన అభిప్రాయాన్ని మార్చుకోరని తెలిపింది.వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ మాట్లాడుతూ, "ఎలాన్ మస్క్ ఈ బిల్లుపై ఎలాంటి వైఖరి కలిగి ఉన్నారో అధ్యక్షుడికి ఇప్పటికే తెలుసు. ఇది అధ్యక్షుడి అభిప్రాయాన్ని మార్చదు. ఇది గొప్ప అద్భుతమైన బిల్లు, ఆయన దానికి కట్టుబడి ఉన్నారు" ఎక్స్ వేదికగా దీనిపై పెద్ద సుదీర్ఘమైన డిబేట్ రన్ చేస్తున్నారు ఎలాన్ మస్క్. పనిలో పనిగా అమెరికాలో మరో రాజకీయ పార్టీ రావాల్సిన అవసరం ఉందని అది న్యూ బ్లడ్‌తో నిండి ఉండాలని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు పార్టీ పెట్టే అంశంపై స్పందన కోరేందుకు ఓ పోల్‌ను కూడా రన్ చేస్తున్నారు.

# పెళ్లికి ముందు సెక్స్... 100 కొరడా దెబ్బల శిక్ష



జకర్తా, జూన్ 6, ( వెలుతురు)

సహజీవనమే ఇప్పటి ప్రపంచంలో కామన్ అయిపోతోంది. అలాంటిది పెళ్లి నిశ్చమయ్యాక శృంగారం చేస్తే శిక్షలు వేస్తారా ?. ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. వేస్తారు. ఈ ఇండొనేషియా జంట శిక్షలు అ్నభవించింది కూడా. ఇండోనేషియాలోని అసెహ్ ప్రావిన్స్‌లో ఒక జంట వివాహానికి ముందు లైంగిక సంబంధం కలిగి ఉన్నందుకు షరియా చట్టం కింద ఒక్కొక్కరికి 100 కొరడా దెబ్బల శిక్షను బహిరంగంగా అమలు చేశారు. అసెహ్ ఇండోనేషియాలో షరియా చట్టాన్ని అమలు చేసే ఏకైక ప్రాంతం. ఇక్కడ వివాహేతర సంబంధాలు, స్వలింగ సంబంధాలు, మద్యం సేవనం, జూదం వంటి నేరాలకు బహిరంగ కొరడా దెబ్బల శిక్ష విధిస్తారు.బాండా అసెహ్‌లోని ఒక బహిరంగ పార్క్‌లో ఈ జంట ఒక్కొక్కరూ 100 కొరడా దెబ్బల శిక్షను అనుభవించారు. పురుషుడికి శిక్షను రాటన్ కర్రతో అమలు చేశారు. మహిళా నిందితురాలిని ఒక మహిళా షరియా పోలీసు అధికారి కొరడాతో కొట్టింది. ఈ శిక్షను స్థానిక అధికారులు, వైద్య సిబ్బంది పర్యవేక్షించారు . జనం సమక్షంలో ఈ శిక్ష అమలు చేశారు. వీరితో పాటు మద్యం సేవనం, ఆన్‌లైన్ జూదం సంబంధిత నేరాలకు మరో ముగ్గురు వ్యక్తులు మొత్తం 49 కొరడా దెబ్బల శిక్షను అనుభవించారు. అసెహ్ ఇండోనేషియాలో 2001లో కేంద్ర ప్రభుత్వం చేసిన ఒక ఒప్పందం ద్వారా ప్రత్యేక స్వయంప్రతిపత్తిని పొందింది. దీర్ఘకాల సెపరటిస్ట్ తిరుగుబాటును అణచివేయడానికి. 2015లో, అసెహ్‌లో షరియా చట్టాన్ని ఒక శాతం జనాభా ఉండే గైర్-ముస్లిములకు కూడా వర్తింప చేశారు. ఇది వివాహేతర సంబంధాలు, స్వలింగ సంబంధాలు, జూదం, మద్యం సేవనం, మహిళలు గట్టి దుస్తులు ధరించడం, పురుషులు శుక్రవారం ప్రార్థనలు చేయకపోవడం వంటి నేరాలకు 100 కొరడా దెబ్బల వరకు శిక్షలను అనుమతిస్తుంది. ఈ బహిరంగ కొరడా శిక్షలు మానవ హక్కుల సంస్థల నుండి తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్నాయి. ఈ శిక్షను అవమానకరమైనది , అమానవీయమైనదిగా ప్రకటించాయి. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి సంస్థలు ఈ శిక్షలు ఇండోనేషియా సంతకం చేసిన అంతర్జాతీయ మానవ హక్కుల ఒప్పందాలను ఉల్లంఘిస్తాయని వాదించాయి. అయితే అసెహ్ జనాభాలో ఈ శిక్షలకు గణనీయమైన మద్దతు ఉంది. మత ఉల్లంఘనలను నిరోధించడానికి ఒక సాంప్రదాయక మార్గంగా ప్రజలు నమ్ముతూంటారు. ఇండోనేషియా జాతీయ క్రిమినల్ కోడ్ వివాహేతర సంబంధాలను నియంత్రించదు, కానీ 2022లో ఆమోదించిన కొత్త క్రిమినల్ కోడ్ 2026 నుండి వివాహేతర శృంగారాన్నినను నేరంగా పరిగణిస్తుంది. అయితే, అసెహ్‌లో షరియా చట్టం ఈ నేరాలను ఇప్పటికే నిషేధించి శిక్షలు అమలు చేస్తోంది.

# దుమ్మురేపుతున్న ఇండియన్ ఉమెన్

ముంబై, జూన్ 6, ( వెలుతురు)




భారతీయ మహిళలు కేవలం గృహాలకు మాత్రమే పరిమితం కాకుండా, అన్ని రంగాలలో తమ సత్తాను చాటుతున్నారు. ఆర్థిక రంగం, టెక్నాలజీ, కళలు, స్టార్టప్‌ల వంటి వివిధ రంగాలలో మార్పునకు కారణమవుతున్న 97 మంది స్ఫూర్తిదాయకమైన భారతీయ మహిళలను గుర్తిస్తూ..కాండెర్ హురున్ ఇండియా సంయుక్తంగా 2025 సంవత్సరానికి గాను తొలి 'కాండెర్ హురున్ ఇండియా మహిళా నాయకుల జాబితా' ను విడుదల చేశాయి. భారతీయ మహిళలు కేవలం గృహాలకు మాత్రమే పరిమితం కాకుండా, అన్ని రంగాలలో తమ సత్తాను చాటుతున్నారు. ఆర్థిక రంగం, టెక్నాలజీ, కళలు, స్టార్టప్‌లవంటి వివిధ రంగాలలో మార్పునకు కారణమవుతున్న 97 మంది స్ఫూర్తిదాయకమైన భారతీయ మహిళలను గుర్తిస్తూ..కాండెర్ హురున్ ఇండియా సంయుక్తంగా 2025 సంవత్సరానికి గాను తొలి 'కాండెర్ హురున్ ఇండియా మహిళా నాయకుల జాబితా' ను విడుదల చేశాయి. ఈ జాబితాలో నిలిచిన మహిళలు తమ అసాధారణమైన నాయకత్వ లక్షణాలతో దేశాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నారు.మార్కెట్ లీడర్‌షిప్‌ను పరిగణనలోకి తీసుకుంటూ వారు నాయకత్వం వహిస్తున్న కంపెనీల విలువ ఆధారంగా అగ్రశ్రేణి 10 మంది మహిళా ప్రొఫెషనల్స్‌కు ర్యాంకులు ఇచ్చారు. శాంతి ఏకాంబరం కోటక్ మహీంద్రా బ్యాంక్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ అయిన శాంతి ఏకాంబరం, తన కంపెనీ విలువ రూ.3.81 లక్షల కోట్లు కావడంతో ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. పర్మిందర్ చోప్రా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన పర్మిందర్ చోప్రా, తన కంపెనీ విలువరూ.1.44 లక్షల కోట్లతో ఆమె తర్వాతి స్థానంలో ఉన్నారు. ఈ జాబితా దేశంలోని ఆర్థిక కార్పొరేట్ రంగాలలో మహిళల ఆధిపత్యాన్ని సూచిస్తుంది.అలాగే ఫస్ట్ జనరేషన్ వెల్త్ క్రియేటర్లుగా తమకంటూ ఒక గుర్తింపును ఏర్పరచుకున్న మహిళల జాబితాలో రాధా వేంబు ముందున్నారు. రాధా వేంబు: జొహెూ సహ-వ్యవస్థాపకురాలు అయిన రాధా వేంబు రూ.55,300 కోట్ల వ్యక్తిగత సంపదతో ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. ఆమె ఇండియా రిచ్ లిస్ట్ 2024, గ్లోబల్ రిచ్ లిస్ట్ 2024, ఫిలాంత్రోపీ లిస్ట్ 2024 వంటి పలు ప్రతిష్టాత్మక జాబితాలలో కూడా స్థానం సంపాదించుకున్నారు. జయశ్రీ ఉల్లాల్ : అరిస్టా నెట్‌వర్క్స్ సీఈఓ అయిన జయశ్రీ ఉల్లాల్, రూ.48,900 కోట్ల వ్యక్తిగత సంపదతో ఈ విభాగంలో ఆమె తర్వాతి స్థానంలో ఉన్నారు.తమ స్వయంకృషితో సంపదను సృష్టించుకున్న మహిళల జాబితా ఇది. వ్యాపార విలువలు, ఇన్వెస్ట్ మెంట్ అసెట్స్ లను పరిగణలోకి తీసుకుని ఈ జాబితాను రూపొందించారు.నెక్స్ట్ జనరేషన్ నాయకుల జాబితాలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఛైర్‌పర్సన్ రోష్ని నాదర్ మల్హోత్రా మొదటి స్థానంలో నిలిచారు. ఆమె నాయకత్వంలో హెచ్‌సీఎల్ టెక్ (ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. 60 దేశాలలో కార్యకలాపాలు నిర్వహిస్తూ రూ.1.11 లక్షల కోట్ల ఆదాయాన్ని సాధించింది. 2025 మార్చిలో శివ్ నాదర్ తన హెచ్‌సీఎల్ షేర్లలో 47 శాతం రోష్ని నాదర్ మల్హోత్రాకు బహుమతిగా ఇవ్వడంతో ఆమె మెజారిటీ వాటాదారుగా మారారు. దీనితో ఆమె భారతదేశంలో మూడవ అత్యంత సంపన్న వ్యక్తిగా, ప్రపంచంలో ఐదవ అత్యంత సంపన్న మహిళగా అవతరించారు.

ముంబై మహిళా నాయకత్వానికి కేంద్రం!

ఈ జాబితాలో ఉన్న 97 మంది మహిళలలో 38 మంది ముంబై కేంద్రంగా పనిచేస్తున్నారు. దీనితో ముంబై భారతదేశంలో మహిళా నాయకత్వానికి అతిపెద్ద కేంద్రంగా అవతరించింది. ఢిల్లీ 12 మందితో, బెంగళూరు 10 మంది నాయకులతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. భారతీయ యువ మహిళలు చాలా తక్కువ వయసులోనే నాయకత్వ స్థానాలను చేపడుతున్నారు. ఈ జాబితాలో ఉన్న మహిళల సగటు వయస్సు 51 సంవత్సరాలు. వారిలో సుమారు 25 శాతం మంది 26 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు వారు.

మృణాల్ పాంచల్ : 26 ఏళ్ల మృణాల్ పాంచల్, ఎంఆర్‌యూచా బ్యూటీ ఇన్ఫ్లుయెన్సర్ ఫౌండర్ విభాగంలో 5.5 మిలియన్ల ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్లతో అగ్రస్థానంలో ఉన్నారు.

శ్రద్ధా కపూర్ : అత్యధిక మంది ఫాలోవర్లు ఉన్న సెలబ్రిటీ ఇన్వెస్టర్ శ్రద్ధా కపూర్, 94.1 మిలియన్ల ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్లతో ముందున్నారు. ఆమె మైగ్లామ్, షూన్య వంటి బ్రాండ్‌లలో పెట్టుబడులు పెట్టారు.

దేవాన్షి కేజ్రీవాల్ 28 ఏళ్ల దేవాన్షి కేజ్రీవాల్, స్కిల్‌మాటిక్స్ సహ-వ్యవస్థాపకురాలు, ఈ జాబితాలో అతి పిన్న వయస్సు గల వ్యాపార నాయకురాలు.

అర్పితా సింగ్: మరోవైపు, 87 ఏళ్ల కళాకారిణి అర్పితా సింగ్ ఈ జాబితాలో అత్యంత వృద్ధురాలు. క్రియేటివిటీకి వయస్సుతో సంబంధం లేదని ఆమె నిరూపించారు.

రోహిణి నిలేకని దాతృత్వ రంగంలో రోహిణి నిలేకని ప్రత్యేకంగా నిలిచారు. తన ఫౌండేషన్ ద్వారా రూ.154 కోట్లు విరాళంగా ఇచ్చారు.

# జీవీఎంసీ భేటీలో ఉద్రిక్తత

విశాఖపట్నం, జూన్ 6, ( వెలుతురు)





విశాఖ జీవీఎంసీ సర్వసభ్య సమావేశం జరిగిం ది. మేయర్గా పీలా శ్రీనివాసరావు ఎన్నికైన తర్వాత జరు గుతున్న తొలి సమావేశం కావడం, అంతేకాకుండా కౌన్సిల్ లో ఇంతవరకూ విపక్షంగా ఉన్న కూటమి అధికారపక్షంగా, అధికారపక్షమైన వైసీపీ విపక్షంగా వ్యవహరించనుండడం తో సమావేశంలో గందరగోళ పరిస్థితి నెలకొంది. మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం కోసం ఇప్పటికే 27 అంశాలతో అజెండాను తయారుచేసి సభ్యు లకు అందజేశారు. టేబుల్ అజెండాగా మరి కొన్ని అంశా లను కౌన్సిల్లో చర్చకు పెట్టే అవకాశం ఉంది. వైసీపీ హయాంలో జీవీఎంసీలో జరిగిన అవినీతి, అక్రమా లను కూటమి సభ్యులు సభలో బయట పెట్టే అవకాశం ఉంది. ముఖ్యంగా జీవీఎంసీకి పూర్తి స్థాయిలో కమిషనర్ నువ్వ ఏర్పాటు చేయాలనీ సభ్యులు డిమాండ్ చేశారు.ఈ క్రమంలో సమావేశం లో ఉద్రిక్తత ఏర్పడింది.

# నేను పారిపోయాను... దొంగను కాను

- నెటిజన్ల కామెంట్లపై విజయ్మాల్యా స్పందన

**లండన్,జూన్6( వెలుతురు):**



బ్యాంకులకు రూ.వేల కోట్లు- ఎగవేసి విదేశాల్లో దాక్కొన్న బిలియనీర్ విజయ్ మాల్యా ఓ పాడ్కాస్ట్లో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. మనీలాండరింగ్ కేసులో అరెస్టయ్యే పరిస్థితులు ఉన్నాయి కాబట్టే తాను భారత్ను వీడానని పేర్కొన్నారు. దొంగతనం చేయలేదని.. అసలు దొంగతనం ఎక్కడ జరిగిందని ప్రశ్నించారు. తాను భారత్ నుంచి పారిపోయానని.. కానీ దొంగను కానని అన్నారు. భారత్ నుంచి వెళ్లిపోయినందుకు నన్ను దేశం నుంచి పారిపోయిన వ్యక్తి అని పిలవండి. కానీ దొంగ అని ముద్ర వేయకండి. కింగ్ఫిషర్ ఎయిర్లైన్స్ రుణాల విషయంలో మోసం చేసినట్లు- విజయ్ మాల్యా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దేశం విడిచి వెళ్లిపోయిన ఆయన మార్చి 2016 నుంచీ బ్రిటన్లో నివసిస్తున్నారు. మాల్యాను భారత్కు రప్పించడానికి కేంద్రం ప్రయత్నిస్తున్న విషయం విదితమే. తాను తీసుకున్న రుణాలకు అనేక రెట్లు బ్యాంకులు తన నుంచి వసూలు చేశాయని.. అందుకు సంబంధించిన అకౌంట్ స్టేట్మెంట్లను అందించాలని కోరుతూ ఆయన ఇటీవల కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. ఆర్సిబి విజయంతో మాల్యాచేసిన పోస్ట్పై వివాదంచెలరేగింది. ఆయన దొంగ అంటూ వ్యాఖ్యానించారు. దేశానికి వచ్చి ఎగవేతలను కట్టేయాలని సూచించారు. ఈ క్రమంలో మాల్యా స్పందించారు. ముందస్తు ప్రణాళికలో భాగంగానే 2016లో నేను భారత్ నుంచి విదేశాలకు వెళ్లాను. కొన్ని కారణాల వల్ల తిరిగి రాలేకపోయాను. ఈ దొంగతనం అనే విషయం ఎక్కడి నుంచి వచ్చింది. భారత్లో న్యాయమైన విచారణ, గౌరవప్రదమైన జీవితం ఉంటుందని హామీ ఇస్తే దేశానికి తిరిగి వచ్చే విషయం గురించి ఆలోచించేవాడిని.. కానీ ఆ విధంగా ఉండదని నాకు తెలుసని మాల్యా అన్నారు. కింగ్ఫిషర్ ఎయిర్లైన్స్ పునర్నిర్మాణ ప్రణాళికతో తాను అప్పటి ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీని సంప్రదించి.. తాను సమస్యల్లో ఉన్నట్లు ఆయనకు చెప్పానని మాల్యా అన్నారు. ఈ ఆర్థిక మాంద్యంలో పని చేయలేనని.. అందుకుగాను కింగ్ఫిషర్ ఎయిర్లైన్స్ విమానాల సంఖ్యను తగ్గించాలని, ఉద్యోగులను తొలగించాలని భావిస్తున్నట్లు- తెలిపానన్నారు. అయితే ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవద్దని, బ్యాంకుల నుంచి మద్దతు లభిస్తుందని ప్రణబ్ ముఖర్జీ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అనంతరం పలు ఆర్థిక ఇబ్బందుల వల్ల తాను దేశాన్ని వీడాల్సి వచ్చిందని తెలిపారు.

## ఆత్మహత్య చేసుకున్న వైకాపా నాయకుడు

- కుటుంబాన్ని ఫోన్లో పరామర్శించిన జగన్
- కుటుంబానికి అండగా ఉంటానని హామీ



**అమరావతి,జూన్ 6( వెలుతురు):**

ఆత్మహత్య చేసుకున్న వైఎస్సార్సీపీ నాయకుడు నారాయణరెడ్డి కుటుంబాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్ ఫోన్లో పరామర్శించారు. పార్టీ క్రమశిక్షణ సంఘం ఛైర్మన్, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఫోన్ నుంచి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. నారాయణరెడ్డి ఆత్మహత్యకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఖాజీపేట మండలం దుంపలగట్టుకు చెందిన నారాయణరెడ్డిపై అక్రమంగా గంజాయి కేసు పెట్టి జైలుకు పంపడంతో పరువు పోయిందని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టు సమయంలో డబ్బులు ఇవ్వకపోవడంతో పోలీసులు తీవ్రంగా హింసించారని వైఎస్ జగన్కు కుటుంబ సభ్యులు తెలిపారు. పూలు అమ్ముకుని జీవించే నారాయణరెడ్డి మరణంతో భార్య, ఇద్దరి పిల్లల భవిష్యత్తు అంధకారంలోకి మారింది. అధైర్య పడవద్దని కుటుంబ సభ్యులను వైఎస్ జగన్ ఓదార్చారు. వారి కుటుంబానికి వైఎస్సార్సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నారాయణరెడ్డి ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకునే వరకూ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## అధికారంలో ఉండగా అన్నీ వెన్నుపోట్లే

- ఇప్పుడు వెన్నుపోటు అంటూ రాజకీయాలా
- వైఎస్ జగన్ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



**నంద్యాల,జూన్ 6( వెలుతురు):**

వైసీపీ హయాంలో అక్రమ కేసులు పెట్టి ప్రజలకు వెన్నుపోటు పొడిచారు... మద్య నిషేధం పేరుతో ప్రజలకు వెన్నుపోటు పొడిచారని అంటూ..వైసీపీ పై ఎమ్మెల్యే భూమా అఖిల ఫైర్ అయ్యారు.. వైసీపీ వెన్నుపోటు దినంతో ప్రజలకు ఏం మెసేజ్ ఇస్తున్నారని ప్రశ్నించారు. నంద్యాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో సొంత సోదరికి వెన్నుపోటు పొడిచారు.. సొంత చెల్లిని, తల్లిని బయటికి గెంటేసి జగన్ వారికి వెన్నుపోటు పొడిచారు.. రైతులకు, రాష్ట్రానికి ప్రజలకు వెన్నుపోటు పొడిచింది వైసీపీ నాయకులే.. వైసీపీ వెన్నుపోటు పొడిచిందనే ప్రజలు ఓటుతో సమాధానం చెప్పారు.. రఘురామ కృష్ణంరాజును అత్యంత దారుణంగా కొట్టి హింసించి కనీసం మెడికల్ ట్రీట్మెంట్ కోసం కూడా సహకరించలేదు.. అమర్నాథ్ గౌడ్ అనే బాబును అత్యంత దారుణంగా పెట్రోల్ పోసి అంటించి చంపినప్పుడు ఏం చేసింది వైసీపి అని ఆమె ప్రశ్నించారు.ఏ రోజు అసెంబ్లీకి రాని వైసీపీ ఎమ్మెల్యేలు కూటమి ప్రభుత్వంలో జీతం తీసుకుంటున్నారని ఎమ్మెల్యే భూమా అఖిల ఆరోపించారు.. వైసీపీ నేతలు నేరాలకు కూడా కులాలు మతాలు తీసుకొస్తున్నారని... ఎంతోమంది ఆత్మహత్య చేసుకుని చనిపోతున్నా పరామర్శించని జగన్ గంజాయి బ్యాచ్ లను పరామర్శించడానికి వెళ్లారని విమర్శించారు.. వైసీపీ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున డ్రగ్స్ గంజాయి పట్టు- కున్న ఒక్క మాట కూడా జగన్ మాట్లాడలేదన్నారు. రెడ్ బుక్కును తలుచుకొని జగన్, వైసీపీ నేతలు భయపడుతున్నారని ఎమ్మెల్యే అన్నారు.. తాము ఇంకా బతికున్నాము అని తెలియజేయడానికే వైసీపీ నాయకులు వెన్నుపోటు- దినం ర్యాలీని చేపట్టారా? అని ప్రశ్నించారు.

# సిమ్లా ఒప్పందం రద్దుపై పాక్ మడతపేచీ

### ఎలింటి నిర్ణయ తీసుకోలేదన్న విదేశాంగ శాఖ

**ఇస్లామాబాద్,జూన్6( వెలుతురు):**



ఇటీవల పహల్గామ్ దాడి తరవాత భారత్ సిమ్లా ఒప్పందం రద్దుచేస్తూ ప్రకటన చేసింది. అయితే దనీఇని పాక్ పెద్దగా పట్టించుకున్నట్లుగా కనిపించడం లేదు. ఏప్రిల్లో పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన తర్వాత నుంచి భారత్-పాక్ సంబంధాలు పూర్తిగా క్షీణించాయి. భారత్ సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. ఆ తర్వాత మే 7వ తేదీన పాకిస్థాన్, పీవోకేలోని 9 ఉగ్ర స్థావరాలపై దాడులు చేసింది. ఆ తర్వాత మే 8,9,10 తేదీల్లో పాక్ సైన్యం భారత మిలిటరీ బేస్లపై దాడికి యత్నించగా.. మన దళాలు తిప్పికొట్టాయి. ఆ తర్వాత పాక్ అభ్యర్థన మేరకు భారత్ ఆపరేషన్ సిందూర్కు తాత్కాలిక విరామం ప్రకటించిన విషయం తెలిసిందే. భారత్తో 1972లో జరిగిన సిమ్లా ఒప్పందం నుంచి వైదొలగే అంశంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పాకిస్థాన్ విదేశాంగ శాఖ వివరణ ఇచ్చింది. ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసీఫ్ మాట్లాడుతూ సిమ్లా ఒప్పందానికి ఇక విలువలేదు.. అదొక డెడ్ డాక్యుమెంట్ అని వ్యాఖ్యానించారు. సింధూజలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేశారో లేదో తెలియదు గానీ.. సిమ్లా అగ్రిమెంట్ పనైపోయిందని పేర్కొన్నారు. దీంతో తాము 1948 నాటి స్థితికి చేరుకొన్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న నియంత్రణ రేఖ కాస్తా కేవలం కాల్పుల విరమణ రేఖగా భావిస్తామన్నది ఆయన ఉద్దేశం. 1948 భారత్-పాక్ యుద్ధం తర్వాత దీనిని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో విదేశాంగశాఖ ప్రతినిధి వివరణ ఇస్తూ భారత్తో ఏ ద్వైపాక్షిక ఒప్పందాన్ని రద్దు చేసుకోవడానికి అధికారికంగా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ప్రస్తుతం ఆ దేశంతో ఉన్న సిమ్లా ఒప్పందంతో సహా అన్ని ద్వైపాక్షిక ఒప్పందాలు అమల్లో ఉంటాయఅని ఆ దేశానికి చెందిన ది ఎక్స్ప్రెస్ ట్రిబ్యూన్కు వెల్లడించారు. 1971లో భారత్-పాక్ యుద్ధం తర్వాత ఈ ఒప్పందం చేసుకొన్నారు. దీని ప్రకారం భారత్-పాక్ సంబంధాల నిర్వహణకు సంబంధించిన చర్యలు తీసుకొంటారు. ఈ ఒప్పందం ద్వారా శాంతియుత ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించుకోవాలని, పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని రెండు దేశాలు తీర్మానించాయి. ఇందులో కశ్మీర్ అంశమూ ఉంది. ఈ ఒప్పందంపై అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీ, పాక్ అధ్యక్షుడు జుల్ఫికర్ అలీ భుట్టో సంతకాలు చేశారు. దీని ప్రకారం ఇరుదేశాలు మూడో దేశం జోక్యం లేకుండా ద్వైపాక్షిక చర్చల ద్వారా వివాదాలను పరిష్కరించుకోవాలి. జమ్మూ కశ్మీర్లో కాల్పుల విరమణ లైన్గా నియంత్రణ రేఖను పునర్నిర్వచించడం. దానిని మార్చకూడదన్న నిర్ణయానికి రెండు దేశాలు కట్టుబడటం. బంగ్లాదేశ్ సార్వభౌమత్వాన్ని గుర్తించడంతోపాటు- ఆ దేశంతో సంబంధాలను సాధారణ స్థితికి తేవడానికి పాకిస్థాన్ కట్టుబడటం వంటి అంశాలున్నాయి.

# ఆర్బిఐ రెపోరేటు తగ్గింపు ప్రకటన

- స్టాక్ మార్కెట్లో భారీ ఊపు
- గరిష్ట లాభాలను అందుకున్న షేర్లు



**న్యూఢిల్లీ,జూన్ 6( వెలుతురు):**

ఆర్బిఐ రెపోరేటు తగ్గింపు ప్రకటనతో భారత స్టాక్ మార్కెట్లు బ్లాక్బస్టర్ ఫ్రైడేని చవిచూశాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటు తగ్గింపుతో నిఫ్టీ 25,000 మార్క్ దాటింది. బ్యాంక్ నిఫ్టీ అయితే, ఏకంగా రికార్డు గరిష్ట స్థాయికి చేరుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఊహించిన దానికంటే ఎక్కువ రెపో రేటు తగ్గింపుతో పాటు నగదు నిల్వ నిష్పత్తి తగ్గింపుతో శుక్రవారం భారత బెంచ్మార్క్ సూచీలు మూడవ సెషన్లోనూ లాభాలు మూటగట్టుకున్నాయి. ఇక, నిఫ్టీ మూడు వారాల్లో ఉత్తమ ట్రేడ్ డే ను నమోదు చేసింది. శుక్రవారం వారాంతంలో మార్కెట్లు- ముగిసే సమయానికి సెన్సెక్స్ 746.95 పాయింట్లు- లేదా 0.92 శాతం పెరిగి 82,188.99 వద్ద ఉంది. నిఫ్టీ 252.15 పాయింట్లు- లేదా 1.02 శాతం పెరిగి 25,003.05 వద్ద ఉంది. ఇక, నిఫ్టీ మిడ్క్యాప్ ఇండెక్స్ 1.2 శాతం పెరగగా, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.8 శాతం పెరిగాయి. ఇక, బిఎస్ఇ-లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ నిన్నటి రూ. 447.5 లక్షల కోట్ల నుండి రూ.451 లక్షల కోట్లకు పెరగడంతో పెట్టుబడిదారుల సంపద ఒక్కరోజులో రూ. 3.5 లక్షల కోట్లకు పైగా పెరిగింది. ఆర్బిఐ రెపో రేటును తగ్గించాలనే నిర్ణయం ద్రవ్యోల్బణం తగ్గిస్తుందని అంచనా వేయడం, హోం లోన్స్ ఇచ్చే బ్యాంకు షేర్లకు ఊతం వచ్చింది. దీంతో బ్యాంకింగ్ స్టాక్స్ తోపాటు రియాల్టీ ఇండెక్స్ 4 శాతం పెరిగింది. దీంతోపాటు-, బంగారు రుణాలకు సంబంధించి లోన్-టు-వాల్యూ నిష్పత్తి పరిమితిని 85శాతానికిపెంచుతామని ఆర్బిఐ చెప్పడంతో గోల్డ్ ఫైనాన్సింగ్ కంపెనీల షేర్లు 5 నుంచి 7 శాతం వరకూ పెరిగాయి. ఆర్బీఐ తాజా నిర్ణయం.. బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.2.5 లక్షల కోట్ల లిక్విడిటీ-ని ఇంజెక్ట్ చేయడానికి దోహదపడింది. ఆర్బీఐ.. ఈని దశలవారీగా 100 బేసిస్ పాయింట్లు- తగ్గించి 3శాతానికి తీసుకురావడంతో ఇది సాధ్యమైంది. తద్వారా బ్యాంకుల దగ్గర నగదు నిల్వలు పెరిగి మరిన్ని రుణాలిచ్చేందుకు వీలవుతుంది. ఫలితంగా మార్కెట్లోకి మనీ మరింతగా వస్తుంది. ఇలా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ ఆర్బీఐ 9.5లక్షల కోట్ల డబ్బును వ్యవస్థలోకి తీసుకువచ్చింది. ఆర్బీఐ తాజా నిర్ణయాలతో నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 1.5 శాతం పెరిగి కొత్త రికార్డు గరిష్ట స్థాయి 56,695కి చేరుకుంది. ఆటో, మెటల్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ప్రైవేట్ బ్యాంక్ ఇండెక్స్లు ఒక్కొక్కటి 1 శాతానికి పైగా పెరిగాయి. మరోవైపు, మీడియా ఇండెక్స్ 1 శాతం తగ్గింది. నిఫ్టీలో అత్యధికంగా లాభపడిన వాటిలో శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్, జెఎస్డబ్ల్యు స్టీల్, యాక్సిస్ బ్యాంక్, మారుతి సుజుకి ఉన్నాయి. అయితే హెచ్డిఎఫ్సి లైఫ్, భారత్ ఎలక్ట్రానిక్స్, టాటా స్టీల్, భారతి ఎయిర్-టెల్, సన్ ఫార్మా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ లో 110 కంటే ఎక్కువ స్టాక్లు వాటి 52 వారాల గరిష్ట స్థాయిలను తాకాయి. వీటిలో గోద్రేజ్ ఇండస్ట్రీస్, ముత్తూట్ ఫైనాన్స్, బజాజ్ హోల్డింగ్స్, మణప్పురం ఫైనాన్స్, మహారాష్ట్ర స్కూటర్స్, ːఈ÷ృ ఇండియా, ఆ÷ఖ స్మాల్ ఫైనాన్స్, ఐఉఎఈ ఆːఈ, ఐఉఎఈ బ్యాంక్, ఫోర్టిస్ హెల్త్కేర్, ÷ూఎ, ఆర అపోలో, వెల్స్పన్ కార్ప్, అబాట్ ఇండియా, అనుపమ్ రసాయన్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఆస్ట్రాజెనెకా ఫార్మా, సోలార్ ఇండస్ట్రీస్, లాయిడ్స్ మెటల్స్, మొదలైన స్టాక్స్ ఉన్నాయి.

# మేఘాలయలో వీడని దంపతలు మిస్టరీ

- నవ వధువు సోనమ్ కోసం ముమ్మర గాలింపు
- కేసును సీరియస్గా తీసుకున్న ప్రభుత్వం

**న్యూఢిల్లీ,జూన్ 6( వెలుతురు):**



మేఘాలయ మర్డర్ కేసు మిస్టరీ వీడడం లేదు. కొత్తగా పెళ్లయి ఈశాన్య రాష్ట్రమైన మేఘాలయకి హనీమూన్ వెళ్లిన ఇద్దరు కొత్త దంపతుల్ని హత్య, కిడ్నాప్ చేసిన సంగతి తెలిసిందే. భర్త రాజా రఘువంశీని కిరాతకులు కత్తితో పొడిచి చంపి లోయలో పడేశారు. అతని మృతదేహం డ్రోన్ల సాయంతో కనుగొన్నారు. అయితే, నవ వధువు సోనమ్ రఘువంశీ ఆచూకీ మాత్రం ఇప్పటికీ దొరకడం లేదు. మే 24న ఈ దారుణం చోటుచేసుకోగా ఇంకా సోనమ్ ఆచూకీ దొరక్కపోవడంతో ఈ కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ కి అప్పగించాలని బాధిత కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారు. నవ దంపతులు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్కు చెందినవారు. రాజా రఘువంశీ, అతని భార్య సోనమ్ అదృశ్యం కావడానికి ఒక రోజు ముందు షిల్లాంగ్ లోని ఒక హోటల్లో దంపతులిద్దరూ నడుస్తూ వెళ్తున్న దృశ్యాలు కొత్తగా బయటపడ్డ సిసి ఫుటేజ్లో కనుగొన్నారు. ఈ ఫుటేజ్ ఆధారంగా ఈ కేసులో కుట్ర కోణం కూడా ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మర్డర్ మిస్టరీని దర్యాప్తు చేయడానికి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు- చేసింది మేఘాలయ సర్కార్. మేఘాలయ పోలీసులు దీన్ని హత్య, కిడ్నాప్ కేసుగా నమోదు చేశారు. ఈ జంట అదృశ్యం కావడానికి ముందు హైకింగ్కు వెళ్లే సమయంలో సోనమ్ తన ఫ్యామిలీతో మాట్లాడింది. ఇదే ఆమె చేసిన చివరి ఫోన్ కాల్. టూర్ కోసం దంపతులిద్దరూ స్థానికంగా ఒక స్కూటర్ను అద్దెకు తీసుకున్నారు. మే 24న తూర్పు ఖాసీ హిల్స్లోని సోహ్రారిమ్లో ఆ స్కూటర్ పార్క్ చేసి ఉంది. స్కూటర్ దొరికిన ప్రదేశానికి కొంత దూరంలో మే 30వ తేదీన సోమవారం నాడు లోయలో రాజా రఘువంశీ మృతదేహం కనుగొన్నారు. అక్కడే రాజా ఫోన్, అతన్ని చంపడానికి ఉపయోగించినట్లు- భావిస్తున్న కత్తినీ కనుగొన్నారు. ఇది హత్య కేసని స్పష్టంగా తెలుస్తుందని.. రాజా హత్యకు గురయ్యారని అందులో ఎటువంటి సందేహం లేదని తూర్పు ఖాసీ హిల్స్ ఎస్పీ అన్నారు. మేఘాలయ పోలీసులు హత్య కేసు నమోదు చేసి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. అయితే, సోనమ్ రఘువంశీ ఆచూకీ ఇప్పటికీ దొరకలేదు. ఆమె కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. దర్యాప్తు సంస్థలూ సెర్చ్ ఆపరేషన్ చేస్తున్నాయి.

## శ్రీ విశ్వశాంతి మహాశక్తిగా గణపతి రూపం

- ఖైరతాబాద్ మహాగణపతి ఎత్తు 69 అడుగుల
- నిర్జల ఏకాదశి పురస్కరించుకున్న కర్రపూజ

**హైదరాబాద్,జూన్6( వెలుతురు):**



హైదరాబాద్లో ప్రతిష్టాత్మకంగా జరిగే ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలకు ఈ ఏడాది శంకుస్థాపనగా కర్ర పూజ ఘనంగా నిర్వహించారు. నిర్జల ఏకాదశి సందర్భంగా శుక్రవారం సంప్రదాయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంవత్సరం ఖైరతాబాద్ మహాగణపతి భక్తులకు 69 అడుగుల ఎత్తులో దర్శనమివ్వనున్నాడు. ఈసారి గణపతి రూపాన్ని శ్రీ విశ్వశాంతి మహాశక్తిగా రూపొందిస్తున్నారు. మహాగణపతికి కుడి వైపు శ్రీ జగన్నాథ స్వామి, శ్రీ లక్ష్మీ సమేత హయగ్రీవ స్వామి దర్శనమిస్తే, ఎడమవైపు లలిత త్రిపురసుందరి మరియు శ్రీ గజ్జలమ్మ దేవి కూడా కొలువై ఉంటారు. ఉత్సవ సమితి సభ్యులు ఈ ఏడాది గణపతి రూపాన్ని అధికారికంగా విడుదల చేశారు. భక్తులకు విశేషంగా ఆకర్షించే విధంగా రూపొందిస్తున్న ఈ గణేశ్ విగ్రహం నిర్మాణం త్వరలో ప్రారంభమవనుంది. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసేందుకు ఉత్సవ కమిటీలు సిద్ధంగా ఉన్నాయి. కార్యక్రమానికి ఖైరతాబాద్ మహాగణపతి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ఈ కార్యక్రమాన్ని శ్రీగణేష్ ఉత్సవ కమిటీ- ఖైరతాబాద్, ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కర్ర పూజ కార్యక్రమంలో కేంద్ర మంత్రి, స్థానిక ఎంపీ కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి కూడా పాల్గొన్నారు. రెండు ఉత్సవ కమిటీల అధ్యక్షుడిగా దానం నాగేందర్ నేతృత్వంలో కర్ర పూజ జయప్రదంగా ముగిసింది.

# హరిహర వీరమల్లు మరోమారు వాయిదా

## అధికారికంగా ప్రకటించిన చిత్ర బృందం

పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తోన్న సరికొత్త చిత్రం 'హరిహర వీరమల్లు'. అనుకున్నట్‌ఉలగానే వాయిదా పడింది. ఇప్పటికే ఈ సినిమా పలుమార్లు వాయిదా పడిన విషయం తెలిసిందే. జూన్ 12న ఇది విడుదలవుతుందని భావించిన అభిమానులకు మరోసారి నిరాశ ఎదురైంది. 'హరిహర వీరమల్లు' మరోసారి వాయిదా పడినట్లు టీమ్ మరోఆరు అధికారికంగా ప్రకటించింది. అచంచలమైన ఓపిక, నమ్మకంతో 'హరిహర వీరమల్లు' సినిమాకు తోడుగా నిలిచిన అభిమానులు, శ్రేయోభిలాషులు, సినీ ప్రేమికులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. గతంలో ప్రకటించిన విధంగా జూన్ 12వ తేదీకి ఈ చిత్రాన్ని మీ ముందుకు తీసుకురావడానికి అవిశ్రాంత ప్రయత్నాలు చేస్తున్నాం. ఎంతో శ్రమించినప్పటికీ వివిధ కారణాల వల్ల ఆ రోజు సినిమాని విడుదల చేయలేకపోతున్నాం. కష్టమైనప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. పవన్ కల్యాణ్ ఇమేజ్‌ను దృష్టిలోఉంచుకుని దీనిని మరింత గొప్పగా తీర్చిదిద్దాలనేది మా ఆలోచన. ప్రతి ఫ్రేమ్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, అద్భుతమైన చిత్రంగా మలిచే ప్రయత్నంలో నిమగ్నమై ఉన్నాం. అందుకే మేము మరికొంత సమయం తీసుకుంటున్నాం. మీ ఎదురుచూపులకు బహుమతిగా గొప్ప చిత్రాన్ని అందిస్తామని హామీ ఇస్తున్నాం అని టీమ్ ప్రకటించింది. సోషల్‌మీడియా వేదికగా జరిగే ప్రచారాలను ఏమాత్రం నమ్మవద్దని కోరింది. సినిమాకు సంబంధించిన విషయాలను తామే అధికారికంగా ప్రకటిస్తామని చెప్పింది. అంతేకాకుండా త్వరలోనే ట్రైలర్ రిలీజ్ కానుందని.. కొత్త విడుదల తేదీని కూడా ప్రకటిస్తామని టీమ్ వెల్లడించింది. హిస్టారికల్ యాక్షన్ మూవీగా ఈ సినిమా సిద్ధమవుతోంది. నిధి అగర్వాల్ కథానాయిక. మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో సాగే కథ ఇది. కీరవాణి స్వరాలు అందిస్తున్నారు. రెండు భాగాల్లో దీనిని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.



# రామాయణ్ కోసం కష్టపడుతున్న రణ్‌బీర్

యానిమల్ సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ తన అప్‌కమింగ్ ప్రాజెక్ట్ 'రామాయణ్' కోసం సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. దంగల్ దర్శకుడు నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కోసం రణబీర్ ఇప్పటికే చాలా కష్టపడుతున్నట్లు- తెలుస్తుంది. అయితే ఈ సినిమాలో రణ్‌బీర్ రాముడి పాత్రను పోషిస్తున్న విషయం తెలిసిందే. దీనికోసం రణ్‌బీర్ క్లీన్ షేవ్‌తో దర్శనమిచ్చాడు. సంజయ్ లీలా భన్సాలీ 'లవ్ అండ్ వార్' సినిమా కోసం మీసాలతో కనిపించిన రణ్‌బీర్ తాజాగా రామాయణ్ కోసం క్లీన్ షేవ్‌లో కనిపించడంతో ప్రస్తుతం ఇందుకు సంబంధించిన లుక్ వైరల్‌గా మారింది. ఈ సినిమాలో సౌత్ స్టార్ యష్ రావణుడుగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్నట్లు- సమాచారం. ప్రస్తుతం ముంబైలోని ఫిలింసిటీలో 'రామాయణ్' కీలక సన్నివేశాల షూటింగ్ జరుగుతున్నట్లు- తెలుస్తుంది. ఈ సినిమాను రెండు భాగాలుగా విడుదల చేయనున్నట్లు- చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. మొదటి భాగం 2026 దీపావళికి, రెండో భాగం 2027 దీపావళికి విడుదల చేయాలని మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలో సన్నీ డియోల్ హనుమాన్‌గా, లారా దత్తా -కై-కేయిగా, అరుణ్ గోవిల్ దశరథుడిగా కనిపించనున్నట్లు- వార్తలు వస్తున్నాయి. అలాగే, కాజల్ అగర్వాల్ మండోదరి పాత్రలో నటించనున్నట్లు- సమాచారం.



# ప్రియదర్శితో మిత్రమండలి

టాలీవుడ్ నటుడు ప్రియదర్శి మరో కొత్త ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. గీతా ఆర్ట్స్ 2 బాధ్యతల నుంచి విరామం తీసుకున్న నిర్మాత బన్నీ వాస్, తన సొంత బ్యానర్ బన్నీ వాస్ వర్క్స్‌ని ప్రారంభించి, దానిలో మొదటి సినిమాగా ఒక కొత్త ఎంటర్‌టైనర్‌ను నిర్మించబోతున్నట్లు- ప్రకటించిన విషయం తెలిసిందే. మిత్రమండలి అంటూ ఈ సినిమాను తెరకెక్కించబోతుండగా.. బన్నీ వాసు ఈ సినిమాను సమర్పిస్తున్నారు. సప్త అశ్వ మీడియా వర్క్స్ మరియు వైరా ఎంటర్-టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రియదర్శి కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ నిహారిక క కథానాయికగా నటించబోతుంది. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. కామెడీ ఎంటర్-టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాతో ఎస్ విజయేంద్ర దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు. ఆర్ఆర్ ధృవన్ సంగీతం అందించబోతున్నాడు. ఈ సినిమా బ్యాండ్ ట్రూప్ నేపథ్యంలో రాబోతున్నట్లు తెలుస్తుంది.




# సింగిల్ థియేటర్ల మనుగడకు ప్రమాదం

## ప్రేక్షకులను థియేటర్లకు రప్పిగలగాలి: బన్నీ వాస్

ప్రస్తుత థియేటర్ల విధానం చూస్తే త్వరలోనే సింగిల్ థియేటర్లు మూతపడడం ఖాయమని నిర్మాత బన్నీ వాస్ ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమలో నెలకొన్న తాజా పరిస్థితులను ఉద్దేశించి బన్నీ వాస్ కీలక పోస్ట్ పెట్టారు. నిర్మాతలు, ఎగ్జిబిటర్లు ప్రస్తుతం పర్సంటేజీ విధానంపై కాకుండా ప్రేక్షకులను తిరిగి థియేటర్లకు రప్పించడంపై దృష్టి పెట్టాలన్నారు. థియేటర్లలో విడుదలైన నెలలోపే ఒక చిత్రాన్ని ఓటీటీలోకి తీసుకురావడం వల్ల.. భవిష్యత్తులో సింగిల్ స్క్రీన్ థియేటర్లు భారీస్థాయిలో మూతపడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఎగ్జిబిటర్లు, నిర్మాతలు గ్రహించాల్సింది, కరెక్ట్ చేసుకోవాల్సింది పర్సంటేజీ విధానం కాదు. ప్రేక్షకులను తిరిగి థియేటర్లకు రప్పించడం ఎలా అన్న విషయాన్ని వాళు పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఇప్పుడున్న అర్ధ రూపాయి వ్యాపారంలో నీది పావలా, నాది పావలా అని కొట్టుకోవడం కాదు. మునపటిలా మన వ్యాపారాన్ని రూపాయికి ఎలా తీసుకెళ్లాలి అనేది ఆలోచించాలి. సినిమా విడుదలైన 28 రోజుల్లోపే ఓటీటీకి ఇవ్వాలనే -టె-ండ్ కొనసాగితే రాబోయే నాలుగైదు సంవత్సరాల్లో 90 శాతం సింగిల్ స్క్రీన్స్ మూతపడే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయాన్ని పెద్ద హీరోలు కూడా ఆలోచించాలి. మీరు రెండు సంవత్సరాలకు ఒక సినిమా, మూడు సంవత్సరాలకు ఒక సినిమా చేస్తే థియేటర్లకు ప్రేక్షకులు దూరమైపోతారు. ఈ సమయంలో చాలామంది యజమానులు తమ థియేటర్లను నడపలేక మూసేస్తారని బన్నీ వాస్ పేర్కొన్నారు.



# అమితాబ సినిమాలే మన హీరోలను నిలబెట్టాయ్

## ఆనాటి తెలుగు రీమేక్‌లపై ఆర్జీవీ సంచలన కామెంట్స్

ఆర్జీవీ ఎప్పటికప్పుడు ఏదో ఒక సంచలన కామెంట్స్ చేస్తూనే ఉంటారు. అది ఎంత పెద్ద వివాదం అయినా ఆయన పెద్దగా పట్టించుకోరు. మరోసారి అలాంటి కామెంట్స్ చేశారు. తాజాగా ఆయన ఓ పాడ్ కాస్ట్ ప్రోగ్రామ్ లో పాల్గొన్నారు. ఇందులో మాట్లాడుతూ.. ఇప్పుడు బాలీవుడ్ ఇండస్ట్రీ పడిపోయింది. మన సినిమాలను వాళ్లు కాపీ కొడుతున్నారు. కానీ ఒకప్పుడు బిగ్ బీ సినిమాలే మన సౌత్‌కు స్ఫూర్తిగా ఉండేవి. అమితాబ్ బచ్చన్ సినిమాలను మన వాళ్లు కాపీ కొట్టేవారు. అప్పట్లో చిరంజీవి, రజినీకాంత్, ఎన్టీరామారావు, ఏఎన్నార్ బిగ్ బీ సినిమాలను రీమేక్ చేసేవాళ్లు. అలా చేయడం వల్లే ఇక్కడ హిట్లు కొట్టి స్టార్ హీరోలు అయ్యారు. బిగ్ బీ వల్లే మన వాళ్లు ఇక్కడ అభిమానులకు దేవుళ్లు అయ్యారు. కానీ 1990లో అమితాబ్ కొంత బ్రేక్ తీసుకోవడం వల్ల మనవాళ్లు అదే మాస్ సినిమాలు తీస్తూ వచ్చారు. చాలా వరకు బిగ్ బీ వల్లే మన సౌత్ లో సినిమా ఇండస్ట్రీక్రి ఆదరణ పెరిగింది. కానీ ఆ విషయాన్ని ఎవరూ



ఒప్పుకోరు. ఇప్పుడు బాలీవుడ్ చాలా పడిపోయింది. మన సినిమాలు అక్కడ రీమేక్ అవుతూ మంచి హిట్ కొడుతున్నాయి. పరిస్థితి ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఒక్కోసారి ఒక్కో ఇండస్ట్రీ టైమ్ నడుస్తుందని వ్యాఖ్యానించాడు. జంజీర్ మొదలు ముఖద్దర్ కా సికిందర్ వరకు అనేక సినిమాలు తెలుగులో రీమేక్ చేశారు.

# వైవాహిక బంధంలోకి నటుడు అఖిల్

## 8న అన్నపూర్ణలో వివాహ విందు

తన బ్యాచిలర్ లైఫ్‌కు గుడ్‌బై చెప్పేశారు నటుడు అఖిల్ అక్కినేని. శుక్రవారం తెల్లవారుజామున ఆయన వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. తన ప్రియురాలు జైనబ్ రవ్జీతో ఆయన వివాహం వేడుకగా జరిగింది. హైదరాబాద్‌లోని నాగార్జున నివాసంలో జరిగిన ఈ వివాహ వేడుకకు కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు, చిరంజీవి కుటుంబం, రాజమౌళి తనయుడు కార్తికేయ, దర్శకుడు ప్రశాంత్ నీల్, నటుడు శర్వానంద్‌తోపాటు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. దీనికి సంబంధించిన పలు ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. జూన్ 8న రిసెప్షన్ జరగనుంది. అన్నపూర్ణ స్టూడియోస్‌లో జరగనున్న ఈ వివాహ విందుకు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు. దిల్లీకి చెందిన జైనబ్ థియేటర్ ఆర్టిస్ట్ మాత్రమే కాదు, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ కూడా. ఇండియాలోనే కాదు దుబాయ్, లండన్‌లోనూ ఆర్టిస్ట్‌గా ఆమె రాణించారు. రెండేళ్ల క్రితం అఖిల్‌తో మొదలైన పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల అంగీకారంతో ఒక్కటయ్యారు. జైనబ్ తండ్రి జుల్ఫీ రవ్జీ, నాగార్జున కుటుంబాల మధ్య కొన్నేళ్లుగా స్నేహబంధం ఉంది. అంతకుముందు అఖిల్ ఎంగేజ్మెంట్ జరిగినా పెళ్లి దగ్గర ఆగిపోయింది.









# ఉపాధిరంగంగా ఫుడ్ ప్రాసెసింగ్

● పటిష్టంగా వ్యవసాయ అనుబంధ రంగం
● ఉపాధి, ఉద్యోగాలకు ఇదే సరైన మార్గం

**న్యూఢిల్లీ,జూన్6( వెలుతురు):**

వ్యవసాయంరంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారేలా ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన అసవరం ఉందని వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. సస్యవిప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకోవాల్సిన తరుణమిదేనని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్న ప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం లేకున్నా ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కూలీ కోసం పట్టణాలకు తరలి వెళుతున్న వారిని ఆదరించి వ్యవసాయం వైపు మళ్లించాలని సూచిస్తున్నారు. అలా చేయడంవల్ల ఆధునిక వ్యవసాయరంగం మారగలదని అన్నారు. ఇప్పుడు పండుతున్న పంటలకు కూడా సరైన ప్రాసెసింగ్ యూనిట్లు లేవని అంటున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని అంటున్నారు. ఇలాంటి యూనిట్లు పెట్టేవారిని ప్రోత్సహించాలి. బహుళ జాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలి. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరాఘాతంగా మారింది. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమిా సారం తగ్గుతోంది. ఏ పంటపండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. దీనికి తాజా ఉదాహరణ కంది, మిర్చి పంటలే. రైతులని



కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందిం చాలి. ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. వంటనూనెల మిల్లులను దేశీయంగా రూపొదించి, మన నూనెలను మనమే వాడగలిగేలా చేయాలన్నారు. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. ఇతర దేశాల నుంచి ఆహార ధాన్యాల దిగుబడి తక్షణం ఆగిపోవాలని అన్నారు. అప్పుడు మన అసవరాలకు అనగుణంగా పంటల విధానం వస్తుందని అన్నారు. దేశీయంగా ఉపాధి అవకాశాలు పెంచుకుంటూ.. ఉత్పత్తి రంగాలకు ఊతమిచ్చేలా సాగాల్సి ఉంది. అందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను పెంచుకోవాల్సి ఉంది. మరోవైపు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు పట్టణాలకు వలస వెళ్ళి దినసరి కూలీలుగా మారు తున్నారు. చిన్నాచితక వ్యాపారాలతో తోపుడు బళ్లు నడుపుతున్నారు. వ్యవసాయ భూమి లేని కూలీలు కౌలుకు తీసుకొని నష్టాలపాలయి బ్రతుకునీడ్చ లేక,అవమానం భరించలేక, చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇప్పుడు అనేకమంది మళ్లీ వ్యవసాయం వైపు మళ్లుతున్నారు. వారి శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకునేలా చేయాలి. ఈ క్రమంలో విదేశాలకు భారీగా ఎగుమతి చేసేలా పంటలు పండించగలగాలి. దీంతో మనకు విదేశీమారకం కూడా ఆదా కాగలదు. అలా పంటలు పండించే సత్తా మన రైతాంగానికి ఉందని గుర్తుంచుకోవాలి. మన రైతులనే ప్రోత్సహించి మన పంటలనే కాపాడుకునేలా రైతాంగ విధానాలు వస్తే తప్ప వారు బతికి బట్ట కట్టేలా లేరు. రైతుల సమస్యలను పట్టించుకునే దిశగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఏటా ఒక విధానంగా గాకుండా, రుణ మాఫీలు అవసరం లేని విధంగా రైతులు స్వయం సమృద్ధిగా ఎదిగేలా చేయాలి.

# ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం

## సబ్సిడీపై విత్తనాల సరఫరా



**గుంటూరు,జూన్6( వెలుతురు:**

ఈ ఏడాది ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం జరుగుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఈ మేరకు ఖరీఫ్ ప్రణాళికలను వ్యవసాయ అధికారులు సిద్ధం చేశారు. తొలకరి జల్లులు కురవగానే వరిసాగు చేసే పొలాల్లో పచ్చి రొట్టె ఎరువు సాగు చేయాలని వ్యవసాయ శాఖ రైతులకు సూచిస్తోంది. గ్రామాల్లో వ్యవసాయ సదస్సులు నిర్వహించి పంటల సాగుపై వ్యవసాయ అధికారులు సూచనలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సబ్సిడీపై రైతులకు పచ్చిరొట్ట ఎరువు సాగుకు విత్తనాలు పంపిణీ వ్యవసాయ శాఖ చేపట్టింది. పిల్లి పెసర, జనుము, జీలుగ విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఖరీఫ్ సీజన్ పంటల సాగుకు అన్నదాతలు దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేస్తున్నారు. తొలకరి జల్లులు కురవగానే సాగు ఆరంభించేందుకు అన్నదాతలు విత్తన సేకరణలో నిమగ్నమయ్యారు. కోటి ఆశలతో రైతులు పంటల సాగుకు సమయత్తమయ్యారు.గత ఏడాది పంటల సాగు ఆశాజనకంగా ఉంది. సకాలంలో వర్షాలు కురవటం, సాగర్ జలాశయం నిండటంతో వరి, పత్తి, మిరప ప్రధాన పంటలు విస్తృతంగా సాగయ్యాయి. ఈ ఏడాది కూడా సకాలంలో వర్షాలు కురవాలని రైతులు వరుణుడిని ప్రార్థిస్తున్నారు. రుతుపవనాలు ప్రభావంతో మే నెలాఖరుకే వర్షాలు మొదలయ్యాయి. అయితే మధ్యలో మళ్లీ వారం రోజుల గ్యాప్ వచ్చింది.ఈయేడు భార వర్షపాతం నమోదు అవుతుందని వాతావరణశాఖ వెల్లడించింది. గత ఏడాది జిల్లా అంతట పంటల సాగు ఆశాజనకంగా ఉంది. ఖరీఫ్, రబీ సీజన్‌లలో సాధారణ విస్తీర్ణంలో 90 శాతానికి పైగా ఒక్క ఖరీఫ్‌లో పంటలు సాగు అయ్యాయి. గత ఖరీఫ్‌లో వరి, మిరప సాగు గణనీయంగా పెరిగింది. రబీలో కూడా విస్తృతంగా వరి సాగు చేశారు. పత్తి, అపరాల పంటల సాగు గత ఏడాది గణనీయంగా తగ్గింది. సకాలంలో వర్షాలు కురవటంతో గత ఏడాది జూన్ నెలాఖరుకు పత్తి సాగు ప్రారంభమైంది. ఈ ఏడాది పత్తి, మిరప, వరి విత్తనాలను పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. వర్షాలు కురవగానే పత్తి సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఈ పరిస్థితి కానరావడం లేదు. పత్తి, మిరప విత్తనాలు పంపిణీ చేయాలంటే విత్తన ఒప్పందం తప్పనిసరి. ఈ పక్రియ ఇంకా ఒక కొలిక్కిరాలేదు. దీంతో విత్తన పంపిణీ జరుగుతుందా లేదా అనే సందేహాలు నెలకొన్నాయి. వరి విత్తనాలు కూడా పంపిణీపై ఇంకా స్పష్టత రాలేదు. డిమాండ్‌కు తగ్గట్టుగా ఏపీ సీడ్స్ వద్ద విత్తన నిల్వలు లేవు. విత్తన డిమాండ్‌పై మండలాల వారీగా వ్యవసాయ అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. విత్తన సమస్యలు రైతులను వెంటాడే పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు విత్తన నిల్వలపై దృష్టి సారించాలి. అన్నదాతలు వ్యవసాయ పనులు మొదలు పెట్టారు. వీరి ఆత్రుతను విత్తనాలు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. డిమాండ్ ఉన్న ప్రత్తి విత్తనాల ప్యాకెట్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో రైతులు అదే బీటీ విత్తనం కొనుగోలుకు మక్కువ చూపుతున్నారు.

# మళయాళ నటుడు చాకో కారుకు ప్రమాదం

● తమిళనాట ప్రమాదంలో తండ్రి మృతి



**చెన్నై,జూన్6( వెలుతురు):**

ప్రముఖ మలయాళ నటుడు, దసరా సినిమా విలన్ షైన్ టామ్ చాకో కుటుంబం ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. శుక్రవారం ఉదయం వారు ప్రయాణిస్తున్న కారు ఓ లారీని ఢీకొట్టింది. తమిళనాడులోని పాలకోట్టాయ్ సమీపంలో ఉదయం 7 గంటల ప్రాంతంలో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో చాకో తండ్రి అక్కడికక్కడే చనిపోయాడు. చాకో, చాకో తల్లి తీవ్రంగా గాయపడ్డారు. కారు డ్రైవర్, చాకో తమ్ముడికి కూడా గాయాలు అయినట్లు తెలుస్తోంది. గాయపడ్డ వారిని హుటాహుటిన ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# దళిత బాలికపై సామూహిక అత్యాచారం

● గర్భం దాల్చడంతో వెలుగులోకి దాష్టీకం

**పుట్టపర్తి,జూన్ 6( వెలుతురు):**



మరో దారుణంవెలుగు చూసింది. మైనర్ బాలికను సామూహిక అత్యాచరంతో గర్భవతిని చేశారు. తొమ్మిదో తరగతి చదువుతోన్న ఓ దళిత బాలికను పలువురు యువకులు మాయ మాటలతో మభ్యపెట్టారు. ఆ క్రమంలో ఆ బాలికపై వారు సామూహిక లైంగిక దాడి చేశారు. ఈ నేపథ్యంలో ఆ బాలిక గర్భవతి అయింది. అయితే ఆ బాలిక ఇటీవల కాలంలో తరచూ తీవ్ర అనారోగ్యానికి గురవుతోంది. దీంతో ఆమెను తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. వైద్యులు ఆ బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించి.. ఆమె గర్భవతి అని తెలిపారు. ప్రస్తుతం ఆ బాలికకు ఆరో నెల అని వైద్యులు వెల్లడించారు. దీంతో కుమార్తెను నిలదీయడంతో.. జరిగిన సంఘటనను తన తల్లిదండ్రులకు వివరించింది. అనంతరం వారు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటన శ్రీసత్యసాయి జిల్లాలోని రామగిరి మండల పరిధిలోని ఏడుగుర్రాలపల్లి గ్రామంలో చోటు- చేసుకుంది. ఈ ఘటనపై రామగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను తల్లిదండ్రుల సమక్షంలో ఆ బాలికను పోలీసులు విచారించారు.

# పత్తి సాగుకే రైతుల మొగ్గు

● సోయాతో నష్టాలు తప్పవన్న భయం



**ఆదిలాబాద్,జూన్6( వెలుతురు):**

ఆదిలాబాద్ జిల్లాలో ఏటా పత్తి సాగుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది పత్తి పంట సాగు వైపే రైతులు మళ్లీ పరుగులు తీస్తున్నారు. గత అనుభవంతోనే ఈసారి పత్తి పంటను సాగు చేసేందుకు రైతులు అధికంగా ఆసక్తి చూపుతున్నారు.వర్షాధార పంటగా సాగయ్యే పత్తికి జిల్లా వాతావరణం అనుకూలంగా ఉండడంతో పాటు నల్లరేగడి భూముల్లో అధిక దిగుబడులు రావడమే అసలు కారణమని రైతులు చెబుతున్నారు. అధికారులు మాత్రం మిశ్రమ పంటలను సాగు చేస్తేనే మంచి ఫలితా లు వస్తాయని సూచిస్తున్నారు. రైతులు స్వయంగా పత్తి పంటను సాగు చేసిన అనుభవంతోనే ముందుకు సాగుతున్నారు. తొలకరి వర్షాలకే పత్తి పంటను విత్తుతే చీడ పీడల నుంచి తట్టుకుని అధిక దిగుబడులు వస్తాయని పేర్కొంటున్నారు. వాణిజ్య పంటగా పత్తి పంటతో అప్పులు తీరే అవకాశం ఉందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా సంప్రదాయ పంటల సాగుతో రైతులకు భారీ నష్టాలు వస్తున్నాయని భావించిన ప్రభుత్వం గత ఏడాది నుంచి పత్తి పంట సాగును ప్రోత్సహిస్తూ వస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ పంటలైన సోయా, కంది పంటల సాగు తగ్గుతూ వస్తోంది. పంట చేతికి వచ్చే సమయంలో సోయా, కంది పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతూ లబోదిబో మంటున్నారు. ఇలాంటి పరిస్థితు ల్లో ఈ ఏడాది పత్తి పంటనే సా గు చేసేందుకు జిల్లా రైతులు అ ధికంగా ఆసక్తి చూపుతున్నారు. అయితే అధికారులు భావిస్తున్నట్లుగా మిశ్రమ పంటల సాగు విస్తీర్ణం తగ్గి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం కనిపిస్తుంది.అంచనాలకు మించిన ధరలుఅంతర్జాతీయ మార్కెట్‌లో ధరల ఎచ్చుతగ్గుల కారణంగా పత్తి పంటకు ధరలు ఉండవని ప్రచారం జరిగినప్పటికీ గతేడు పత్తి పంటల ధరలు అంచనాలకు మించి ధర పలికింది. పంట చేతికి వచ్చినప్పటి నుంచి కొనుగోలు ముగిసే వరకు మద్దతు ధరను మించిన ధరలేదక్కాయి. తెల్ల బంగారం సిరులు కురిపించడంతో ఈ సారి కూడా రైతులు పత్తి పంటపై భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. దీంతో ఈ ఖరీఫ్‌లో జిల్లాలో 20వేల ఎకరాలకు పై గా పత్తి పంట సాగు విస్తీర్ణం పెరిగిందని అధికారులే చెబుతున్నారు. ఇప్పటికే రైతులు విత్తనాలను కొనుగోలు చేసి తొలకరి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఒక ఏడాది నష్టం వచ్చిన మరో ఏడాది ఆదుకోకపోతుందా అనే భావనతో పత్తి పంటను సాగు చేసేందుకు రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. అయితే ధరలు భాగానే ఉన్న పెట్టుబడి ఖర్చులు మరింతగా పెరిగి పోవడంతో లాభాలు అంతంత మాత్రంగానే వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. జిల్లా సాగు భూమి విస్తీర్ణం 5 లక్ష ల 71 వేల ఎకరాలు కాగా ఈ సారి 3లక్షల 95వేల 200 ఎకరాలలో పత్తిపంట సాగయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఖరీఫ్ పంటల సాగుకు వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. గతేడా కంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయం గా పెరుగనుంది. మూడు నాలుగేళ్లుగా విస్తీర్ణం తగ్గినా గత ఏడాది ధరలు పుంజుకోవడంతో ఈసారి సాగుపై రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

# ఆర్బీఐ సంచలన నిర్ణయం

● కీలక వడ్డీరేట్లు మరోమారు తగ్గింపు
● రెపోరేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్ల మేర తగ్గింపు
● గృహ,వాహన రుణాలపై తగ్గనున్న వడ్డీలు..ఇఎంఐలు

**ముంబై,జూన్6( వెలుతురు):**

ఆర్బీఐ సంచలన నిర్ణయం తీసుకుంది. వరుసగా మూడోసారి వడ్డీరేట్లను తగ్గించింది. రెపోరేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. దీనివల్ల రెపో రేటు 6 శాతం నుంచి 5.50 శాతానికి దిగొచ్చింది. ఆర్బీఐ తీసుకున్న నిర్ణయంతో గృహ రుణాల వడ్డీరేట్లు 7.5 శాతం తగ్గనున్నాయి. అలాగే బ్యాంకు ఈఎంఐలు తగ్గే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.దేశ ఆర్థిక వృద్ధిని పెంపొందించడం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.16 శాతంగా ఉంది. ఎస్‌బీఐ నివేదిక ప్రకారం 2025-26 ఆర్థిక సంవత్సరంలో రెపోరేటు- మరో 75 బేసిస్ పాయింట్ల తగ్గింపు జరిగే అవకాశం ఉంటుంది. దీంతో రెపో రేటు- 5.0నుంచి 5.25కు చేరుకోవచ్చు. దీనివల్ల బ్యాంకులు కూడా రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించడానికి వీలుంటుంది. వడ్డీ రేట్లను తగ్గించడం ఈ ఏడాదిలో వరుసగా ఇది మూడోసారి అని చెప్పాలి. ఫిబ్రవరి, ఏప్రిల్‌లో 25 బేసిస్ పాయింట్ల చొప్పున తగ్గించారు. తాజాగా మళ్లీ వడ్డీ రేట్లు తగ్గించడం ద్వారా వివిధ రకాల ప్రయోజనాలు కలగనున్నాయి. గృహ, వాహన, వ్యక్తిగత రుణాలపై వడ్డీ రేట్లు తగ్గే అవకాశం ఉంటుంది. కాబట్టి రుణాలు తీసుకున్న వారందరికీ ఇది శుభవార్త అనే చెప్పాలి. నెలవారీ చెల్లింపుల వాయిదా భారం మోస్తున్న గృహ వినియోగదారులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి శుభవార్త చెప్పిందనే అనుకోవాలి. కీలక వడ్డీరేట్లను ఏకంగా 50 బేసిస్ పాయింట్లు- తగ్గించి మరింత ఊరట కల్పించింది. తాజా నిర్ణయంతో గృహ రుణగ్రహీతలపై ఈఎంఐ భారం మరింత తగ్గనుంది.ఫ్లోటింగ్ రేట్‌పై గృహ రుణాన్ని తీసుకున్న వారికి సవరించిన వడ్డీరేటు- ఆధారంగా ఊరట లభించనుంది. 2019 అక్టోబర్ 1 తర్వాత జారీ చేసిన గృహ రుణాలన్నీ ఫ్లోటింగ్ రేటు-తో జారీ అయినవే. కాబట్టి వారికి బ్యాంకులు ఆ మేరకు వడ్డీ రేట్లను సవరిస్తాయి. పాత వినియోగదారులకే కాదు.. కొత్తగా రుణాలు తీసుకునేవారు తక్కువ వడ్డీకే రుణాలు పొందొచ్చు. పైగా ఎక్కువ మొత్తం రుణం పొందేందుకు అవకాశం ఉంటుందని బ్యాంకింగ్ నిపుణులు చెబుతున్నారు. ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించిన నేపథ్యంలో రుణగ్రహీతల ముందు ఇప్పుడు రెండు ఆప్షన్లు ఉండబోతున్నాయి. ఒకటి ఈఎంఐ తగ్గించుకోవడం. రెండోది కాలవ్యవధి తగ్గించుకోవడం. దీంట్లో రెండో ఆప్షన్ ఎంచుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల దీర్ఘకాలంలో ఎక్కువ మొత్తంలో వడ్డీని ఆదా చేసుకోవచ్చని పేర్కొంటున్నారు. ఉదాహరణకు ఈ ఏడాది జనవరిలో 20 ఏళ్ల కాలవ్యవధికి రూ.50 లక్షల రుణం తీసుకున్నారనుకుందాం. అప్పట్లో బ్యాంకు వడ్డీ రేటు 8.50శాతం ఉంటే.. నెలకు రూ.43,391 చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడు ఆర్‌బీఐ మూడు దఫాల్లో వడ్డీ రేట్లను సవరించడంతో ఈఎంఐ మొత్తం రూ. 40,280కి తగ్గనుంది. అంటే నెలకు దాదాపు రూ.3వేల పైనే ఆదా అవుతుంది. దీర్ఘకాలంలో మొత్తంగా దాదాపు రూ.7.12లక్షల మేర వడ్డీ భారం తగ్గుతుంది. ఒకవేళ ఈఎంఐని స్థిరంగా ఉంచుకొని కాలవ్యవధిని మార్చుకుంటే గనుక.. రుణ చెల్లింపు గడువు దాదాపు మూడు సంవత్సరాల వరకు తగ్గుతుంది. ఈ ఏడాది జనవరిలో 240 నెలల కాల వ్యవధికి రూ.50 లక్షల రుణం తీసుకున్నారనుకుంటే.. ఆర్‌బీఐ ఊరటతో ఈ కాలవ్యవధి 206 నెలలకు తగ్గుతుంది. అంటే వడ్డీ భారం దాదాపు రూ.14.78 లక్షల మేర ఆదా అవుతుంది. ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయంతో బ్యాంకులు ఎంత వేగంగా వినియోగదారులకు ఆ ప్రయోజనాన్ని బదిలీ చేస్తారనే దానిపై ఈ ఊరట ఆధారపడి ఉంటు-ంది.




ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్ లెండింగ్ రేటుపై తీసుకున్న రుణాలను బ్యాంకులు వెంటనే సవరించాల్సి ఉంటు-ంది. మూడు నెలలకోసారి సమీక్షించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఆర్‌బీఐ నిబంధనలు చెబుతున్నాయి.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com